సంపుటి 11 సంచిక 4 మే - జూన్ 2023

# పల్లెసృజన

www.pallesrujana.org

## గ్రామీణ సృజనా శక్తికి వెలుగుదారుల వేదిక

honeybee.org
Vol-11 Issue-4
వెల : రూ. 20/-


























"నేషనల్ టెక్నాలజీ వీక్" 25వ వార్షికోత్సవంలో భాగంగా 'అటల్ ఇన్నోవేషన్ మిషన్' వారు మే 11-14 తేదీలలో ఏర్పాటు చేసిన ఇన్నోవేషన్ల ప్రదర్శన కార్యక్రమంలో 'పల్లెసృజన' ఇన్నోవేటర్ 'మోధా శివకుమార్' ఇన్నోవేషన్ "చేనేత పెడల్ లిఫ్టింగ్" యంత్రాన్ని పరిశీలిస్తున్న భారత ప్రధాని 'శ్రీ నరేంద్ర మోడీ', కేంద్ర రక్షణ శాఖ మంత్రి 'శ్రీ రాజ్‌నాథ్ సింగ్' తదితరులు

సంపుటి-11 సంచిక - 4 మే - జూన్ 2023

# పల్లెసృజన

పల్లెసృజన, 102, వాయుపురి,
సైనిక్‌పురి పోస్ట్, సికింద్రాబాద్- 500 094.
ఫోన్ : 040-40253096, 98660 01678
E-mail : president@pallesrujana.org,
Visit :www.pallesrujana.org

**సంపాదకవర్గం**

ప్రధాన సంపాదకులు :
**బ్రిగేడియర్ (రిటైర్డ్) పోగుల గణేశం**

సంపాదకులు :
**జమ్ములమడక శశిమోహన్**

ఉప సంపాదకులు :
**పల్లె వీర రాఘవ రెడ్డి**

సలహాదారులు :
**ప్రొ. అనిల్ గుప్త**
**పి. చంద్రకాంత్ శర్మ**
**జాగర్లమూడి దుర్గాప్రసాద్**
**జమ్ములమడక శ్రీకర్**
**కల్పనా శాస్త్రి**

డిజైనింగ్ & ప్రింటింగ్ :
**నరేంద్ర గ్రాఫిక్స్**, హైదరాబాద్.
ఫోన్ : 81257 99904,
E-mail : narendragrafixhyd@gmail.com

**Rs. 400/-**
**for 2 years Subscription**

## ఈ సంచికలో.....


* తక్కువ ఖరీదులో అలుపు లేకుండా ఎరువులు వేసే పరికరం చేసిన 'సత్యనారాయణ రెడ్డి' - 3
* 'వ్యవసాయదారుల పంటల విధానం, మార్కెటింగ్‌పై విజయకుమార్ గారి అవగాహన - 6
* జాతీయ అవార్డు పొందిన గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్లు - 10
* పునాది స్థాయి ఇన్నోవేషన్లతో గ్రామీణ యువతకు స్వయం ఉపాధి - 13
* సమాజం అడిగిన ప్రశ్నలకు ప్రకృతి పుత్రుడు 'కొమెర జాజి' సమాధానాలు - 18
* ఇతర రాష్ట్రాల పల్లె జ్ఞానం - 21
* 'విత్తనాల తల్లి' "రాహిబాయ్ సోమా పోపెరె"కి 'పద్మశ్రీ' - 24
* సృజనాత్మకంగా వ్యవసాయ పరికరాలు చేసే 'బలగం కోటేశ్వర రావు' సృష్టి - ట్రాక్టర్ అనుసంధాన 'హైడ్రాలిక్ స్ప్రేయర్' - 27
* ఆయుర్వేద జ్ఞాన మథనం - 29
* స్పందన - 31


**కవర్ లోపలి పేజీల్లో ...**

భారత ప్రధాని నరేంద్ర మోడి, రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ లు 'పల్లెసృజన' ఇన్నోవేషన్లను తిలకిస్తున్న దృశ్యాలు 'పల్లెసృజన' ద్వారా వెలుగులోకి వచ్చిన ఇన్నోవేషన్లు

**మధ్య పేజీలో :**

మే-జూన్ 2023 లో జరిగిన 'పల్లెసృజన' విశేషాలు

Printed, Published and Owned by **P. Ganesham** and Printed at **M/s Narendra Grafix,** 1-5-1055/2/14, Saibaba Nagar, Old Alwal, Secunderabad, Medchal- Malkajgiri Dist. - 500010.Telangana State and Published at 102, Vayupuri, Sainikpuri Post, Malkajgiri Mandal, Medchal- Malkajgiri Dist. –500094. Telangana State, Editor : **J. Sesimohan.**

**HoneyBee Regional Collaborators & Publications**

**Honey Bee (English)**
AES Boys Hostel Campus, Near Gujarat University Library & SBI Bank, Navrangapura, Ahmedabad - 380 009 Gujarat, India.
Phone: 91-79-27912792, Fax: 91-79-27913293 Email: honeybee@sristi.org

**Karshakan Samsarikkatte (Malayalam)**
Fr Hubby Mathew
Peermade Development Society,
Peermade, Idukki - 685531,
Kerala hmathew@gmail.com

**Nam Vali Velanmai (Tamil)**
Mr P Vivekanandan
45, T P M Nagar,Virattipathu,
Madurai - 625010 Tamil Nadu
vivekseva@gmail.com

**Palle Srujana (Telugu)**
Brig Pogula Ganesham VSM (Retd)
102, Vayupuri, Sainikpuri Post
Secunderabad-500 094 Telangana.
president@pallesrujana.org, www.pallesrujana.org

**Loksarvani (Gujarati)**
SRISTI, P O Box No.15050
Ambawadi Ahmedabad - 380015 Gujarat
loksarvani@sristi.org

**Sujh-Bujh Aas Paas ki (Hindi)**
SRISTI, P O Box No.15050
Ambawadi Ahmedabad - 380015 Gujarat
loksarvani@sristi.org

# గ్రామాలు స్వయం సమృద్ధి దిశగా....

ఏ దేశమైనా, ఏ రాష్ట్రమైనా స్వయం సమృద్ధి స్థాయికి చేరుకోవాలని తాపత్రయ పడతాయి. అలాగే గ్రామాలు కూడా ఈ స్థాయికి చేరుకోవాలని తాపత్రయ పడతారు. ఆత్మ నిర్భరతతో వారి అవసరాలన్నీ అందుబాటులో ఉండేలాగా, స్థానికంగా అధిక ఉత్పత్తులను చేపట్టి ప్రజలు, పశువులు అన్నీ ఆనందంగా సస్యశ్యామలంగా బతకడం గ్రామ స్వయం సమృద్ధితోనే సాధ్యమవుతుంది. మహాత్మా గాంధీ గారు మన గ్రామాలు స్వయం సమృద్ధిగా ఉన్నాయని, వాటిని మరింత ఉన్నత స్థాయికి తీసుకు రావడానికి ప్రభుత్వాలు, ప్రభుత్వేతర సంస్థలు పాటు పడాలని, గ్రామ సమృద్ధి దేశ సమృద్ధికి దారి తీస్తుందని పదే పదే వక్కాణించారు. ఆయన నిర్దేశించిన దిశలో గ్రామ స్వయం సమృద్ధిని, సుస్థిరతను సాధించడం ప్రస్తుత కాలంలో కూడా సాధ్యమే.

అయితే పాశ్చాత్య పోకడలు మనల్ని ఎంతో ఆకర్షించడంతో 'అభివృద్ధి' నిర్వచనాన్ని ప్రభుత్వాలు, పాలసీ నిర్ణేతలు వక్రీకరించి, పెట్టుబడిదారుల ప్రభావంలో పడి రాజకీయ నాయకుల స్వార్థాలకు గురై, పట్టణ వాసుల అసంబద్ధ నిర్ణయాలకు మన గ్రామాలను మెల్లి మెల్లిగా స్వయం సమృద్ధి స్థాయి నుండి దిగజార్చాయి. వాటిని గ్రాహక సమూహాలుగా తయారు చేశాం. పరిశ్రమల ఉత్పత్తులను కోట్ల కొలది గ్రామవాసులకు అలవాటు చేశాం. గ్రామాల్లో కుటీర పరిశ్రమలను ప్రోత్సహించడం తగ్గించేశాం. ఎక్కడో తయారు చేసిన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, పాల ప్యాకెట్లు, నీళ్ళ బాటిళ్ళు, ప్యాకెట్లలో చిరు తిండ్లు, దుస్తులు, వాడుకునే సామాగ్రి, ఫోన్లు, వాహనాలు, టూత్ పేస్టులు, ఫర్నిచర్, పాదరక్షలు, నోటు బుక్కులు, బాల్ పెన్నులు, వగైరాలు గ్రామ ప్రజల జీవితాల్లో చొప్పించాం. వాటికై గ్రామ వాసులను ధనం సంపాదించడానికి ప్రోత్సహించాం. ధనాధార జీవితాన్ని గ్రామాల్లో ప్రవేశ పెట్టాం. చదువులకై సౌకర్యాలు ప్రవేశ పెట్టినా, చెప్పిన పాఠాలు మాత్రం చుట్టూ ఉన్న ప్రకృతి, మనుష్యుల గురించి కాదు. విద్యను అభ్యసించినవారు గ్రామాలకు దూరమవగా, ప్రభుత్వాలకు, పారిశ్రామిక వ్యవస్థలో పాల్గొనేట్టుగా తయారు చేశాం. గ్రామాల్లోని కళాకారులు, జ్ఞానులు, వైద్యులు, ఉత్తమ వృత్తి కార్మికులు, సాంప్రదాయిక జీవన పద్ధతుల, జీవ వృత్తులు, పశువులు, పక్షులు, చెట్లు, చేపలు, లోయలు, నదులతో సంబంధాల గురించి, వాటితో అనాదిగా సహజీవనం చేస్తున్న గ్రామ ప్రజలను నిర్లక్ష్యం చేశాం. దాంతో వారు మెల్ల మెల్లగా ఆ పనులు మానేసి ధనార్జనలో నిమగ్నమయ్యారు. ప్రవాసులుగా మారారు. మెల్లి మెల్లిగా గ్రామాలు తమ స్వయం ప్రతిపత్తిని, తమ సామర్థ్యాలను, తమ విలువలను, సహజీవన, పరస్పర ఆధార ప్రవృత్తులను కోల్పోయాయి.

"ఒక వృద్ధుడు మరణిస్తే ఒక గ్రంథాలయం కాలిపోయినంత" నష్టం సమాజానికి కలుగుతుంది. ఎన్నో తరాలుగా జరుగుతున్న స్థానిక జ్ఞాన ప్రసరణ గ్రామాల్లో జరగటం ఆగిపోయింది. పెద్దలవద్ద నేర్చుకోవడం మానేసి, బాహ్య సమాజం నుండి ప్రధానంగా వ్యాపార దృష్టిలో లభ్యమవుతున్న నూతన పద్ధతులను, పరికరాలను, గ్రామాల ప్రజలకు అలవాటు చేయడం వల్ల గ్రామాలు స్వయం సమృద్ధి స్థాయి నుండి ఆధారిత గ్రామాలుగా మారిపోయాయి. బాహ్య జ్ఞానం గ్రామాలకు ఎంతవరకు సబబో నిర్ణయించే వాళ్ళకు గ్రామాల వైవిధ్యాలు, స్థానిక అలవాట్లు, ప్రకృతి తీరులు, వాతావరణ మార్పులు, భూమి రకాలు - ఇవన్నీ పట్టించుకోకుండా, దేశమంతా ఒకే రకమైన పద్ధతులను నిర్వచించి, వాటిని లక్షల గ్రామాల్లో అమలు చేసే ఈ ఆధునిక గ్రామాభివృద్ధి నిజంగా గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపించాయా?



ప్రజాస్వామ్యంలో గ్రామాలకు స్వపరిపాలన ఇవ్వాలని చట్టం చెప్పినా, పార్లమెంటు చట్టాలు చేసినా, గ్రామాలు స్వపరిపాలనకు దూరంగా ఉండిపోయాయి. ఊళ్ళకు ఏం కావాలో నిర్ణయించేది పాలకులు. వారికి కావలసింది మాత్రమే వారు గ్రామాలకు ఇస్తారు. రాజకీయ ప్రయోజనాలు, పదవుల రక్షణ, ప్రభుత్వంలో పార్టీ - వీటిని సాధించడానికి గ్రామీణ అభివృద్ధి పథకాలు అమలు చేస్తున్నారు. ప్రజలను - ఓటర్లను ఆకర్షింప చేయడానికి చేస్తున్న కార్యక్రమాలు తప్ప - ప్రభుత్వ నిర్ణయాలు గ్రామాభివృద్ధికై నిజాయితీగా చేస్తున్నారా? వాటిని సరిగ్గా అమలు పరుస్తున్నారా అన్నది వివాదాంశం.

నీరు, అడవి, భూమి, పశువులు, జ్ఞానం వీటిని కాపాడుతూ వీటిమధ్య సమన్వయాన్ని పెంపొందిస్తూ, ప్రజలకు ప్రకృతిని సహజీవన పద్ధతితో, పరస్పర ఆధార మార్గంలో గ్రామాభివృద్ధి ప్రణాళికలు రూపొందించ వలసిన అవసరం ఎంతగానో ఉంది. అక్కడక్కడా విజ్ఞులైన గ్రామ ప్రజలు ప్రభుత్వ ప్రలోభాలకు బానిసలు కాకుండా మొండిగా తాము నమ్మిన ప్రకృతి సహాయంతో సాంప్రదాయ జ్ఞాన అమలుతో సుస్థిర వ్యవసాయం సాగిస్తున్నారు. వీరంతా అద్భుత ఉదాహరణలు. కడప జిల్లాలోని విజయకుమార్ గారు ఇలాంటి అద్భుత వ్యక్తులలో ఒకరు. ప్రస్తుత గ్రామ ప్రజల నిస్సహాయతను ఎలా పోగొట్టాలో వారు ఈ సంచికలో చాలా చక్కగా వివరించారు. ఈయన సూచించిన పద్ధతి గ్రామాలను స్వయం సమృద్ధి దారిలో ముందుకు తీసుకు వెళ్తుందని 'పల్లెసృజన' ప్రగాఢంగా విశ్వసిస్తున్నది.

'పల్లెసృజన' ప్రయాణంలో గ్రామస్తుల ఇన్నోవేషన్లు ఎన్నో తోడు చేసుకుంటున్నాయి. పాఠకులు వీటి గురించి తెలుసుకోవడానికి పల్లెసృజనతో పయనం చేస్తూ ఉండండి. సంభాషణలు కొనసాగించండి. మీ అనుభవాలను, మీ చుట్టు ప్రక్కల ఉన్న గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్లను మాకు చెప్పండి. పల్లెసృజన జ్ఞానయజ్ఞంలో మీవంతుగా ఒక సమిధను సమర్పించండి.

భవదీయ
బ్రిగేడియర్ పోగుల గణేశం (రిటైర్డ్)



## తక్కువ ఖరీదులో అలుపు లేకుండా
# ఎరువులు వేసే పరికరం చేసిన 'సత్యనారాయణ రెడ్డి'

- వీరరాఘవ రెడ్డి

రైతులు వేరుశనగ, మొక్కజొన్న లాంటి పంటలలో ఎరువులు వేయాలంటే ఎద్దులకు గొర్రును కట్టి వాటిని జడిగంలో వెయ్యటం ద్వారా పని త్వరగా పూర్తి చేస్తారు. ప్రత్తి, మిరప, కూరగాయలు, పొగాకు లాంటి పంటలు విత్తి, అవి పెరిగిన తర్వాత ఒకటి రెండుసార్లు ఎరువులు వేయటం తప్పనిసరి. ఇటువంటి పంటలకు ఎరువులను ట్రాక్టర్లు లేదా ఎద్దులతో వేయాలంటే చాలా ఎక్కువ ఎరువు వృధా అయిపోతుందని మనుషులతో ప్రతి మొక్క వద్ద కొద్ది కొద్దిగా వేయిస్తూ ఉంటారు. ఇలా వేయటం వల్ల రెండు రకాలుగా నష్టం జరిగే అవకాశం ఉంది. ఒకటి ప్రతి మొక్కకు సరియైన ప్రమాణంలో ఎరువు వేయలేరు. ఎందుకంటే ఒక మొక్కకు ఎక్కువ, మరో మొక్కకు తక్కువ పడే అవకాశం ఉంది. రెండోది కూలీల ఖర్చు ఎక్కువ. వారు కూడా చెట్టు మొదలు వద్ద సరిగ్గా వేయాలి అంటే వంగి వంగి వేయాల్సి ఉంటుంది కాబట్టి శారీరక శ్రమ కూడా ఎక్కువే. ప్రస్తుతం రైతులు కూలీలు లభించక ఎరువులు వేసేందుకు కూలీలకు గంపగుత్తగా ఇస్తూ ఉంటారు. అందువల్ల వారు త్వరగా పని పూర్తి చేసుకు పోవాలి కాబట్టి ఎరువు మొక్క మొదలు వద్ద పడిందా లేదా, సరియైన ప్రమాణంలో వేశామా లేదా అన్నదేదీ ఆలోచించకుండా త్వరగా పని పూర్తవ్వాలన్న ఉద్దేశ్యం తప్ప ఎక్కువ తక్కువ అన్న ఆలోచన లేకుండా ఎరువులు వేస్తారు. దీనివల్ల రైతుకు, పంటకు కూడా నష్టం జరిగే అవకాశం ఉంది.

ఈ సమస్యలను ఎదుర్కొన్న ఖమ్మం జిల్లా, ఇరుపాలెం మండలం, అయ్యవారి గూడెం గ్రామానికి చెందిన శీలం ప్రతాప రెడ్డి, వెంకట్రామమ్మల పుత్రుడు 'శీలం సత్యనారాయణ రెడ్డి' అనే 38 సంవత్సరాల రైతు ఒక పరిష్కారం కనుగొన్నాడు.

> శారీరక శ్రమ కూడా ఎక్కువే. ప్రస్తుతం రైతులు కూలీలు లభించక ఎరువులు వేసేందుకు కూలీ లకు గంపగుత్తగా ఇస్తూ ఉంటా రు. అందువల్ల వారు త్వరగా పని పూర్తి చేసుకు పోవాలి కాబట్టి ఎరువు మొక్క మొదలు వద్ద పడిందా లేదా, సరియైన ప్రమా ణంలో వేశామా లేదా అన్నదేదీ ఆలోచించకుండా త్వరగా పని పూర్త వ్వాలన్న ఉద్దేశ్యం తప్ప నాణ్యతా ప్రమాణాలు లేకుండా ఎరువులు వేస్తారు.

తమకున్న 5 ఎకరాలలో ప్రత్తి నాటడం జరిగింది. అప్పుడు ఇతను 10వ తరగతి చదువుతున్నాడు. అప్పుడు పొలానికి వెళ్ళగా కూలీలకు ఒక డబ్బాలో ఎరువులను వేసి ఇవ్వటం వాళ్ళు చేతితో ప్రతి మొక్క దగ్గర వేస్తూ ఉండటం గమనించాడు. సాధారణంగా పురుగు మందులను పంటలపై పిచికారి చేసేందుకు స్రేయర్లు ఉన్నట్టే ఈ ఎరువులు వేయటానికి కూడా ఏదైనా పరికరం ఉంటే బావుంటుంది కదా అని ఆలోచించాడు. అప్పుడే తనకు ఒక ఆలోచన వచ్చి ఈ పరికరం చెయ్యాలని అనుకున్నాడు.

ప్రస్తుతం పంటలకు ఎరువులు వేయాలంటే ఖర్చు ఎక్కువ అవుతుంది, పైగా మొక్కలకు ఎరువు సరైన పద్ధతిలో అందటం లేదు, వృధా అయ్యే అవకాశమే ఎక్కువగా ఉందని ఈ సమస్య పరిష్కారానికి ఒక చిన్న పరికరాన్ని తయారు చేసుకున్నాడు. దీన్ని ఉపయోగించి ప్రత్తి, కూరగాయల మిరప లాంటి పంటలలో సులభంగా ఎటువంటి అలసట లేకుండా, ప్రతి మొక్కకు సమానంగా ఎరువు అందేలా వెయ్యవచ్చు.

ఈ పరికరం మొత్తం కేవలం రెండు రకాల సైజు గల పివిసి పైపులతో తయారైంది కాబట్టి తేలికగా ఉంటుంది. ఈ పరికరంలో 5 నుండి 6 కిలోల వరకు ఎరువును నింపుకుని వ్యక్తి సులభంగా మోసుకుంటూ ప్రతి మొక్క దగ్గర ఒక్కసారి భూమిలోకి గుచ్చినట్లైతే వెంటనే మొక్క వద్ద గుప్పెడు ఎరువు పడిపోతుంది. మొక్క పెరిగిన తర్వాత దానికి తగ్గట్లుగా కొద్దిగా ఎక్కువ ఎరువు వెయ్యాలనుకుంటే ఆ పరికరానికి క్రింద ఏర్పాటు చేసిన రంధ్రాలలో మరోదానికి సైజు మార్చుకున్నట్లయితే ఇంకా కొద్దిగా ఎక్కువ ఎరువు పడేలా ఈ పరికరం రూపొందించ బడింది. ఇలా

మొక్కకు 30 గ్రాములు, 60 గ్రాములు, 90 గ్రాముల వరకు మూడు పరిమాణాల్లో మొక్కకు ఎరువులను అందించవచ్చు. ఇంకా ఎక్కువ ఎరువు అందించాలి అనుకుంటే పరికరానికి క్రింద ఏర్పాటు చేసిన బోల్టును పూర్తిగా తీసివేసినట్లయితే, మొక్కకు ఎంత ఎరువు అందించాలని రైతు అనుకుంటాడో అంత ఎరువు క్రింద పడిపోయేలా చేసుకోవచ్చు. ఈ పరికరంతో వర్మీ కంపోస్టు లాంటి ఎరువులను కూడా వేసుకోవచ్చు. కాకపోతే వర్మీ కంపోస్టు ఎరువు బాగా పొడిపొడిగా ఉండేలా తయారు చేసుకోవాల్సి ఉంటుంది. ఎరువు వేసిన వెంటనే పొలంలో అంతర సేద్యం చేసినట్లయితే, మొక్కల వద్ద వేసిన ఎరువుపై మట్టి కప్పబడి, ఎరువు వృధాగా ఆవిరై పోకుండా మొక్కకు నేరుగా అందుతుంది.

ఈ పరికరంతో 10 మంది చేయాల్సిన పనిని కేవలం ఒక్క వ్యక్తి పొలంలో ఎరువులు వేసుకోవచ్చు. అవసరం అనుకుంటే ఆ పరికరంలో ఎరువులు వేయటానికి మరో వ్యక్తి తోడుగా ఉన్నట్లయితే ఇంకా త్వరగా పని పూర్తవుతుంది. రసాయనిక ఎరువులను చేతితో వేయటం వల్ల ఆ రసాయనం చేతులకు అంటుకుని, అన్నం తినేటపుడు ఎంతో కొంత రసాయనాలు ఆహారంతో పాటుగా కడుపులోకి వెళ్ళే అవకాశం వుంటుంది. కాబట్టి ఆరోగ్యరీత్యా అది చాలా ప్రమాదాలకు దారి తీయవచ్చు. ఈ పరికరం ద్వారా ఎరువులను వేసినట్లయితే మనిషికి ఎటువంటి ప్రమాదం లేకుండా, అలసట లేకుండా, త్వరగా ఎరువులను పంటలకు అందించవచ్చు.

ప్రస్తుతం ఈ పరికరం ఖరీదు కేవలం 600 రూపాయలు మాత్రమే అవుతుందని, ఇప్పటికే తమ ప్రాంతంలోను, వీడియోలను చూసిన ఇతర ప్రాంతాల రైతులను బాగా ఆకట్టుకుని తమకు కూడా ఈ





పరికరం కావాలని సత్యనారాయణ రెడ్డిని అడుగుతున్నారు. ఖమ్మం జిల్లా కలెక్టరు కూడా ఒక ప్రదర్శనలో ఈ పరికరాన్ని చూసి, ఒక వెయ్యి పరికరాలను చేసి ఇమ్మని ఆర్డరు ఇవ్వటం జరిగింది. వాటిని వ్యవసాయ శాఖ ద్వారా రైతులకు అందించారు.

ఇంకా ఎంతోమంది రైతుల నుండి ఫోన్లు వస్తూనే ఉన్నాయని, కానీ తన వ్యవసాయ పనులు చూసుకోవటం, వాటిని తయారు చేసేంత ఆర్థిక స్థోమత తనకు లేకపోవటం వల్ల కోరిన రైతులందరికి ఈ పరికరాన్ని అందించలేక పోతున్నానని అంటున్నాడు. ప్రభుత్వం లేదా బ్యాంకులు, లేదా ఎవరైనా స్వచ్ఛంద సంస్థల వారు తనకు కొంత ఆర్థిక సహాయం అందించినట్లయితే ఈ పరికరాలను ఎక్కువ మోతాదులో తయారు చేసి అందరికీ అందివ్వ గలనని అంటున్నాడు సత్యనారాయణ రెడ్డి. తక్కువ ఖర్చుతో, ఎరువులు వేసే వ్యక్తికి ఎటువంటి హాని జరగ కుండా త్వరగా పని పూర్తి చేసే ఈ చిన్న పరికరం ఉపయోగించుకుని రైతులు తమ వ్యవసాయంలో పెట్టుబడిని కొంత వరకు తగ్గించుకో వాలని కూరుకుంటోంది 'పల్లెసృజన'. ఇన్నోవేటర్ సత్యనారాయణ రెడ్డి తయారు చేసిన ఎరువులు వేసే పరికరం అధిక మొత్తంలో తయారు చేసేందుకు అవసరమైన సహాయ సహకారాలను అందించటానికి, ఈ పరికరానికి విస్తృత ప్రచారం కల్పించటానికి 'పల్లెసృజన' తగిన అవకాశాన్ని కల్పించే ప్రయత్నం చేస్తోంది.

**ఇన్నోవేటర్ సత్యనారాయణ రెడ్డి ఫోన్ : 96037 36633**

National Innovation Foundation-India

# నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ (ఎన్.ఐ.ఎఫ్.) - ఇండియా

స్వయంప్రతిపత్తి గల సంస్థ, శాస్త్ర సాంకేతిక శాఖ, భారత ప్రభుత్వము.

# జాతీయ 14 వ ద్వైవార్షిక పోటీలు

**పునాది స్థాయిలో సహాయం అందని సాంకేతిక ఆవిష్కరణలు (ఇన్నోవేషన్లు) మరియు సంప్రదాయ జ్ఞానముల గుర్తింపు**



**నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్** (ఎన్.ఐ.ఎఫ్.) తన 14వ జాతీయ ద్వైవార్షిక పోటీలకు గాను ఎవరి సహాయమూ లేకుండా రూపొందించిన పునాది స్థాయికి చెందిన సాంకేతిక ఇన్నోవేషన్లు మరియు సాంప్రదాయ జ్ఞానం గురించిన దరఖాస్తులను కోరుతున్నది. ఈ ఇన్నోవేషన్లను రైతులు, కళాకారులు, చేతివృతుల వారు, జాలర్లు, మహిళలు వ్యక్తిగతంగా కాని, సామూహికంగా కాని పంపవచ్చు. మహిళలు, మురికి వాడల్లో నివసించే వారు, వర్క్‌షాప్ మెకానిక్‌లు, విద్యార్థులు, స్థానిక సమాజాలకి ప్రాధాన్యత ఇవ్వబడును. ఈ సృజనలు వ్యవసాయం (పనిముట్లు, యంత్రములు, కొత్త పద్ధతులు, కొత్త వంగడాలు మొదలైనవి), గృహోపకరణాలు, రవాణా, శక్తి (ఎనర్జీ), ఉత్పత్తి/ పరిరక్షణ, పని భారాన్ని తగ్గించటము, మూలికా వైద్యము (మానవులు మరియు జంతువులు) మొదలైన వాటికి సంబంధించినవై మరియు తక్కువ ఖర్చుతో కూడుకుని, ఎక్కువ కాలం మనగలిగి, పర్యావరణానికి హానికరం కానివై ఉండాలి. ఈ ఆలోచనలు లేదా నమూనాలు బయటివారి సహాయము/ పర్యవేక్షణ లేకుండా తాము స్వంతంగా తయారు చేసినవై, ఇతరుల నుండి ఎటువంటి సాంకేతిక సలహాలు తీసుకోకుండా రూపొందించినవై ఉండాలి. మహిళల కొరకు మహిళలచే, వికలాంగుల కొరకు వికలాంగులచే రూపొందించబడిన ఇన్నోవేషన్లు, ఉత్తమమైన సాంకేతిక జ్ఞానానికి ప్రత్యేకమైన బహుమతులు ఇవ్వబడుతాయి.

## ఆకాశాన్ని అందుకోవాలన్న ఆశ....

ఉత్తమమైన వాటిగా గుర్తించ బడిన వాటిలో జాతీయ మొదటి **బహుమతిగా రూ. 5,00,000, జాతీయ** రెండవ **బహుమతిగా రూ. 3,00,000, జాతీయ మూడవ బహుమతిగా రూ. 1,00,000లను వివిధ వర్గాలలో ఇవ్వబడును. జీవిత కాలపు సాఫల్యత పురస్కారం క్రింద రూ. 7,50,000లు గొప్ప ఇన్నోవేటర్‌కు లేదా ఇన్నోవేషన్లనే జీవితంగా ఏర్పరచుకొన్న వారికి ఇవ్వబడును.** అంతే కాదు **ప్రోత్సాహక బహుమతి క్రింది రూ. 10,000లను వివిధ వర్గాలలో ఎన్నుకోబడిన ఇన్నోవేషన్లు, సమాజ శ్రేయస్సుకు, పర్యావరణానికి తోడ్పడ్డ వాటికి ఇవ్వబడును.**

ఇవే కాక పునాది స్థాయిలో సాంకేతిక విజ్ఞానాన్ని వెతికి వెలికి తీయటానికి దోహదపడిన వ్యక్తులు లేదా సంస్థలకు కూడా గుర్తింపు ఉంటుంది. అదేవిధంగా సాంకేతిక జ్ఞానం కలవారు, పునాది స్థాయిలో ఇన్నోవేషన్లను వెలికి తీయటానికి కృషి చేసిన ఎలక్ట్రానిక్/ ప్రింట్ మీడియా జర్నలిస్టులకి కూడా గుర్తింపు ఉంటుంది. ఈ దరఖాస్తులను **31 మార్చి, 2025** లోగా మాకు చేరేలా పంపండి.

## దరఖాస్తు దారులకు గమనిక

**వ్యక్తిగతంగా కానీ, సమూహంగా కానీ ఎన్ని ఐడియాలనైనా వ్రాసి పంపవచ్చు.**
**మీ ఐడియా/ ఇన్నోవేషన్/ సాంప్రదాయ జ్ఞానానికి సంబంధించిన సాంకేతిక వివరాలు, ఫోటోలు, వీడియోలు ఏవి వున్నా పంపాలి.**
**దరఖాస్తుదారుడు తన విద్యార్హతలు, మీ వృత్తి వివరాలను తెలియజేయాలి.**
**మీ గుర్తింపు కార్డు (ఆధార్/ ఓటర్ కార్డు/ ప్రభుత్వం నుండి పొందిన ఏదైనా) కాపీని తప్పనిసరిగా జత చేయాలి.**
**మీ పూర్తి పోస్టల్ చిరునామా తప్పనిసరిగా పంపాలి.**

**దరఖాస్తు చేయుటకు చివరి తేది 31 మార్చి, 2025**

**మీ ఆవిష్కరణలను పంపవలసిన చిరునామా :**

**National Innovation Foundation,**
**C/o Gram Bharati, Amrapur, Gandhi Nagar-Mahudi Road, Gandhi Nagar, Gujarat-382 721.**
**Phone: (02764) 350001/ 02/ 03/ 04/ 05/ 06 Email: campaign@nifindia.org, Website: www.nif.org.in**

**సూచన :** వృత్తిపరమైన అనుభవం కలవారు లేదా వృత్తి కళాశాలలో చదువుకొనే విద్యార్థులు ఎన్.ఐ.ఎఫ్. నుండి ఏవిధమైన ఆర్థిక సహాయానికి కాని, పురస్కారాలకు కానీ అర్హులు కారని గమనించవలెను. అయినప్పటికీ అటువంటి వారు గ్రామస్థాయి ఇన్నోవేషన్లకి మెరుగు దిద్దినట్లయితే ఎన్.ఐ.ఎఫ్. వారిని గుర్తిస్తుంది. అర్హత వివరాలు, ఇతర మార్గదర్శకాలకై https://nif.org.in/announcement/biennial_competition సంప్రదించండి. లేదా **'పల్లెసృజన' కార్యాలయాన్ని (ఫోన్ : 040-40253096)** సంప్రదించండి.

# వ్యవసాయదారుల శ్రేయస్సుకై
# విజయకుమార్ గారి సలహాలు - సూచనలు



- వీరరాఘవ రెడ్డి

"పంటలపై ప్రకృతి కరుణించటం లేదు, కరుణించినా చీడ పీడల బాధ వల్ల నష్టాలు ఎక్కువ, ఎలాగో పంట పండినా కూలీల భారం పెరిగిపోతోంది, దాన్ని కూడా అధిగమించినా మార్కెట్‌లో సరైన ధర లభించక నష్టపోతున్నాము" ఇదే దాదాపు ప్రతి వ్యవసాయదారుడు చెప్తున్న మాటలు. వీటిని గురించి కాస్త చర్చించుకుందామనిపించి 'పల్లెసృజన' పాఠకులకు చిరపరిచితుడు అయిన కడప జిల్లా, వేంపల్లె మండలం, టి.ఎలమవారిపల్లె గ్రామానికి చెందిన ప్రకృతి వ్యవసాయ రైతు, రసాయన రహిత పంటల పై అవగాహన కల్పిస్తున్న విజయ కుమార్ గారి సూచనలను పాఠకులకు అందిస్తున్నాం.

మన పూర్వీకులు సేద్యం చేసిన కాలంలో ఈ మాటలు కూడా ఉండేవి కానీ, ఇంతగా అనేవారు కాదు అన్నది నిర్వివాదాంశం. అసలు అప్పటికీ ఇప్పటికీ వ్యవసాయంలో జరిగిన మార్పులను గురించి మననం చేసుకోవడం వల్ల కొంతలో కొంత మనం వ్యవసాయ నష్టాల నుంచి బైట పడవచ్చు అంటారు విజయకుమార్.

**మొదటిది పంటలపై ప్రకృతి కరుణించటం లేదు -** పూర్వం అంటే మరీ పూర్వకాలమేమీ కాదు దాదాపు 1980–90 ప్రాంతం వరకు కూడా పంటలను విత్తే కాలం జులై నుండి సెప్టెంబర్ వరకు మాత్రమే జరిగేది. మొదటి పంట ముంగారు పత్తి, ఆ తర్వాత కొర్రలు, వరి, వేరుశనగ, కుసుమ లాంటి పంటలుండేవి. చివరలో విత్తే విత్తనం జొన్న, పప్పు శనగ, వాము లాంటి పంటలు. కానీ ఇప్పుడు సంవత్సరంలో 365 రోజులు ఎక్కడో ఒకచోట విత్తనం వేస్తూనే ఉన్నారు. విత్తనం వేసేటపుడు ఈ పంట ఎప్పుడు కోతకు వస్తుంది అన్న విషయం ఆ రైతుకు ముందే తెలుసు. అప్పుడు వర్షాల పరిస్థితి ఎలా ఉంటుంది అన్నది కూడా అతనికి తెలుసు. అయినా విత్తుతున్నాడు అంటే దానికి వాళ్ళు చెప్పే సమాధానం ఒక్కోసారి వర్షాభావం ఏర్పడుతుంది కదా, మన అదృష్టం బావుంటే అప్పుడు వర్షాలు లేకపోతే పంట చేతికి వస్తుంది కదా అనుకుంటున్నారే కానీ, ఈ సమయంలో ఈ విత్తనం వేయటం 'లాటరీ'నే అని మాత్రం ఎవ్వరూ అనుకోవటం లేదు. ఈ పరిస్థితులు కూడా ఒక కారణం కావచ్చేమో ఆలోచించండి. ఇలా రైతులే కాలం కాని కాలంలో విత్తనాలు వేసి, ప్రకృతి కరుణించడం లేదు అనడం సబబు కాదు కదా అంటారు విజయకుమార్.

**చీడ పీడలు -** మనం వేసే పంట సరైన కాలంలో విత్తుకో కుండా, ఎప్పుడు పడితే అప్పుడు విత్తుకోవటం వల్లనే చీడ పీడల ప్రభా వం పంటపైన ఎక్కువగా ఉంటుంది అన్న విషయం గుర్తించాలి. పైగా రసాయన మందుల వాడకం ఎక్కువ కావటం వల్ల అవి వాటిని తట్టుకునే శక్తిని పెంపొందించుకుని, రైతు ఎక్కువ మోతాదులో, ఎక్కువ గాఢత కలిగిన (పైరిత్రాయిడ్) మందులు పిచికారి చేయటం వల్ల పంట విషతుల్యం కావటంతో పాటు, రైతుకు అధిక నష్టాలు వస్తున్నాయి అన్న విషయం గమనించటం లేదు. అప్పుడు వేసే పంటల వల్ల పొలంలో మిత్ర పురుగుల సంతతి ఎక్కువగా ఉండి, శత్రు పురుగులను అవే తిని రైతును కాపాడేవి, కానీ రసాయనాల వల్ల మిత్ర పురుగు మనుగడే ప్రశ్నార్థకంగా మారింది అన్న విషయం మర్చిపోతున్నారు.

**కూలీల భారం పెరిగిపోతోంది -** రైతు వేసే పంటల్లో ఎక్కువ భాగం వ్యాపార పంటలు (కమర్షియల్ క్రాప్) మాత్రమే వేసి, ఎంతసేపు డబ్బు చుట్టే వ్యవసాయాన్ని పరిగెత్తిస్తున్నారు. అసలు 'మనిషి బ్రతకాలంటే రైతు బావుండాలి' అన్న సూత్రం ఎందువల్ల వచ్చింది? అని


ఇలా కేవలం మిర్చి పంట మాత్రమే వేయకుండా ఇందులో బంతిపూలు అక్కడక్కడా నాటండి

ఆలోచిస్తే మంచిది. చిరు ఆహార ధాన్యాల విస్తీర్ణం తగ్గటం, తక్కువ శ్రమ, తక్కువ కూలీల అవసరం వున్న కొర్ర, తృణ ధాన్యాలు లాంటి పంటలు వేయటం దాదాపు మానేసే పరిస్థితి ప్రస్తుతం చోటు చేసుకుంది. పైగా మారిన కాలానుగుణంగా రైతుపని చేసే కూలీలే తక్కువై పోయారు కాబట్టి దానికి అనుగుణంగా కూలీల అవసరం తక్కువగా వున్న పంటలు వేసుకోవాలి. వీలైనంత వరకు మనం కూడా మారిన కాలాన్ని బట్టి పంటల నూర్పిడి ఇతర అవసరాలకు అనుగుణంగా యంత్రాలు వచ్చాయి, కాబట్టి యాంత్రీకరణకు అనువైన పంటలు వేసుకోవటం మంచిది. కూలీల ఖర్చు కూడా కొంతవరకు తగ్గుతుంది కాబట్టి రైతుకు లాభదాయకంగా ఉంటుంది.

**ఇక చివరి అంశం 'మార్కెటింగ్' -** ఇక మార్కెటింగ్ విషయానికి వస్తే అసలు గతంలో గ్రామం నుండి వ్యవసాయ మార్కెట్‌కు వెళ్ళే పంటలే చాలా తక్కువ. ఎవరో పెద్ద పెద్ద కమతాలున్న రైతులు మాత్రమే తమ పంట దిగుబడులను మార్కెట్ కు తరలించేవారు. మిగతా రైతుల దిగుబడులు ఆ గ్రామం లేదా సమీప గ్రామాల వారే వచ్చే ఏడాది విత్తనం కోసం తమవద్దకే వచ్చి కొనుగోలు చేసేవారు. ఇప్పుడు ప్రతి చిన్నకారు రైతు కూడా తాను పండించిన పంటను నూర్పిడి చేయటం, అక్కడ పొలం నుండే నేరుగా మార్కెట్‌కు తరలించటం వల్ల మార్కెట్లలో విపరీతమైన ఒత్తిడి పెరిగి, అక్కడ స్థలా భావ పరిస్థితులు కూడా ఏర్పడటం, ఎక్కువ మోతాదులో పంట మార్కెట్ కు చేరటం వల్ల వీళ్ళు ఎంతకు అడిగినా ఇస్తారన్న చులకన భావంతో వ్యాపారులు ధరలపై విపరీతమైన కోతలు విధించి, కొనుగోలు చేయటం. తరువాత వాళ్ళు కొనుగోలు చేసుకున్న ధాన్యాన్ని నిలువ చేసుకుని, ధరలు పెంచి, వాటిని అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారు. రైతులు మాత్రం మేము అమ్మేటపుడేమో ధర ఉండదు, మనం కొనేటపుడేమో ధరలు ఆకాశంలో ఉంటాయి అని వాపోవడం సర్వ సాధారణమైపోయింది.

**అప్పటికీ, ఇప్పటికీ గల తేడా -** ప్రస్తుతంవ్యవసాయంలో ఈ పరిస్థితి ఎందుకు వస్తుంది అని ఆలోచించటం మానేశారు రైతులు. గతంలో కూడా వ్యాపారాత్మక పంటలుగా ప్రత్తి, పొగాకు, వేరుశనగ, ఉల్లి, మిరప పంటలు వేసేవారు. మిగతా పొలమంతా ఆహారానికి సంబంధించిన పంటలే వేసేవారు. అంటే రైతు ముందుగా సమాజానికి ఆహారం అందిద్దాము అన్న విషయం మర్చిపోతున్నారు. అసలు మనం ఏయే ఆహారం తింటాము అన్న విషయం ఒక్కసారి ఆలోచించాలి. మన ఇంటకి అవసరమైన అన్ని రకాల పంటలను ఈ ఆహార పంటల్లోను, వ్యాపారాత్మక పంటల్లోను అంతర పంటగా వెయ్యాలి. రైతు ఎప్పుడూ ఒక్క విషయం తన మదిలో నిక్షిప్తం పెట్టుకోవాల్సిన మాట – "ఉప్పు తప్ప మిగతావన్నీ మనమే పండిస్తాం" అన్నది. కాబట్టి మిశ్రమ పంటలను విరివిగా సాగు చేసుకోవాలి.

పూర్వం గ్రామంలో వేసవిలో రచ్చబండల వద్ద సాయంకాలం పొద్దు పోయేదాకా కూర్చొని వచ్చే కాలం ఏ పంటలు వేసుకోవాలి, ఏ పంటకైతే ఈ సంవత్సరం బాగా ఉంటుంది లాంటి విషయాలు చర్చించు కునేవారు. ఈ సంవత్సరం కాలం ఎలా ఉంటుంది, వర్షాభావ పరిస్థితు లను అప్పుడు కనిపించే కొన్ని శకునాలను, పంచాంగాలను బట్టి బేరీజు వేసుకునేవారు. వారి అంచనాలకు తగ్గట్టుగా దాదాపు అలాగే జరిగేది. ఎవరు ఏ పంట వేస్తున్నారో తెలిసిపోయేది. ఎవరివద్ద ఏయే విత్తనాలు ఉన్నాయో అక్కడే తెలిసి పోయేది. ఒకరి విత్తనాలు మరొకరు మార్పిడి పద్ధతిలో సేకరించుకుని సిద్ధంగా ఉంచుకునేవారు. ఇప్పుడు ఆ వ్యవస్థ పూర్తిగా అంతరించి పోయింది. విత్తనాల సేకరణ మరచిపోయి, మార్కెట్లో కొనటానికే రైతులు ఎక్కువగా అలవాటు పడిపోతున్నారు. ఈ కారణంగా మనుషుల (రైతుల) మధ్య ఆప్యాయత, ఆత్మీయత అన్నదే లేకుండా పోతోంది. సమిష్టి నిర్ణయాల్లో వున్న శక్తిని ఉపయోగించుకోలేక పోతున్నారు.

సాధారణంగా ఉగాది, శ్రీరామ నవమి తర్వాత వాతావరణ పరిస్థితులను అంచనా వేసుకునే వారు. అప్పట్లో యాంత్రీకరణ తక్కువ కాబట్టి ఎద్దులు, పేద రైతులైతే దున్నపోతులతో సేద్యాలు చేసుకునేవారు. దాదాపు ప్రతి రైతు ఇంట్లో కోళ్ళ పెంపకం విరివిగా ఉండేది. వాటివల్ల ఇంట్లోకి పురుగు పుట్ట రాకుండా అవే చూసుకునేవి, తినటానికి కోడిగుడ్లు, అవసరమై నపుడు మాంసాహారానికి, ఇంకా ఎక్కువగా కోళ్ళ పెంపకం ఉన్న వాళ్ళు వాటిని అమ్ముకుని వ్యవసాయ ఖర్చులకు ఉపయోగ పడేలా ఉండేది.

అప్పటి వ్యవస్థ ఇలా ఉండటం వల్ల రైతు అప్పు కొరకు ఎక్కువగా ఇతరులపై ఆధార పడేవాడు కాదు. ప్రస్తుతం అంతర పంటలు, విత్తనాలు, కోళ్ళు, పొట్టేళ్ళ పెంపకం లాంటివి లేక పోవటం వల్ల, మిశ్రమ పంటలు కాకుండా కేవలం ఒకే పంట వేయటం వల్ల రైతు తప్పనిసరిగా అప్పు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. అది అలవాటుగా కూడా మారి, రైతు అప్పు సులభంగానే చేసినా, తీర్చే సమయం వచ్చినప్పుడు భయమేసి, తీర్చే మార్గం కనబడక బెంబేలు పడిపోయి, ఆత్మహత్యల వైపుకు దారి తీస్తున్నది పైన చెప్పిన పరిస్థితులే అని


ఇలా మిశ్రమ పంట వేయటం మంచిది





గమనించాలి.

గతంలో ప్రతి రైతు తమ పొలాల గట్లను ఆనుకుని రక్షక పంటలుగా కుసుమ, జొన్న, ఆముదాలు లాంటివి వేసేవారు, అలా చేయటం వల్ల తన కుటుంబానికి అవసరమైనంత మేర పంట వచ్చేది, ప్రధాన పంటకు చీడపీడల నుండి కొంత వరకు నివారణ జరిగేది. గట్ల పైన చిక్కుడు, బీర, సొర (అనప) లాంటి తీగజాతి కూరగాయ పంటలు వేసేవారు. వాటివల్ల తమ ఆహారానికి అవసరమైన కూరగాయలు, తోటి రైతులకు వాటిని ఆప్యాయతతో అందించటం వల్ల వారిమధ్య సత్సంబంధాలు ఉండేవి. దిగుబడి కొద్దిగా ఎక్కువై తే వాటిని అమ్ముకోవటం వల్ల అదనపు ఆదాయం సమకూరేది. ఇప్పుడు అవన్నీ కనుమరుగై పోయాయి. ఇక్కడ ఇంకో విషయం గమనించాలి, అలా వేసిన పంటలపైన ఎటువంటి పురుగు మందులు పిచికారి చేసే వారు కాదు. కాబట్టి వాటికి అదనంగా అయ్యే ఖర్చంటూ ఏమీ లేదు. ఎంతో కొంత ఆదాయం మాత్రమే ఉండేది, విష రహిత ఆహారం లభించేది. పైగా ప్రతి రైతు ఇంట్లో ఎప్పుడూ ఎంతో కొంత ధాన్యం నిలువ ఉండేది. అలా ఉండటం వల్ల 'లక్ష్మీకళ' ఆ ఇంట్లో ఉట్టిపడుతుంది అని భావించే వారు. అందుకే కొందరు భక్తిభావం కల రైతులు 'ధాన్య లక్ష్మి' ఎప్పుడూ ఇంట్లో ఉండాలని కోరుకునేవారు.

కాబట్టి రైతులు తమ పొలంలో తమ ఇంటికి అవసరమైన కంది, పెసర, కుసుమ, అలసంద, ఆముదం లాంటి విత్తనాలను కలిపి మిశ్రమ వ్యవసాయం చేస్తే అవి వారి ఇంటి ఖర్చులకు సరిపోతాయి, ప్రధాన పంట మార్కెట్‌లో అమ్ముకోవచ్చు. ఇలా చేయటం వల్ల రైతు చాలా వరకు తమకు అవసరమైన పప్పు ధాన్యాలు మార్కెట్‌లో కొనకుండా తమ పంటల ద్వారా అవసరమైన ఆహారం పొందవచ్చు.

ఇప్పుడు భారీ వ్యవసాయ యంత్రాలు వచ్చాయి కాబట్టి తప్పని పరిస్థితుల్లో వాటితోనే సేద్యం చేస్తున్నారు. వీటిని విపరీతంగా ఉపయోగించటం వల్ల కూడా భూమికి కొంత నష్టం వాటిల్లుతోంది అన్న విషయం 'పల్లెసృజన' గతంలో చెప్పింది. అధిక బరువు గల యంత్రాలతో సేద్యం చేయటం ద్వారా భూమి ఎక్కువ వత్తిడి (బరువు)కి గురై భూమి పొరలు కుచించుకు పోయి, పడిన వర్షాలు భూమిలోకి ఇంకే నీరు తక్కువ, పైపైన పారిపోయేది ఎక్కువ కావటం వల్లనే ప్రస్తుతం అధికంగా జల ఉత్పాతాలు, వరదలు పెరిగిపోతున్నాయి అన్న ఒక విశ్లేషణను అందించటం జరిగింది. అలా నీరు భూమిలో ఇంకకుండా పైపైనే పారిపోవటం వల్ల నీరు వృధా కావటమే కాక, భూసారం కూడా కొట్టుకు పోతోంది. కాబట్టి ప్రతి రైతు ప్రస్తుత పరిస్థితుల్లో ఎద్దులను పోషించే స్థోమత లేదు కాబట్టి కనీసం తక్కువ బరువు గల, చేతితో పనిచేసే వీడర్ల లాంటి వాటితో మిగతా సేద్య పనులు చేసుకుని, కేవలం ఒక్కటంటే ఒక్కసారే ట్రాక్టర్లతో సేద్యం చేయిస్తే మంచిది.

గతంలో ప్రతి రైతు ఇంట్లో తాను పండించిన పంటను విత్తనం కొరకు తమ పంటను తీసి వంటిట్లో చూరుకు ఉట్టిగట్టి వేలాడగట్టుకుని జాగ్రత్త చేసుకునేవారు. అలాగే పక్షుల కొరకు ఇంటి పై కప్పుకు, గ్రామంలోని దేవాలయాలు, ఇతర చోట్ల జొన్న కంకులను వేలాడ కట్టేవారు. అందువల్ల పక్షులకు పంటలు లేని కాలంలో ఆహారం లభించి పక్షి జాతి అభివృద్ధి చెందేది. పక్షులు పెరగటం వల్ల పంటలను ఆశించే పురుగులను తిని రైతుకు సహాయం చేసేవి. పక్షులకు పంట కాలంలో పురుగుల వల్ల ఆహారం లభించేది. పంటలు ముగిసిన తర్వాత ఇలా గ్రామాల్లో కట్టిన కంకులను తిని జీవనం గడిపేవి. ఈ పద్ధతులన్నీ మనం మానటం వల్లనే పక్షులు కూడా పంటలపై దాడి చేయటం ప్రారంభించాయి. ఇప్పుడు పంట అమ్మటం, మళ్ళీ సీజన్‌లో పట్టణాలకు వెళ్ళి హైబ్రిడ్ విత్తనాలను కొనుగోలు చేసుకుని రావటం ఇదో తంతుగా మార్చివేశారు విత్తన వ్యాపారులు. వారి వ్యాపార ప్రకటనలకు ప్రేరేపితులై అసలు మన విత్తనం మనమే సిద్ధం చేసుకోవాలి అన్న విషయమే మర్చిపోయాం.

ఉదాహరణకు వ్యాపారాత్మక పంటలు ప్రత్తి వేసేవారు ప్రతి మొలకకు (అంటే 6 లేదా 12 సాళ్ళకు ఒకటి) కంది, గోంగూర విత్తనం తప్పక వేసుకోవాలి. ఇలా చేయటం వల్ల రెండు రకాల లాభాలు – మొదటిది ప్రత్తిని ఆశించే క్రిమి కీటకాలు ముందుగా గోంగూర, కంది పంటలకు సోకుతాయి, అలా జరగటం వల్ల పంటకు పురుగు తాకిడి మొదలైంది అన్న విషయం మనకు తెలిసి పోతుంది. అప్పుడు సస్యరక్షణ చర్యలు చేపట్టవచ్చు. అలాగే కొర్ర జాతి పంటలైన కొర్ర, అండుకొర్ర,





సామలు, ఊదలు, బరిగలు లాంటివి విత్తుకునేటపుడు అందులో పెసర, అలసంద, నువ్వులు లాంటి విత్తనాలను అందులోనే కలిపి విత్తనం వేయటం వల్ల మన ఇంటికి అవసరమైన, మిగిలితే ఇతరులకు అమ్ముకునే విధంగా ఆ పంట దిగుబడి కూడా వాటితో పాటుగా వస్తుంది. ఇలా చేయటం వల్ల కనీసం ఎవరి ఇంటికి తగిన ఆహారం వాళ్ళకు లభిస్తుంది. గోంగూర పంట వల్ల ఆకు కూరలు తినటంతో పాటు వాటి నుండి గోగు నారను తీసుకుని తాళ్ళు పేనుకోవచ్చు. అవి ఎంతో మృదువుగా ఉంటాయి పశువులకు ఒరుసుకుపోవు.

అలాగే జొన్న పంట వేసేటపుడు అందులో దోసకాయ, బుడంకాయ లాంటి విత్తనాలను వేయటం వల్ల అటు పంటకు, ఇటు రైతుకు లాభసాటిగా ఉంటుంది. వీటిని కొద్దిగా ఎక్కువగా కలిపినా జొన్న పంటకు ఎటువంటి నష్టం ఉండదు. ఎందుకంటే అవి భూమిపైన పాకుతూ పెరిగే తీగ జాతి పంట, జొన్న ఏపుగా పైకి పెరిగే పంట కాబట్టి రెండు పంటలు వస్తాయి. దోస, బుడంకాయ పంటలను మార్కెట్‌లో అమ్ముకోవటం ద్వారా జొన్న కోత కూలీల ఖర్చు కలిసి వస్తుంది. రైతుకు ఏమాత్రం అదనపు ఖర్చు కానీ, నష్టం కానీ ఉండదు.

వేరుశనగ పంటలో కూడా కంది, పెసర, మినుములతో కూడిన అక్కడి పంటలు (ప్రతి 6–12 సాళ్ళకు ఒకసాలు చొప్పున) వేయటం వల్ల రైతుకు అదనపు ఆదాయం, చీడ పీడల నుండి ప్రధాన పంటకు ముప్పు కూడా తగ్గుతుంది. వేరుశనగ పంట తర్వాత ప్రతి రైతు తనకు కావలసిన విత్తనం తనవద్ద నిలువ ఉంచుకుని, మిగతాది మార్కెట్‌కు తరలించి సొమ్ము చేసుకుంటాడు. తనవద్ద వున్న విత్తనం కాయలను వలిచేటపుడు వచ్చే నావలు, విత్తనం పగిలిన బద్దలు (ఒడకలు అని కొన్ని ప్రాంతాల్లో అంటారు) తీసుకు వెళ్ళి గానుగల్లో నూనె తీయించుకుంటే సంవత్సరమంతా మనం పండించిన శుద్ధమైన ఎటువంటి కల్తీలేని, ఆరోగ్యవంతమైన నూనె తింటున్నాము అన్న తృప్తి ఉంటుంది, నూనె కొనుగోలు ఖర్చు ఉండదు.

మిరప పంట వేసేవారు అందులో 'బంతిపూలు' తప్పక అంతర పంటగా వేయాలి. ఎందుకంటే మిరపను ఆశించే పురుగులు ముందుగా బంతిపూల మొక్కలకు సోకుతాయి. అలా చేయటం వల్ల ప్రధాన పంట చాలావరకు పురుగుల బారినుండి రక్షించ బడటమే కాక, ప్రధాన పంటపై సస్యరక్షణ చేసుకునేలా ముందు సూచన అందినట్లు అవుతుంది. కొంతవరకు ఖర్చు కూడా కలిసి వస్తుంది . అందుకే మిరప





నారు పోసుకునే ముందు బంతిపూల నారును కూడా తప్పక వేయాలి. దీనివల్ల రైతుకు ఎటువంటి నష్టం ఉండదు. బంతి పూలు ఎక్కువగా కాస్తే వాటిని అమ్ముకుని సొమ్ము చేసుకోవచ్చు. రాకుంటే ప్రధాన పంటను పురుగుల నుండి కొంతవరకైనా కాపాడు కున్నట్లు అవుతుంది.

ప్రకృతి వ్యవసాయ ప్రేమికుడు, రైతు అయిన విజయకుమార్ రైతులు ప్రస్తుతం రాబోయే వర్షాకాలం నుంచైనా ఈ పద్ధతులు పాటించమని కోరుతున్నారు. "కొర్రలు, చిరు ధాన్యాలతో కలిపి మిశ్రమ వ్యవసాయం చెయ్యండి, ప్రస్తుతం కొర్రలకు మంచి ఆదరణ లభిస్తోంది, మార్కెట్ రేటు కూడా చాలా బాగా ఉంది. పైగా వాటి గడ్డి పశువులకు ఎంతో ఆరోగ్యకరమైనది. పశువులు కూడా ఈ గడ్డిని చాలా బాగా తింటాయి అంటున్నారు.

కొందరు రైతులు పొలానికి విశ్రాంతి అనేది లేకుండా పొలం నుండి పంట తియ్యడం, వెంటనే మరో పంట నాటడం లాంటివి చేస్తున్నారు. ప్రతి పంటకు కనీసం 30 రోజుల విశ్రాంతి ఇస్తే ఆ భూమికి సూర్యరశ్మి తగలటం వల్ల మట్టిలో అనేక పోషకాలు ఉత్పత్తి అవుతాయి, అప్పుడు పంట దిగుబడి కూడా బాగా వస్తుంది. ఏ రైతూ తమ పొలంలో ఒకే పంట ఎట్టి పరిస్థితుల్లో వెయ్యకండి. అందులో చిరు ధాన్యాలైన పెసలు, అలసంద, ఆముదం, గోంగూర, కందులు లాంటి వాటితో కలిపి వెయ్యండి. వాటిని ప్రధాన పంట విత్తనాల్లో కలిపి వెయ్యటం వల్ల చీడ పీడలు ముందుగా వాటికి ఆకర్షింపబడి, ప్రధాన పంటను ఆశించకుండా ఉంటాయి. ఒకవేళ తప్పనిసరి పురుగు మందులు లేదా కషాయాలు పిచికారి చేయాలనుకున్నా ఆ చిరుధాన్యాల పంటలపై పిచికారి చేస్తే చాలు, ప్రధాన పంట సలక్షణంగా పండుతుంది. ఎటువంటి రసాయనాలు లేని ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తులు సమాజానికి అందించిన వారు అవుతారు. పత్తి పంట వేసినా సరే ఆ పొలంలో ప్రతి 6 లేదా 12 సాళ్ళకు ఒక సాలు చొప్పున కంది, గోంగూర, చిక్కుడు, అలసంద లాంటి ధాన్యాలతో కూడిన విత్తనాలు వేస్తే ప్రత్తి కూడా చీడ పీడలకు ఎక్కువ గురి కాకుండా ఉంటుంది" అంటున్నారు విజయ కుమార్.

కాబట్టి తెలుగు రైతాంగం పైన చెప్పిన సూచనలు ఆచరించి, మిశ్రమ పంటలు వేయటం, ప్రతి పంటకు భూమికి కొంత కాలం విశ్రాంతి ఇవ్వటం ద్వారా అధిక దిగుబడులు, అధిక లాభాలను, రైతుల జీవితాల్లో శాంతి నెలకొనాలని కోరుకుంటోంది 'పల్లెసృజన'. ●

**సృజనాత్మక సేంద్రియ రైతు విజయకుమార్**
**ఫోన్ నంబర్ : 9849648498**



# జాతీయ అవార్డు పొందిన గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్లు

- 'ఎన్.ఐ.ఎఫ్. వారి
రెడీ టు సేల్' ప్రచురణ సౌజన్యంతో...
స్వేచ్ఛానువాదం : జమ్మలమడక శశిమోహన్

## వ్యవసాయ వ్యర్థాలను ఎరువుగా మార్చే యంత్రం

**సమస్య - పరిష్కారం :**

సేంద్రియ వ్యవసాయ విధానంలో 'కంపోస్టు' ఎరువుకున్న ప్రాధాన్యత మరి దేనికీ లేదు. వ్యవసాయ వ్యర్థాలు, ఇళ్ళలోని చెత్తతో కంపోస్టు చేసుకోవచ్చు అని అందరికీ తెలుసు. కాకపోతే దానికి సాధారణంగా 3-4 నెలల సమయం పడుతుంది. ఈ కాల పరిమితిని తగ్గించే యంత్రాలు విదేశాల్లో మాత్రమే లభించేవి. కానీ 'ఉర్మెల్ సింగ్ ధోన్సీ' అనే రాజస్థాన్‌కు చెందిన ఇన్నోవేటర్ ఈ ప్రక్రియని కేవలం 25 నుండి 40 రోజుల లోపలే చేసే పరికరాన్ని కనుగొన్నాడు. అతను చెప్పినదాని ప్రకారం ఈ యంత్రం ద్వారా కంపోస్టు తయారు చేయటానికి టన్నుకు కేవలం 2 రూపాయలు ఖర్చవుతుంది.

**పరికరం :**

చెత్తను తిరగవేయటం యంత్రం సహాయంతో జరుగుతుంది. ఈ యంత్రాన్ని ట్రాక్టర్‌కు అనుసంధానం చేసుకోచవచ్చు. యంత్రంలో భాగంగా ఒక రోటర్ షాఫ్ట్‌కు కొన్ని బ్లేడ్లు అమర్చబడి వుండి ఆ బ్లేడ్లు తిరుగుతూ చెత్తను తునకలు చేస్తూ, తడి కూడా అందజేస్తాయి. ఎండాకాలంలో 5 రోజులకోసారి, చలి కాలంలో 7 రోజులకోసారి చొప్పున 5-6 సార్లు చెత్త కుప్పపైకి ఈ యంత్రాన్ని తోపుకుంటూ వెళ్ళితే చాలు అదే చెత్తను కలిపి నీరు అందించటం వల్ల ఆ చెత్త కంపోస్టుగా తయారవుతుంది.




**సాంకేతిక వివరాలు :**

- 400 టన్నుల చెత్తను ఒక గంటలో కలియ గలుపుతుంది.
- గంటకు మూడున్నర నుంచి 4 లీటర్ల డీజిల్ ఖర్చవుతుంది.
- 50 హెచ్‌పి ట్రాక్టర్‌కు దీన్ని అనుసంధానం చెయ్యవచ్చు.
- రోటర్ 16 అంగుళాల వ్యాసం, 9 అడుగుల పొడవు కలిగి వుండి, 9 బ్లేడ్లు అమర్చబడి వుంటాయి.
- క్రోమ్ స్టీల్‌తో తయారు చేయబడిన ప్రత్యేకమైన గేర్‌బాక్స్ సహాయంతో వేలకొద్ది టన్నుల వ్యవసాయ వ్యర్థాలను, గృహ వ్యర్థాలను కంపోస్టుగా తయారు చేసుకోచవచ్చు.
- రోటర్‌ను క్రిందకు, పైకి కదపటానికి అనువుగా హైడ్రాలిక్ సదుపాయం కలదు.
- 2000 లీటర్ల సామర్థ్యమున్న నీటి ట్యాంకు అమర్చబడి వుంటుంది.

**ముఖ్యాంశాలు :**

- ఈ యంత్రం సహాయంతో 120 నుండి 150 రోజుల్లో తయారయ్యే కంపోస్టు 25-40 రోజుల్లోనే తయారు చేయవచ్చు.
- పేడ కంపోస్టుకన్నా ఈ వర్మి కంపోస్టులో పోషక విలువలు ఎక్కువ.
- ఈ పనంతా ఒకేవ్యక్తి చేసుకోవచ్చు.
- నిరుద్యోగులకు, ఎక్కువ కంపోస్టు అవసరమైన వారికి ఇది ఎంతో అనువైన యంత్రం.
- నలుగురు నిరుద్యోగులు ఈ యంత్రాలను పట్టణాల్లో ఏర్పాటు చేసుకుంటే వారికి ఉపాధి, రైతులకు తక్కువ ధరలో సేంద్రియ ఎరువు అందించటంతో పాటు, పట్టణాలను చెత్త దుర్గంధం నుండి కాపాడి ఆరోగ్యకరమైన వాతావరణం అందించవచ్చు.

**పురస్కారాలు :**

- ఇన్నోవేటర్ 'గుర్మిల్‌సింగ్ ధోన్సీ' కి ఎన్ఐఎఫ్ వారు 2012లో 'ఉత్తమ సాంప్రదాయ జ్ఞానం' బహుమతిని అందజేశారు.

## మార్పు చేయబడ్డ గోధుమ/వరి నూర్పిడి యంత్రము

55 సం. వయసున్న సురేంద్ర ప్రసాద్ వ్యవసాయ యంత్రాలు రిపేరి చేయటం, తయారు చేయటంలో నిష్ణాతులు. ఇతను వరి, గోధుమల నూర్పిడి యంత్రాన్ని తయారు చేశాడు. ఈ ప్రక్రియలో జరిగే మూడు రకాల పనులను అనగా కోత కోయటం, నూర్పిడి చేసి, గింజలను, గడ్డిని విడివిడిగా సేకరించటం ఒకేసారి చేస్తుందీ యంత్రం.

ప్రసాద్ ప్రాథమిక విద్యను అభ్యసిస్తున్న రోజుల్లోనే ఈయన తండ్రి క్షయ వ్యాధితో మరణించాడు. పూట గడవటమే కష్టంగా వున్న తరుణంలో ఏడుగురు సభ్యులున్న కుటుంబాన్ని పోషించటానికి పెద్దన్నకి వ్యవసాయ పనులలో చేదోడు వాదోడుగా ఉండటానికి చదువు మానేయ వలసి వచ్చింది. వ్యవసాయంలో వచ్చే కొద్దిపాటి ఆదాయంతో కుటుంబం గడవక పోవటంతో తన గ్రామంలోనే ఒక సైకిల్ రిపేరు షాపును ప్రారంభించాడు. అక్కడా ఎక్కువ ఆదాయం రాకపోవటంతో కొన్ని సంవత్సరాలకే దాన్నీ మూసివేయాల్సి వచ్చింది. డబ్బు సంపాదించాలనే ధ్యేయంతో రెండు మూడు సంవత్సరాలు ఇల్లు వదిలి పంజాబ్ రాష్ట్రంలో, పక్క రాష్ట్రమైన ఉత్తర ప్రదేశ్‌లో చిన్నపాటి ఉద్యోగాలు చేస్తూ, తిరిగి 1985లో పంజాబ్ లోని సొంత ఊరికి చేరుకున్నాడు. చవకగా వస్తుంది అన్న ఉద్దేశ్యంతో తన ఊరికి నాలుగు కిలోమీటర్ల దూరంలో ఒక ట్రాక్టరు రిపేరు షాపు ప్రారంభించాడు. దాన్ని నడపటానికి తన భార్య, ముగ్గురు కొడుకులు కూడా అందులోనే పనిచేసేవారు. కాలక్రమేణా ఆ వర్క్‌షాపు వృద్ధి చెంది మంచి ప్రాచుర్యం పొంది, తన కుటుంబం సాఫీగా గడిచి పోవటానికి తగ్గ ఆదాయం సమకూర సాగింది.

2007 లో పంజాబ్ రాష్ట్రంలో కొత్తగా వంట నూర్పిడి యంత్రాలను ప్రవేశ పెట్టడం జరిగింది. కాకపోతే ఆ యంత్రాలు కేవలం గింజలను సేకరించి, వృధాను పొలంలోనే వదిలేసేవి. రైతులు ఆ చెత్తనంతా ఏరివేయటం శ్రమతో కూడుకున్న పని కనుక పొలంలోనే తగులబెట్టే వారు. దాంతో ఆ చెత్త కాలీ కాలక, పొలంలో కొంత మిగిలిపోయి, మరుసటి పంట వేయటానికి ఇబ్బంది కరంగా ఉండటమే కాక, పశువులకు మేతగా పనికి రాక, భూసారంపై ప్రభావం చూపేది. అప్పుడే సురేంద్ర ప్రసాద్‌కు నూర్పిడి సమయంలో వృధాని కూడా సేకరించే యంత్రం తయారు చేయాలన్న ఆలోచన కలిగింది.

2010 ఆగస్టులో ప్రారంభించి, ఏప్రిల్ 2011 నాటికి అనేక కష్ట నష్టాలకు ఓర్చి ఒక యంత్రాన్ని రూపొందించ గలిగాడు. అదీ నచ్చక అనేక ప్రయోగాలు చేసి, ఏప్రిల్ 2014 నాటికి తాను అనుకున్న విధంగా సంతృప్తికరంగా పని చేసే నూర్పిడి యంత్రాన్ని తయారు చేయ గలిగాడు.



65 హార్స్‌పవర్‌లు ఆ పైన సామర్థ్యం కలిగిన ట్రాక్టర్‌కు అనుసంధానం చేసి ఈ హార్వెస్టర్‌తో కోత, నూర్పిడి గింజలు, గడ్డి వేరువేరుగా సేకరించుకోవచ్చు. ఈ పరికరంలో గోధుమలను సేకరించటానికి, చిన్న చిన్న ముక్కలుగా చేసిన వ్యవసాయ వృధాలను పశుగ్రాసానికి పనికి వచ్చే విధంగా చేసి సేకరించటానికి వేరువేరు తొట్టెలను ఏర్పాటు చేశాడు. గింజలు దెబ్బ తినకుండా, గడ్డిని మాత్రమే ముక్కలుగా చేసి, గింజలను, పశుగ్రాసాన్ని వేరువేరుగా అతి త్వరలో సేకరించ గలదీ యంత్రం. ఒకసారి 8 క్వింటాళ్ళ గింజలను, 8 క్వింటాళ్ళ పశుగ్రాసాన్ని సకరించగల సదుపాయం ఇందులో వుంటుంది. అవి నిండిన తర్వాత వాటిని ఖాళీ చేసి మళ్ళీ వినియోగించు కోవాల్సి వుంటుంది. ఈ యంత్రాన్ని ఉపయోగించి ఒక ఎకరం పొలాన్ని ఒక గంటలో కోత, నూర్పిడి చేసుకోవచ్చు.

## మొక్కజొన్న కోత మరియు నూర్పిడి చేసే యంత్రం

పంజాబ్ రాష్ట్రం లోని మోగా ప్రాంతానికి చెందిన 38 సంవత్సరాల గురుతేజ్ సింగ్ కి ఒక స్వంత వర్క్‌షాప్ ఉంది. అందులో అతను కంబైన్డ్ హార్వెస్టర్లు, గుంతలు చేసే యంత్రాలు, జొన్న కోసే యంత్రాలు, కన్వేయర్ బెల్టులు, చొప్ప కత్తిరించే యంత్రాలు మొదలైనవి చేస్తూనే తనవద్దకి వచ్చిన వ్యవసాయ పరికరాల రిపేర్లు కూడా చేస్తూ ఉండేవాడు.

2000 సంవత్సరం నుండి ఈయన రీల్ రకం కంబైన్డ్ హార్వెస్ట ర్లు చేస్తూ ఉండేవాడు. కానీ చాలా మంది దాన్ని ఉపయోగించిన వారు ఇది జొన్న చేలలో పనికి రాదు, జొన్న కంకి అంత ఎత్తు అందుకోలేని కారణంగా మార్కెట్లో లభించే ఖరీదైన జొన్న హార్వెస్టర్లను కొనటం మొదలు పెట్టారు. అది తెలుసుకొన్న గురుతేజ్ సింగ్ ఏదైనా కంబైన్డ్ హార్వెస్టర్‌కి అనుసంధానం చేసే విధంగా రీల్ టైప్ పనికి రాని ప్రత్యేకించి మొక్కజొన్న కోసం తయారు చేయాలని నిర్ణయించుకున్నాడు.

చాలా ప్రయోగాలు చేసిన తర్వాత త్రిభుజాకారంలో ఉండే రీల్ టైప్ జొన్న కోత పరికరాన్ని హార్వెస్టర్‌కి అనుసంధానం చేసే విధంగా రూపొందించాడు. ఈ పరికరం జొన్న చొప్పను కోసి, వాటికున్న కంకులను వేరు చేసే పని సునాయాసంగా చేస్తుంది. ఇది త్రిభుజాకార రూపంలో ఉండటం వలన ఎత్తులో వున్న కంకులు ఎటువంటి దెబ్బ తినకుండా కూడా కోయటానికి వీలవుతుంది. ఇది గంటకి 4 నుండి 5 ఎకరాల వంటను 5-6 కి.మీ. వేగంతో వంటను కోస్తుంది. ఈ యంత్రం ఖరీదు దాదాపు 2.5 లక్షల వరకు ఉంటుంది. ఇప్పటికే దీనిని పంజాబ్ ప్రాంతంలోని రైతులు ఉపయోగించి, చాలా బావుందని కితాబునిచ్చారు.



## అధిక దిగుబడినిచ్చే చిక్కుడు రకం

గుజరాత్ రాష్ట్రం లోని సబర్‌కాంత ప్రాంతానికి చెందిన జీతా భాయ్ కోడర్ భాయ్ పటేల్ ఎంపిక పద్ధతి ద్వారా త్వరగా కాపుకు వచ్చే వెడల్పు చిక్కుడు రూపొందిం చాడు. 1987వ సంవత్సరంలో తన ఇంట్లో వున్న పశువులకి దాణాతో పాటు, స్థానికంగా కొనుగోలు చేసిన చిక్కుడు విత్తనాలు కలుపుతూ ఉండగా, అందులో కొన్ని పెద్దగా, వేరే రంగులో ఉండటం గమనించాడు. వాటిని విడిగా చేసి, తన పొలంలోని సాధారణంగా వేసే చిక్కుతో కలిపి కాకుండా, విడిగా నాటి వచ్చిన చిక్కుడులను పరిశీలించగా ఇవి మిగతా చిక్కుడు కన్నా త్వరగా కోతకు రావటం గమనించాడు. వీటిలో కూడా మంచి విత్తనపు గింజలను విడిగా చేసి, నాటి చూడగా, అవి ఇంకా మంచి ఫలితాన్నిచ్చాయి. చిక్కుడు కాయలు త్వరగా కోతకు రావటమే కాక, మంచి రంగులో ఉండి, రుచిగా కూడా ఉండటంతో తన ఎంపిక ప్రయోగాన్ని 8 సంవత్సరాలు కొనసాగించి, 1995లో తనకు నచ్చిన ఒక రకాన్ని స్థిరీకరించాడు. ఆ తర్వాత ఆ విత్తనాలని తనకు తెలిసిన తోటి రైతులకు ప్రయోగాత్మకంగా ఇచ్చి ఫలితాలను చెప్పమన్నాడు. వారంతా నువ్వు ఇచ్చిన విత్తనాలు అధిక దిగుబడి ఇవ్వటమే కాకుండా, చాలా రుచికరంగా కూడా ఉన్నాయని తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు.

"జె.కె.-1" అని నామకరణం చేసిన ఈ చిక్కుడు రకం మొదటి కోత కేవలం 60 నుండి 65 రోజులలో వస్తుంది. అలా ఆగష్టు - ఏప్రిల్ మధ్యలో చాలాసార్లు పంట కోసుకోవచ్చు. ఇది కూడా సాధారణ రకంకన్నా ఎక్కువసార్లు కోతుకు వస్తుంది. కాయ పొడవుగా ఉండి, చక్కటి లేత ఆకుపచ్చ రంగులో ఉండి, తీగకి దాదాపు 700 వరకు కాయలు ఉండి, ముదురు ఆకుపచ్చలో పొడవుగా ఉండే కాయ హెక్టారుకి 67 క్వింటాళ్ళ దిగుబడి రాగా, అదే ఆరోగ్యకరమైన గింజలు ఉండి లేత ఆకుపచ్చ రంగులో వున్న రకం హెక్టారుకు 64 క్వింటాళ్ళ వరకు దిగుబడి ఇస్తుంది. ఇది మామూలు రకం చిక్కుడు దిగుబడికన్నా చాలా ఎక్కువ.

2015-17 మధ్య గుజరాత్ లోని దంతివాడ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో దీనిపై పరీక్షలు జరిపి, ఈ జె.కె.-1 రకం చిక్కుడు విత్తనం 120 శాతం అధిక దిగుబడి ఇస్తుందని నిర్ధారించడం జరిగింది. ఈ రకాన్ని గుజరాత్ రాష్ట్రంలో సబర్‌కాంత, ఆరావళి, పంచ్ మహల్, దాహొడ్, బనస్కాంత జిల్లాలలోని రైతులు విరిగా పండించటం ప్రారంభించారు. ఎన్ఐఎఫ్ కూడా తన క్షేత్ర స్థాయి పరీక్షలలో భాగంగా మహారాష్ట్ర లోని పూనె, పల్ఘార్ జిల్లాలలో, రాజస్థాన్ లోని జయపూర్, శిఖర్ జిల్లాలలో ప్రయోగాత్మకంగా రైతులకు ఇవ్వగా వారు ఈ రకం విత్తనం అద్భుతమైన ఫలితాన్ని ఇస్తోందని తెలియజేశారు. మంచి రుచి కారణంగా మార్కెట్లో కూడా సులభంగా అమ్మకాలు జరుగు తున్నాయని తెలియజేశారు. దీంతో సంతృప్తి పడిన ఎన్ఐఎఫ్ వారు జీతాభాయ్ పటేల్ పేరిట ఈ రకం చిక్కుడుకు 'పిపివి& ఎఫ్ఆర్ఎ' సర్టిఫికెట్ కొరకు దరఖాస్తు చేయటం కూడా జరిగింది.



## అభివృద్ధి చేయబడ్డ "క్యాలీఫ్లవర్" రకం

బీహార్ రాష్ట్రానికి చెందిన వైశాలి జిల్లాలో నివసించే సంజీవ్ కుమార్ అనే యువ రైతు తాను సాధారణంగా పండించే 'క్యాలీఫ్లవర్', 'క్యాబేజి', 'వంగ' రకాల కూరగాయ పంటలను కేవలం పండించటమే కాక, అనేక ప్రయోగాలు చేసి త్వరగా కోతకు వచ్చి, అధిక బరువు తూగి, రుచికరమైన "క్యాలీఫ్లవర్" రకాన్ని కనుగొన్నాడు. ఈ క్యాలీఫ్లవర్ రకానికి "సంజీవ్ సెలెక్షన్" అని పేరు పెట్టి తన పేరు సార్థకం చేసుకున్నాడు. ఈ రకం క్యాలీఫ్లవర్‌లో పెద్ద పెద్ద పువ్వులు బిగుడుగా ఉండి ఆకర్షణీయమైన తెలుపు రంగు కలిగి ఉంటాయి.

సంజీవ్ కుమార్ 2009-13 మధ్య తన పొలంలో ఎన్నో ప్రయోగాలు చేసి, క్యాలీఫ్లవర్ రకంలో అద్భుతమైన ఫలితాలు సాధించాడు. ఈ రకం త్వరగా కోతకు వచ్చి (60 నుంచి 70 రోజుల లోపల), తెల్ల రంగులో ఉండి, ఒక్కొక్కటి కిలో వరకు బరువుండి, హెక్టారుకి 175 క్వింటాళ్ళ దిగుబడిని ఇస్తుంది. ఎన్ఐఎఫ్ వారి చొరవతో సబోర్ లో వున్న బీహార్ వ్యవసాయ విశ్వవిద్యాలయం వారు క్షేత్ర స్థాయి ప్రయోగాలు జరిపి, ఈ రకం అధిక దిగుబడిని ఇస్తుందని, విటమిన్-సి శాతం ఇందులో అధికంగా ఉందని తాము ప్రయోగాత్మకంగా నిరూపించబడిందని నిర్ధారించారు. 2018లో 'ఇండియన్ కౌన్సిల్ ఫర్ అగ్రికల్చర్ రీసర్చ్' మరియు 'ఇండియన్ అగ్రికల్చరల్ రీసర్చ్ ఇన్‌స్టిట్యూట్' వారి విత్తన విభాగం వారు జరిపిన ప్రయోగాలలో ఈ రకం ఉత్తమమైన ఫలితాలు సాధించింది అని ధృవీకరించారు.

**విత్తనాల కొరకు సంప్రదించండి : వీరరాఘవ రెడ్డి, 8125799904**

**పరికరాల కొరకు సంప్రదించండి : సుభాష్ చందర్, 9652801700**



# 'పునాది స్థాయి ఇన్నోవేషన్ల'తో గ్రామీణ యువతకు స్వయం ఉపాధి



- వీరరాఘవ రెడ్డి

గ్రామల్లో యువతీ యువకులు వారి కుటుంబ ఆర్థిక పరిస్థితులు, ఇతర కారణాల రీత్యా ఉన్నత చదువులు చదవలేక పోతున్నారు. ప్రభుత్వ లెక్కల ప్రకారమే మన దేశంలో ప్రాథమిక స్థాయి నుండి ఉన్నత స్థాయి చదువులకు వెళ్తున్న యువత కేవలం 23 శాతం. అంటే 77 శాతం యువత ఉన్నత చదువులు చదవలేక పోతున్నారు. ఎంతోమంది ఉపాధి కోసం ఎదురు చూపులు చూస్తున్న సంగతి అందరికీ విదితమే. తమ చదువుకు తగిన ఉపాధి లభించటం లేదని కొందరు, ఏదైనా ఉద్యోగం సాధిద్దామంటే తగినంత చదువు చదవలేక పోయామే అని కొందరు, ఏదైనా వ్యాపారం చేసుకుందామంటే బ్యాంకులు ఎలాంటి తనఖా లేకుండా తమకు రుణం ఇవ్వటం లేదని కొందరు..... ఇలా ఎన్నో రకాలుగా ఆలోచిస్తూ, ఏమి చెయ్యాలో తెలీక నిస్సహాయంగా గ్రామ యువత కాలం గడుపుతున్నారు.

ఇలాంటి యువత కొరకు తమ గ్రామంలోనే వుండి, తాము తల్లిదండ్రులపైన ఆధార పడకుండా తమ ఖర్చులకు అవసరమైన ధనాన్ని తామే సంపాదించుకోవటంతో పాటు తామే కుటుంబానికి కాస్త చేదోడుగా తయారవుతూ, తమను తిట్టిన నోళ్ళే పొగిడేలా తయారు కావడానికి అవసరమైన ఎన్నో పునాది స్థాయి ఇన్నోవేషన్లను 'పల్లెసృజన' వెలుగులోకి తెచ్చింది. ఏ పని చేస్తున్నామన్నది ముఖ్యం కాదు, తాము చేస్తున్న పని ఎంత మందికి ఉపయోగ పడుతున్నది, దానివల్ల తాము ఎంత సంపాదిస్తున్నాము, గతంకన్నా ఇప్పుడు మనపైన ఎంత గౌరవం పెరిగింది అన్నది ఆలోచిస్తే చాలు మీ భవిష్యత్తును మీరే తీర్చి దిద్దుకున్నవారు అవుతారు. ఈ పరంపరలో 2021 జులై–ఆగస్టు సంచిక నుండి యువత ఉపాధి కొరకు వెలుగులోకి వచ్చిన ఇన్నోవేషన్లను గురించి తెలియజేస్తోంది 'పల్లెసృజన'.


## పునాది స్థాయి ఇన్నోవేషన్లతో గ్రామీణ యువతకు ఉపాధి

ప్రస్తుతం గ్రామాల్లో విరివిగా జరుగుతున్న వ్యాపారం చిన్న పిల్లల ఆహారానికి చెందిన చెగోడీలు, అప్పాల వ్యాపారం. ఎక్కడి నుండి వచ్చిన వలస వ్యాపారులు మీ గ్రామాలలోని దుకాణాలకు ఈ ఆహార పదార్థాలను సరఫరా చేస్తూ ఉండటం మీరు గమనించే ఉంటారు. ఈ వ్యాపారానికి అవసరమైన ముడి సరుకులు అన్నీ దాదాపు మీ గ్రామంలో లభించేవే. వీటికి ప్రధానంగా కావలసింది వేరుశనగ, శనగలు, నువ్వులు, నూనె, బియ్యము, ఉప్పు, కారము. వీటిని అవసరమైన మేరుకు మీ గ్రామంలోనే రైతుల వద్దనుండి కొనుగోలు చేసి, పిండి ఆడించుకుని, ఇంట్లోనే వీటిని తయారు చేసి విక్రయించుకోవటం. మీ గ్రామానికి ప్రస్తుతం సరఫరా చేస్తున్న వారిని సంప్రదించి, ఇకనుండి మీరు ఎక్కడి నుండో వీటిని కొనుగోలు చేసుకుని రావలసిన అవసరం లేదు, మేమే సరఫరా చేస్తాము అంటే వాళ్ళు కూడా ఎక్కడో హోల్‌సేల్ దుకాణాల్లో కొనుగోలు చేసుకునే బదులు, తయారీదారుల వద్ద అయితే ఇంకా తక్కువ ధరకు లభిస్తాయి కదా అని వాళ్ళు కూడా మీవద్దనే కొనుగోలు చేసే అవకాశం వుంది. లేదా వాటిని మీరే స్వయంగా మీ సమీప గ్రామాలకు వెళ్ళి అక్కడి దుకాణాలకు లేదా సమీప పట్టణంలోని హోల్‌సేల్ దుకాణాలకు, మిఠాయిలు అమ్మే దుకాణాలకు వెళ్ళి విక్రయించుకోవచ్చు. జ్యోతుల జస్వంత్ అనే ఇన్నోవేటర్ తన సృజనాత్మక ఆలోచనతో మార్కెట్‌లో లభించే యంత్రాలకన్నా తక్కువ ధరకే లభించేలా మూడు యంత్రాలను తయారు చేసి అనేక మందికి స్వయం ఉపాధి పొందే అవకాశం కల్పిస్తున్నాడు. వాటిని గురించిన వివరాలు ఇలా ఉన్నాయి.

**చెగోడి యంత్రం:**

సాధారణంగా ఇంట్లో పిల్లల కోసం మహిళలు చేసుకునే చిరుతిళ్లే 'చెగోడీలు'. ఇప్పుడు వాటిని కొందరు ఇంట్లో ఖాళీగా వుండే బదులు వ్యాపార దృష్టితో ఇంట్లో పెద్దయెత్తున తయారు చేసి, షాపుల్లో అమ్ముకుంటున్నారు. కానీ చేత్తో చేసే చెగోడీలలో కొన్నింటికి పిండి ఎక్కువ, మరికొన్నింటికి కాస్త తక్కువ వుండటం సాధారణమే. ఈ సమస్యలన్ని గమనించి ఒకే కొలతతో, ఒకే పరిమాణం లో వుండేలా తయారు చేసే యంత్రాలు కూడా మార్కె ట్లోకి వచ్చాయి. కానీ ఆ యంత్రాలను లక్షలాది డబ్బు పెట్టి సామాన్యులు కొనలేరు. ఎందుకంటే చెగోడీలు చెసి వ్యాపారం చెయ్యాలి అనుకునే వారు చిన్న, మధ్య తరగతి కుటుంబాల వ్యక్తులు కావటం వల్ల వారికి ఆ యంత్రాలను కొనేంత ఆర్థిక స్థోమత వుండదు. ఈ సమస్యలకు పరిష్కారంగా యంత్రం తయారు చెయ్యటం వల్ల మధ్య తరగతి కుటుంబం వారు కూడా దాన్ని





కొనుగోలు చేసుకుని, వ్యాపారాత్మకంగా చెగోడీలు చేసుకోవచ్చు.

చేత్తో చేసే చెగోడీలు తూకం ప్రకారం అమ్మాలి అంటే అన్ని ప్యాకెట్లలోని తూకం ఒకేలా వుండొచ్చు కానీ, సంఖ్యలో హెచ్చు తగ్గులు వుంటాయి. పోనీ ప్యాకెట్‌కు ఒక నిర్దిష్టమైన సంఖ్యలో నింపితే తూకంలో తేడా వల్ల నష్టం జరిగే అవకాశం వుంటుంది. ఈ యంత్రంతో చెగోడీలు చేస్తే అన్నీ ఒకే పరిమాణం, సరియైన తూకం, సంఖ్య వుంటాయి. నాణ్యత కూడా ఒకే రకంగా వుంటుంది కాబట్టి వ్యాపారులు కూడా వీటిని తీసుకోవటానికే ఎక్కువగా ఇష్టపడతారు.

వ్యాపార రీత్యా రోజుకు వేలల్లో చెగోడీలు చెయ్యాలంటే కనీసం 10 మంది అవసరం అవుతారు. అయితే ఈ యంత్రంతో చెగోడీలు చెయ్యాలంటే, పిండి తడిపి ముద్దగా చెయ్యటానికి ఒక మనిషి, యంత్రం వద్ద ఒక మనిషి, తయారైన చెగోడీలు నూనెలో వేయించడానికి ఒక మనిషి మొత్తం ముగ్గురు మనుషులు రోజుకు మూడు వేలకు పైగా చెగోడీలు తయారు చేస్తారు. ముగ్గురు వ్యక్తులు కూడా పెద్దగా అలుపు లేకుండా చేయటమే కాక, కనీసం 7 మంది కూలీల ఖర్చును మిగిలించు కున్నట్లు అవుతుంది. ఆ ముగ్గురూ ఇంటివాళ్ళే అయితే మొత్తం కూలీల ఖర్చు లాభంగా మారుతుంది. గ్రామీణ నిరుద్యోగ యువతీ యువకులు, ఇంటివద్ద ఖాళీగా వుండే మహిళలు ఒక యంత్రాన్ని తీసుకున్నట్లయితే వారు సరదా కబుర్లతో సమయం వృధా చేసుకోకుండా అదనపు ఆదాయం కూడా సమకూర్చుకున్నట్లు అవుతుంది.

**'అప్పాల' యంత్రం :**

జ్యోతుల జస్వంత్ చేసిన రెండో యంత్రం 'అప్పాలు' (కొన్ని ప్రాంతాల్లో వీటిని 'చెక్కలు' అంటారు) చేసే యంత్రం. ఈ యంత్రానికి అప్పాలు చెయ్యటానికి అవసరమైన పిండి తడుపుకుని, ముద్దలుగా చేసి యంత్రం వద్ద వుంచినట్లయితే వాటిని అప్పాలుగా వత్తుతుంది. వాటిని తీసుకుని నూనెలో వేయించటం మరో వ్యక్తి చేసే పని. వీటిని చాలా సులభంగా తయారు చేస్తుందీ యంత్రం. ఇప్పుడు ఈ అప్పాలకు కూడా గిరాకీ బాగా వుండటంతో ఈ యంత్రం ద్వారా తయారైనవి ఒకే సైజులో, అందంగా వుండటం వల్ల వినియోగదారులను బాగా ఆకట్టుకుం టున్నాయి.

**వేరుశనగ పప్పు పొట్టు తీసి, పలుకులు చేసే యంత్రం :**

జ్యోతుల జస్వంత్ వీటితో పాటు మరో యంత్రాన్ని కూడా తయారు చేశాడు అదే వేరుశనగ పప్పు పైపొట్టు తీసి, గింజలను రెండు ముక్కలుగా చేసే యంత్రం.

పైన చెప్పిన అప్పాలు తయారు చేయటం లో వేరుశనగ పప్పు కూడా చేరుస్తారు. అంతే కాక వేరుశనగ, బెల్లంతో చిక్కీలు లేదా వేరుశనగ గుండ్లు తయారు చేసి విక్రయిస్తూ వుంటారు. ఇవి తయారు చెయ్యాలంటే ముందుగా వేరుశనగ పప్పును పెనంపై వేయించి, అవి చల్లారిన తర్వాత వాటిని చేతితో లేదా ఒక చెక్కతో పలుకులుగా తయారు చేసి ఆ తర్వాత ఆ పలుకులలో వున్న పొట్టు వేరు చేయాల్సి వుంటుంది.



పెద్దయెత్తున వ్యాపార రీత్యా భారీ స్థాయిలో చేయాలంటే, వాటికి తప్పక కూలీలను ఏర్పాటు చేసుకోవాల్సి వుంటుంది. పైగా ఈ వేరుశనగ పప్పును పలుకులుగా చెయ్యటంలో సరియైన అనుభవం లేనివారు చేస్తే ఎక్కువగా ముక్కలు కావటం జరిగితే చిక్కీ లేదా గుండ్లు తయారీ నాణ్యంగా వుండదు. ఈ పని కొరకు ఒక పిండిమర లాంటి యంత్రాన్ని తయారు చేశాడు జస్వంత్. వేరుశనగ పప్పును వేడి చేసిన తర్వాత ఈ యంత్రంలో వేసినట్లయితే పప్పు ముక్కలు ముక్కలుగా కాకుండా కేవలం రెండు ముక్కలుగా వేరు చేసిన తర్వాత పలుకులు ఒకవైపు, పైపొట్టు మరో వైపు వచ్చేలా ఏర్పాటు చేయబడింది. ఆ తర్వాత అవి కావలసిన పదార్థాలు చెయ్యటానికి సిద్ధంగా వుంటాయి. 10 మంది చెయ్యాల్సిన పని ఇద్దరు వ్యక్తులు మాత్రమే చేసుకోవచ్చు, పైగా నాణ్యత వుంటుంది, శ్రమ కూడా చాలా తక్కువ.

జ్యోతుల జస్వంత్ తయారు చేసిన ఈ మూడు యంత్రాలు కేవలం ఒక్క హార్స్‌పవర్ కరెంటు మోటారుతో పని చేస్తాయి కావున విద్యుత్ ఖర్చు కూడా పెద్దగా వుండదు. కాబట్టి నిరుద్యోగ యువతీ యువకులు తక్కువ ఖర్చుతో రోజుకు 3 నుండి 5 వేల వరకు సంపాదించుకోవచ్చు.

ఆహార పరిశ్రమ వేల కోట్ల రూపాయలతో ముడి పడి వున్నది. తినుబండారాలను బయటనుండి కొని తినటం అధికం కావటం వల్ల "రెడీ టు ఈట్" పరిశ్రమకు బాగా డిమాండ్ పెరుగుతున్నది. ఇలాంటి పరిస్థితుల్లో ఈ పరిశ్రమను యాంత్రికం చెయ్యటం చాలా ముఖ్యం.

**జ్యోతుల జస్వంత్ ఫోన్ నెం. 9440019271**

# ఎన్.ఆర్.వి. లకు విన్నపము

ప్రతి గ్రామంలో ఎన్.ఆర్.వి. (నాన్ రెసిడెంట్ విలేజర్స్) ఉంటారు. ఉద్యోగ రీత్యా లేదా వ్యాపార రీత్యా తమ గ్రామానికి దూరంగా స్థిరపడిన వారు చాలామంది తమ గ్రామం పట్ల మక్కువ వున్నవారై వుంటారు. తమ గ్రామం కోసం ఏదైనా ఒక మంచి పని చేయాలి అన్న తపన కలిగిన వారు కూడా వుంటారు. అటువంటి వారు కేవలం రూ. 400/–లతో 2సంవత్సరాల పాటు తమ గ్రామానికి ఒక మంచి పుస్తకాన్ని అందిస్తే మీకు మంచి పేరు రావటం, సంతృప్తి కలగటంతో పాటు, మరుగున పడివున్న ఎన్నో ఇన్నోవేషన్లు వెలుగులోకి వస్తాయి, మరెన్నో ఇన్నోవేషన్లను గురించిన సమాచారం మీ గ్రామానికి చేరి, వారు వినియోగించుకునే సదుపాయం కలుగుతుంది. ఈ ప్రయత్నం వల్ల తెలుగు రాష్ట్రాలలోని 30 వేల గ్రామాలకు త్వరలో 'పల్లెసృజన' చేరుతుందని, సామాన్య ప్రజల మధ్య సమానాంతర సంభాషణలు ప్రారంభమై, వారిని మరింత ప్రభావితం చేస్తాయని 'పల్లెసృజన' మనసారా ఆశిస్తోంది.

- ఎడిటర్

## పల్లె జ్ఞానాన్ని వ్యాపింపజేయండి - 'పల్లెసృజన'ను బహూకరిచండి!




### మీ గ్రామానికి మీరిచ్చే అత్యుత్తమ బహుమతి 'పల్లెసృజన'

సందర్భం ఏదైనా ఆచారం, సాంప్రదాయం ప్రకారం ప్రతి సందర్భంలో ఓ బహుమతి ఇస్తూ వుంటారు. దానికెంత ఖర్చు చేయాలి? అసలు బహుమతి ఏమివ్వాలి? అన్నవి ఎప్పుడూ ఆలోచిస్తూ ఉంటారు.

**ఇచ్చిన బహుమతి ఆ సందర్భంలోనే ఆనందాన్ని పంచేదిగా కాకుండా,**
**అందరూ ఇచ్చిన దానికన్నా భిన్నంగా,**
**జ్ఞానాన్ని, విజ్ఞానాన్ని పంచేది, పెంచేదిగా ఉండాలంటే?**

బహుమతి ఇచ్చిన వారికే కాక, తీసుకున్న వారితో పాటు, నలుగురికీ పనికి వచ్చే విధంగా ఉండాలి. 'పల్లెసృజన' పత్రిక మన పల్లెల్లో మారుమూల ప్రాంతాల్లో దాగివున్న విజ్ఞాన సంపదను వెలికి తీసి, ప్రస్తుత నవ సమాజానికి ఉపయోగపడే విధంగా చేయటానికి పాటు పడుతుంది.

విశేషాలు

# మే-జూన్ మాసాల్లో 'పల్లెసృజన' ఆధ్వర్యంలో జరిగిన విశేషాల చిత్రాలు





ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో ఏప్రిల్ 10-13 వరకు జరిగిన "ఫెస్టివల్ ఆఫ్ ఇన్నోవేషన్ & ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్' కార్యక్రమంలో 'పల్లెసృజన' ఇన్నోవేటర్లు చింతకింది మల్లేశం, మోధా శివకుమార్, గల్లా చంద్రశేఖర్‌లు పాల్గొని తమ ఇన్నోవేషన్లను ప్రదర్శించారు. భారత రాష్ట్రపతి శ్రీమతి ముర్ము గారు స్టాళ్ళను సందర్శించారు. ఎన్‌ఐఎఫ్ డైరెక్టర్ & చీఫ్ ఇన్నోవేషన్ అధికారి విపిన్ కుమార్, హనీబీ వ్యవస్థాపకులు అనిల్ గుప్తా, డిఆర్‌డిఓ ఛైర్మన్ సతీష్ రెడ్డి తదితరులు కూడా మన తెలుగు ఇన్నోవేటర్ల స్టాళ్లను సందర్శించి, వారి ఇన్నోవేషన్లను పరిశీలించినప్పటి దృశ్యాలు.



గ్లోబల్ ఇండియన్ సైంటిస్ట్స్ & టెక్నోక్రాట్స్ ఫోరం వారు ఢిల్లీలో మే 31, జూన్1,2 తేదీలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మన 'పల్లెసృజన' ఇన్నోవేటర్ "గొర్రె అశోక్" కు 'రూరల్ ఇన్నోవేటర్' పురస్కారంతో సత్కరించారు. సూర్యాపేట జిల్లా, అంజలీపురం గ్రామానికి చెందిన అశోక్ వ్యవసాయ రంగానికి సంబంధించిన 8 రకాల ఇన్నోవేషన్లను తయారు కనిపెట్టారు. ఈ కార్యక్రమంలో 6 వ్యవసాయ పరికరాలను ప్రదర్శించడం జరిగింది.





హైదరాబాద్ లోని ఎసిఐసి-సిబిఐటి కళాశాలలో 28 ఏప్రిల్, 2023న 'పల్లెసృజన' వెలుగులోకి తెచ్చిన ఇన్నోవేషన్ల ప్రదర్శన నిర్వహించ బడింది. క్రియేటివ్ మైండ్స్ ఆధ్వర్యంలో నిర్వహించబడిన ఆ ప్రదర్శనలో ఇన్నోవేటర్లు ప్రదర్శించిన తమ ఇన్నోవేషన్లను సిబ్బంది, విద్యార్థులతో కళాశాల ప్రిన్సిపాల్ మరియు డైరెక్టర్ డా. రవీందర్ రెడ్డి గారు తిలకించి పరిశీలిస్తున్న దృశ్యాలు.



జూన్ 6వ తేదీన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చౌటుప్పల్ సమీపంలోని మల్కాపురం గ్రామంలో 545 ఎకరాలలో ఇండస్ట్రియల్ పార్క్, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ లను ఏర్పాటు చేసిన సందర్భంగా మన ఇన్నోవేటర్ 'పద్మశ్రీ' పురస్కార గ్రహీత "చింతకింది మల్లేశం"ను రాష్ట్ర మంత్రు లు కెటిఆర్, మరియు జగదీష్ రెడ్డి గారలు సత్కరించి నప్పటి చిత్రం




హైదరాబాద్ లోని 'థియోలాజికల్ రీసర్చ్ విశ్వ విద్యాలయం' వారు నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణ టూరిజం కార్పోరేషన్ ఛైర్మన్ ఉప్పాల శ్రీనివాస్ చేతుల మీదుగా 'గౌరవ డాక్టరేట్' పురస్కారం అందుకున్న 'పల్లెసృజన' ఇన్నోవేటర్ 'చిన్నికృష్ణుడు'. 120 రకాల వరి ధాన్యాన్ని సేకరించి, పండించి, దేశీ రకం వరి ధాన్యాన్ని అభివృద్ధి చేసినందుకు వీరికి ఈ పురస్కారం లభించింది.





## ప్రకృతి వరప్రసాది 'కొమెర జాజి'కి దక్కిన అరుదైన గౌరవం

5 జూన్, 2023 'ప్రపంచ పర్యావరణ దినోత్సవం' సందర్భంగా పల్నాడు జిల్లా వినుకొండ పట్టణం లోని జూనియర్ కళాశాలలో జిల్లా అటవీశాఖ అధికారి (డిఎఫ్‌ఓ) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఒక కార్యక్రమంలో స్థానిక శాసన సభ్యులు 'బొల్లా బ్రహ్మయ్య నాయుడు', అటవీ శాఖ అధికారులు సత్కరించి, ప్రకృతి మిత్ర, అటవీ సంరక్షకుడిగా గుర్తింపునిచ్చారు. ఈ సందర్భంగా అటవీ శాఖ అధికారులంతా కలిసి అతనితో ఫొటో దిగటం చాలా ఆనందంగా ఉంది అన్నారు కొమెర జాజి.



తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల సందర్భంగా జూన్ 6న 'పారిశ్రామిక ప్రగతి ఉత్సవం' కార్యక్రమంలో కామారెడ్డి జిల్లా పరిశ్రమల కేంద్రం లో ఏర్పాటు చేసిన ఒక కార్యక్రమంలో 'పల్లెసృజన' ఇన్నోవేటర్ "కమ్మరి నాగస్వామి" బ్యాటరీతో పని చేసే 'వరినాటు యంత్రం' తయారు చేసినందుకు మరియు 'లక్షణ ఆగ్రో ఇంజనీరింగ్ వర్క్స్" సంస్థను స్టార్టప్‌లో భాగంగా ఏర్పాటు చేస్తున్నందుకు గాను తెలంగాణ రాష్ట్ర శాసన సభ స్పీకర్ పోచారం శ్రీనివాస రెడ్డి, శాసన సభ్యులు, ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ మరియు జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్ తదితరులు సన్మానించారు.






హైదరాబాద్ లోని 'మల్లారెడ్డి విశ్వ విద్యాలయం వారి వ్యవసాయ కళాశాల'లో 21 మే, 2023న జరిగిన "రైతు విజయం-ప్రకృతి రైతు బజారు" కార్యక్రమం నిర్వహించ బడింది. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర మంత్రి, కళాశాల వ్యవస్థాపకులు మల్లారెడ్డిగారు, పల్లెసృజన వ్యవస్థాపక అధ్యక్షులు బ్రిగేడియర్ గణేశం గారు, 'పద్మశ్రీ' పురస్కార గ్రహీత చింతల వెంకట్ రెడ్డి గారు ప్రసంగిస్తున్న దృశ్యాలు మరియు సమావేశానికి హాజరైన ఆహ్వానితులు పాల్గొన్న దృశ్యాలు.

# సమాజం అడిగిన ప్రశ్నలకు ప్రకృతి పుత్రుడు 'కొమెర జాజి' సమాధానాలు



కొమెర జాజి నల్లమల అడవుల్లో చేస్తున్న ప్రకృతి రక్షణ గురించి 'పల్లెసృజన' మే-జూన్, 2020, మార్చి-ఏప్రిల్ మరియు నవంబర్-డిశంబర్ 2022 సంచికల్లో ప్రచురించింది. ఇలా అడవులలో ప్లాస్టిక్, గాజు సీసాల వ్యర్థాలను గత 15-20 సంవత్సరాలుగా ఏరి శుభ్రం చేస్తున్న జాజిని కొందరు మిత్రులు అడిగిన ప్రశ్నలకు అతని సమాధానాలు ఈవిధంగా ఉన్నాయి.

**1. అడవులలోకి ప్లాస్టిక్ వ్యర్థాలు, పగిలిన సీసాలు ఎలా వస్తాయి?**

**జ.** అడవులలో వివిధ రకాల వ్యక్తులు నిత్యం పార్టీలు, విలాసాల పేరుతో, సండే పార్టీలు, వీక్ ఎండ్ పార్టీలు, కుల, వన, రాజకీయ పార్టీలు, పుట్టిన రోజు పార్టీలు, రకరకాల సరదాలు, షికారుల పేరుతో అడవి పక్కన లేదా మార్గంలో కుంటలు, చెక్ డ్యామ్‌లు, ఎత్తయిన కొండలు, గుట్టలు మాదాన ప్రాంతాలు, పురాతన దేవాలయాలు, పచ్చని పచ్చికల మధ్య ఎత్తయిన చెట్ల కింద భోజనాలు చేస్తూ, పార్టీలు చేసుకుంటూ అక్కడ ప్లాస్టిక్ వ్యర్థాలు, పాలిథిన్ కవర్లు, డిస్పోజబుల్ గ్లాసులు, సీసాలు పడేసి వెళ్ళిపోతుంటారు. అవి గాలికి, వర్షాలకు కొట్టుకొని ఎగిరిపోతూ అడవి నిండా తయారవుతాయి.

**2. అడవులలో ప్లాస్టిక్ ఉంటే ఏమిటి నష్టం?**

**జ.** అడవి ప్రాణులు, పక్షులు, జంతువులు ఆ ప్లాస్టిక్ వ్యర్థాలను తిని చనిపోతుంటాయి. పక్షులు పగిలిన సీసాలలోని నీళ్ళు త్రాగి అపస్మారక స్థితి వెళ్ళి చనిపోతుంటాయి. పగిలిన సీసాలు గుచ్చుకొని జంతువులు గాయలా పాలవుతుంటాయి.

**3. అడవి ప్రాణులు, జంతువులు చనిపోతే ఏమిటి నష్టం?**

**జ.** అడవి ప్రాణులు, పక్షులు, జంతువులు చనిపోతే మనిషి మనుగడ లేదు. మనిషి లేకపోయినా ఈ సృష్టి, అడవులు సమస్త ప్రాణులు ఆనందంగా జీవించ గలవు. కానీ ప్రాణులు లేకపోతే మనిషి బ్రతకలేడు. అడవి జంతువుల ద్వారా ప్రతియేటా కొన్ని లక్షల చెట్లు మొలుస్తాయి, అవి మల విసర్జన ద్వారా, కొన్ని పండ్ల చెట్లు మొలుస్తాయి. ఇవే పక్షులకు ఆహారం. ఉదా.: తునికి, నేరేడు, జాన, కలిమి, బలిజ ఇలా ఎన్నో రకాల పండ్ల చెట్లు మొలుస్తాయి. అడవి జంతువులు అడవిలోని భూమిని బాగా సారవంతం చేస్తాయి. దాని ద్వారా అడవికి మేలు జరుగుతుంది. ఇంకా పక్షులు తొలకరి సమయంలో చెట్లకు పట్టిన పురుగులు, చెదలు తిని చెట్లు బ్రతికేలా చేస్తాయి. అవే పక్షులు రైతుకు రెట్ట ద్వారా భూమికి బలాన్ని ఇచ్చి మేలు చేస్తాయి. పంటపై ఉండే పురుగులను ఎరుకొని తిని చీడ పీడల నుండి పంటను కాపాడతాయి. మనిషి లేకపోయినా ఈ అడవి ప్రాణులు కొన్ని యుగాల పాటు జీవించ గలవు కానీ, అడవి ప్రాణులు లేకపోతే కొన్ని సంవత్సరాలలో మనిషి కనుమరుగవుతాడు.

**4. అడవులు ఇప్పుడు ఎలా ఉన్నాయి?**

**జ.** మనదేశంలో 33% ఉండవలసిన అడవులు ఇప్పుడు 21%కి వచ్చాయి. మన తెలుగు రాష్ట్రాలలో అయితే 17% మాత్రమే ఉన్నాయి. ఇప్పటికే అడవులు పలుచగా అయినాయి. నిత్యం అడవులలో చెట్లు



నరికేస్తారు, అడవులను ఆక్రమిస్తున్నారు. అడవి ప్రాణులు అభద్రతా భావంతో బ్రతుకుతున్నాయి. నిత్యం ఎన్నో అడవి జంతువులను, పక్షులను వేటాడుతూ, కరెంటు పెడుతూ చంపేస్తున్నారు. మనం వాటి ప్రపంచం లోకి వెళితే అవి మన ప్రపంచంలోకి వస్తున్నాయి. ముఖ్యంగా కోతులు ఊర్లలోకి వచ్చి వాటికి మనకి మధ్య యుద్ధం జరుగుతోంది. వాటి ప్రపంచంలో అవి ఉంటేనే అడవి ఎప్పుడూ అందంగా ఉంటుంది.

**5. మరి మీరు ఒక్కరే ఎందుకు చేస్తున్నారు?**

**జ.** అందరు ఒకలా ఉండాలి, చేయాలి అనేదేమీ లేదు. ప్రతి ఒక్కరు ఏదో ఒక కార్యం కోసమే పుడతారు. అది తెలుసుకుంటే కారణ జన్ములు అవుతారు. నన్ను ఈ ప్రకృతి కోరుకుంది అని నేను బలంగా నమ్ముతున్నాను. ప్రకృతి దేవాలయం. అందులో ప్రాణులు దైవం అని నమ్మి సేవ చేస్తున్నా.

**6. మీ ఒక్కరితో మార్పు సాధ్యమా?**

**జ.** మాటలు చెబితే ఎవరూ మారరు. మాటల వల్ల పని కాదు. ఏదైనా మనతోనే పని ప్రారంభించాలి, ముందుకు వెళ్ళాలి. ఎదుటివారు చూడాలి, వాళ్ళు ఆచరించాలి. ఎదుటివారు చూశారు, మారారు, మారుతున్నారు. భవిష్యత్‌లో ఇంకా మారతారు కూడా. నాకు ఆ నమ్మకం ఉంది. మార్పు ఎప్పుడూ వ్యతిరేకించబడుతుంది. తరువాత గమనించ బడుతుంది, ఆలోచింపజేస్తుంది, ఆచరింపబడుతుంది.

**7. ఇప్పటిదాకా మీరు సాధించిందేమిటి? ఏదైనా మార్పు వచ్చిందా?**

**జ.** నా చిన్నతనంలో నుండి ఈ ప్లాస్టిక్ ఏరివేస్తున్నా. ప్రకృతి పాఠాలు విద్యార్థులకు చెబుతున్నా. ఇప్పటి వరకు కొన్ని వేల ఎకరాల్లో అడవులను శుభ్రం చేశాను. పరోక్షంగా ఎన్నో ప్రాణులు చనిపోకుండా కాపాడాను. రెండు తెలుగు రాష్ట్రాలలో సుమారు 6 వేల పాఠశాలల్లో ఎంతోమంది విద్యార్థుల మనసుల్లో ప్రకృతి ప్రేమ బీజాలు వేశాను. యువతలో మార్పు తీసుకు రాగలిగాను. అడవులలో దేవాలయాల దగ్గర ప్లాస్టిక్ వద్దు అని బ్యానర్లు పెడుతున్నారు. ఇంకా ఎంతో మార్పు సాధించాను అని అనుకుంటున్నా.

**8. ఎంత కాలం నుండి చేస్తున్నారు? మీకు స్ఫూర్తి ఎవరు?**

**జ.** ఇప్పుడు నా వయసు 41 సంవత్సరాలు. నా 14వ ఏట నుండి అడవికి వెళ్ళాను. మా ఊరు పొలిమేర నుండి నల్లమల అడవి ప్రారంభం అవుతుంది. అప్పటి నుండి ఇప్పటికీ చేస్తూనే ఉన్నాను. నాకు స్ఫూర్తి మా నాన్న. చిన్నపుడు నాకు ఆరోగ్యం బాగోలేకపోతే గుండెలపై పడుకో బెట్టుకొని కాకమ్మకి కట్లగూడు, పిచ్చుకమ్మకి పరకల గూడు అంటో అడవి కథలు చెప్పేవాడు. అలా అడవి ప్రకృతి జంతువులపై ఆసక్తి పెరిగింది.

**9. అడవులలో ఒక్కరే కదా మీకేమీ ప్రమాదం, జంతువుల భయం ఉండదా?**

**జ.** అడవి ప్రాణులు ఎప్పుడూ అభద్రతా భావంతో బ్రతుకుతుంటాయి. వాటివలన నాకేమీ ప్రమాదం లేదు. నేను వాటి బ్రతుకు కోసం బ్రతుకుతున్నా. అడవి అమ్మలాంటిది ఆదుకుంటుంది. నాకేమీ ప్రమాదం లేదు, రాదు కూడా. నాకు నిత్యం రకరకాల పక్షులు, జంతువు లు కనిపిస్తూనే ఉంటాయి. వాటిని చూస్తే ఆనందం కలుగుతుంది.

**10. అడవులలో ఒంటరిగా ఇలా ప్లాస్టిక్ ఏరివేస్తున్నపుడు మిమ్మల్ని ఎప్పుడైనా, ఎవరైనా ఏమైనా అన్నారా?**

**జ.** కొందరు నన్ను చూసి ప్లాస్టిక్ ఏరుకునే వ్యక్తి అనుకుంటారు. అన్నా, ఆ చెట్టు క్రింద తాగి పడేసాము, వెళ్ళి తెచ్చుకో అంటారు. నేను కొంచెం చూపించండయ్యా అని వారిని తీసుకు వెళ్ళి, వారి ముందే గోతంలోకి ఎత్తుకుంటూ అసలు విషయం చెబుతాను. వారు ఆశ్చర్యపోయి, అన్నా క్షమించు ఇక మీదట మేము అడవులలో తాగము, పాడు చేయము అని, ఒక్కోసారి వాళ్ళే ఆ బాటిల్లను ఏరి అడవి బయటకు నాతో మోసుకొని వస్తారు. నాకు అది తృప్తి, వారిలో మార్పు వచ్చినందుకు. వాటిని బాటిల్స్ అమ్ముకునే వారికి ఇస్తారు లేదా రోడ్డు పక్కన కొన్ని స్థావరాల్లో పడేస్తాను. వాటిని ఎవరో ఒకరు తీసుకెళ్తారు.

**11. అడవి, ప్రకృతితో మీ అనుభవాలు, ప్రాణులు, చెట్ల గురించి?**

**జ.** అడవులలో వాతావరణం పూర్తి విరుద్ధంగా ఉంటుంది. హఠాత్తుగా వాతావరణం మారిపోతుంది. ఉడక (చెమట), వడగాలి ఎక్కువ, అప్పుడప్పుడు ఈదురు గాలులు, హఠాత్తుగా పడే వర్షం, చెట్ల మధ్య జంతువుల శబ్దాలు, పక్షులు బుర్రున వెళ్ళే శబ్దం కొంచెం అలజడి రేపుతాయి. అడవులలో ఏ చెట్టు ఎక్కడ ఉంది, దాని పేర్లు, దానితో చేసే వైద్యం అంతా తెలుసు. పక్షులు, వాటి అరుపులను బట్టి పేర్లు, జంతువుల అడుగులను బట్టి వాటి పేర్లు, మలం బట్టి అది ఎంత దూరం వెళ్ళిందో అంత అనుభవం ఉంది.

**12. అడవిలో మీరు చేసిన ప్రత్యేక రోజు ఏదైనా ఉందా?**

**జ.** అడవులలో అప్పుడప్పుడు ఒకరు ఇద్దరు టూరిస్టులుగా వచ్చి తప్పి



పోతుంటారు. జంతువుల భయంతో వణికిపోతుంటారు. వారికి ధైర్యం చెప్పి, కొన్ని కాయలు తినిపించి, కుంటల్లో నీళ్ళు తాపించి, అడవి బయటకు తెచ్చి వదిలేస్తూ ఉంటా. వారి మొఖంలో ఆనందం తృప్తిని ఇస్తుంది. నాకోసం ఎదురు చూసే పక్షులు అరుస్తుంటే ఆనందం.

**13. అడవిలో మీకు ఎంత వరకు తెలుసు?**

**జ.** అడవిలో అణువణువూ తెలుసు. ఏ కొండ ఎక్కితే ఏమి వస్తుంది. ఏ గుట్ట తరువాత ఏమి వస్తుంది. ఎత్తయిన కొండపై ఎక్కడ మైదానం ఉంది, అడవులలో కుంటలు, బావులు, ఎక్కడ ఉన్నాయి? గుహలు, సెల యేర్లు ఎక్కడ ఉన్నాయి, మైదాన ప్రాంతాలు ఎక్కడ ఉన్నాయి? జంతువులు తిరిగే ప్రదేశాలు ఎక్కడ? ఏ కొండ మలుపులో ఏముంది? ఇలా అడవిపై పూర్తి పట్టు ఉంది.

**14. అడవులలో ఎలాంటి సేవ చేస్తుంటారు?**

**జ.** తొలకరి జల్లుల సమయంలో ఎత్తయిన కొండలు, గుట్టలు ఎక్కి, విత్తన బంతులు (సీడ్ బాల్స్) చల్లడం వల్ల వర్షాకాలంలో పండ్ల మొక్కలు కోతుల కోసం నాటడం, అరుదైన ఔషధ మొక్కలు గుర్తించి, అవి అంతరించి పోకుండా సంవత్సరమంతా కాపాడటం, జంతువులను వేటాడటానికి ఎవరైనా వస్తే వారికి అడవులు, ప్రాణుల గొప్పతనం గురించి చెప్పి, వారి నుండి ప్రాణులను కాపాడటం.

**15. అడవులు కాలుతుంటే మీరు మంటలు ఆర్పుతున్నారు కదా, అంత సాహసం అవసరమా?**

**జ.** ప్రతి సంవత్సరం అడవిలో ఏదో ఒక ప్రాంతంలో మంటలు చెలరేగుతుంటాయి. వాటిని సహనంతో ఆర్పివేయకపోతే అడవికి తీరని నష్టం జరుగుతుంది. ఎన్నో ఔషధ వృక్షాలు తగలబడతాయి. వేల ప్రాణులు మాడి మసయి పోతాయి. చెట్లు, వాటిపై వున్న గూడు అందులో ఉన్న





గుడ్లు, పసి పిచ్చుకలు, జంతువులు అన్నీ మంటల్లో కాలిపోతాయి. ఈవిధంగా ప్రతియేటా కొన్ని లక్షల చెట్లు, కొన్ని వేల ప్రాణులు చనిపోతున్నాయి. అందువలన ఎంత సాహసం అయినా ఫర్వాలేదు అడవిని కాపాడుకోవాలి అనే ఉద్దేశ్యంతో కాలుతున్న అడవి నా కంట పడితే వెళ్ళి పచ్చి మండలతో మంటలు ఆర్పేస్తుంటాను.

**16. పక్షుల కోసమే పంట ఎందువల్ల వేస్తున్నారు?**

**జ.** పక్షులకు సరైన ఆహారం అందడం లేదు అని నా అభిప్రాయం. నేను అడవికి వెళ్తూ గుప్పెడు గింజలు తీసుకువెళ్ళి వేసేవాడిని, ఆ గింజల కోసం పక్షులు వచ్చి వెంటనే తినేసేవి. వాటికి మరిన్ని గింజలు అందించాలి అనే ఉద్దేశ్యంతో నాకు జీవనాధారంగా ఉన్న పొలంలోని ఒక ఎకరంలో సేంద్రియ వ్యవసాయ పద్ధతిలో సజ్జ, జొన్న పంట పండించి పూర్తిగా పక్షులకే వదిలేస్తాను. అవి ప్రతిరోజూ ఉదయం సాయంత్రం వచ్చి పంట తింటుంటే నాకు ఆనందం వేస్తుంది. ప్రతి సంవత్సరం జూన్ నుండి ఫిబ్రవరి దాకా పంట ఉంటుంది.

**17. ఎంత కాలం చేస్తారు ఇలా?**

**జ.** సమన్య ఉన్నంత కాలం శ్రమ చేస్తూనే ఉంటాను. ప్లాస్టిక్ పెనుభూతం అంతం అయ్యే వరకు అడవి బాట పడుతునే ఉంటాను.

**18. మీరు చెప్పే సందేశం ఏమిటి?**

**జ.** అడవులలో ప్రాణులు బాగుంటే అడవి బాగుంటుంది, మనం బాగుంటాం. అడవులలో ఒక్క ప్లాస్టిక్ బాటిల్ ఏరివేసినా ఒక ప్రాణి ప్రాణం కాపాడినట్లే. ●

## ప్లాస్టిక్ నియంత్రణకు సృజనాత్మక ఆలోచన

ప్లాస్టిక్‌ను నియంత్రించేందుకు భువనేశ్వర్ లోని 'నందన్ కానన్ జూలాజికల్ పార్క్' వారు ఒక సృజనాత్మక ఆలోచన చేశారు. పార్కులోకి వెళ్ళే దాదాపు ప్రతి కుటుంబం తమతో పాటు నీళ్ళ బాటిల్, ప్లాస్టిక్ కవర్లలో తినుబండారాలు తీసుకు వెళ్తూ ఉంటారు. అటువంటి సందర్శకుల వద్దనుండి లోపలికి వెళ్ళేటపుడు టికెట్‌తో పాటు అదనంగా రూ. 50 ల డిపాజిట్ సేకరించి ఆ ప్లాస్టిక్ సామాగ్రి పైన ఒక స్టిక్కర్ అతికిస్తారు. సందర్శన పూర్తయిన తర్వాత ఖాళీ అయిన ఆ ప్లాస్టిక్ సామాగ్రిని తిరిగి ద్వారం వద్ద వున్న తనిఖీ సిబ్బందికి చూపినట్లయితే డిపాజిట్‌గా సేకరించిన 50 రూపాయలను తిరిగి వారికి చెల్లిస్తారు. లేనిచో డిపాజిట్ వాపసు ఇవ్వరు.

దీంతో కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్న నందన్ కానన్ లో ఒక్క ప్లాస్టిక్ సీసా, చెత్తా చెదారం కనిపించటం లేదు. ఈ ఆలోచన చాలా బాగా పని చేసింది. అందరూ తమ ఖాళీ బాటిళ్లను, ఇతర ప్లాస్టిక్ కవర్లను తమవెంట తీసుకు వెళ్తారు. పర్యావరణాన్ని కాపాడటం కొరకు నిర్వాహకులు చేసింది చాలా గొప్ప ఆలోచన కదూ! దేశంలోని అన్ని సందర్శన ప్రాంతాల్లో ఈ పద్ధతి అమలైతే కొంతలో కొంత ప్లాస్టిక్ మహమ్మారిని అడ్డుకున్నట్లే కదూ!! – ఎడిటర్

# ఇతర రాష్ట్రాల పల్లె జ్ఞానం

'హనీబీ' ఆంగ్ల పత్రిక సౌజన్యంతో

## పశువులలో వడదెబ్బకి పరిష్కారం :

ఈ సంవత్సరం వేసవి ఎండలు తీవ్రంగా ఉన్నందున పశువులు వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉంది. రైతులు ఈ సమస్యకు గురైనప్పుడు ఈ చిట్కాను ఉపయోగించి తమ పశువులను వడదెబ్బ నుండి కాపాడుకోవచ్చు.


ఎండాకాలంలో పశువులకు వడదెబ్బ తగిలితే 200 గ్రా. శతావరి ఆకులను నీటిలో (ఆకులు మునిగే వరకు) నానబెట్టి ఆ ఆకులను పశువుల నుదుటిమీద రోజు విడిచి రోజు వరుసగా వుంచితే పశువులను వడదెబ్బ బారినుండి కాపాడుకోవచ్చు అంటున్నారు గుజరాత్‌కు చెందిన సునేంద్ర నగరవాసి భవన్‌భాయ్ మారుభాయ్ రాజ్‌పుత్.



## పప్పు ధాన్యాలను పురుగులనుండి కాపాడుకోవటం :

చాలామంది రైతులు తమ పప్పు ధాన్యాల పంటకు పురుగు సోకకుండా కాపాడుకునేందుకు సాంప్రదాయమైన చిట్కా పాటిస్తే పంటను ఎటువంటి పురుగు సోకకుండా కాపాడుకోవచ్చు. అనవసరంగా రసాయన పురుగు మందులు పిచికారి చేసి, ఆహార ధాన్యాన్ని విషతుల్యం చేయకుండా ఈ చిట్కా పాటిస్తే ఆరోగ్యవంతమైన ఆహార ధాన్యాలను అందించిన వారవుతారు.

పప్పు ధాన్యపు పంటలను గొంగళి పురుగు బారినుండి రక్షించుకోవటానికి రెండున్నర కిలోల 'అదుసి' ఆకులను, అంతే ప్రమాణంలో కానుగ ఆకులను నీటిలో నానబెట్టి వడగట్టి పురుగు పట్టిన పంటపై పిచికారి చేస్తే మంచి ఫలితాన్నిస్తుంది



అంటున్నారు గుజరాత్ రాష్ట్రానికి చెందిన సురేంద్రనగర్ నివాసి ప్రతాప్ భాయ్ ప్రభు భాయ్ రబారి.

## పశువులలో కాళ్ళ వాపులకి తంగేడు ఆకులతో చికిత్స :

రైతుల పశువులు ఒక్కోసారి కాళ్ళు వాపు రావటం వల్ల అవి నడవలేని స్థితికి చేరుకుంటాయి. అటువంటి సమయంలో సాంప్రదాయ వైద్య చిట్కాను ఉపయోగించి పశువు ఆరోగ్యంగా ఉండేలా చూసుకోవచ్చు.

పశువులలో బెణుకుల వలన వచ్చిన వాపుల నివారణకై తంగేడు ఆకులను దంచి, కొద్దిగా వేడిచేసి, వాపు వున్న ప్రాంతంలో పూసినట్లయితే వాపులు త్వరగా తగ్గి, పశువులకు స్వస్థత చేకూరుతుంది అంటున్నారు గుజరాత్‌కు చెందిన సురేంద్ర నగర్ వాసి గీతాబెన్ ఘన్‌శ్యాంభాయ్ మణేక్.



**పశువుల్లో నులిపురుగుల నివారణకు:**

పశువుల పోషణలో ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా వాటి ప్రేవుల్లో నులి పురుగులు ఏర్పడి అవి తిన్నది అరగక బాధపడుతూ వుంటాయి. అశ్రద్ధ వహిస్తే పశువు క్రమంగా క్షీణించి మరణించే ప్రమాదముంది. పశువులలో నులి పురుగుల నివారణకు బజార్లో చాలా మందులు దొరుకుతున్నాయి. కానీ గుజరాత్ రాష్ట్రం, బరూచ్ జిల్లా, కంబూడి గ్రామానికి చెందిన 'పుల్జీభాయ్ ఉమార్ భాయ్ వాస్వా' మన పెరట్లో దొరికే చెట్లతోనే వీటికి ఉత్తమమైన చికిత్స అందించవచ్చు అంటున్నారు. ఈయన పద్ధతి ప్రకారం 100 గ్రా. వేపాకులు, 100 గ్రా. దానిమ్మ ఆకులను మెత్తగా నూరి, 400 మి.లీ. నీటిలో కలపాలి. ఒక గంట తర్వాత ఆ మిశ్రమాన్ని బాగా కలిపి రోజుకొకసారి చొప్పున రెండు మూడు రోజులు పశువుకు తాగిస్తే నులిపురుగుల నుండి నివారణ పొందవచ్చు అంటున్నాడు.



**పంటలలో రసం పీల్చే పురుగుల నివారణకు:**

మిరప, కూరగాయల పంటలు, దానిమ్మ, నిమ్మ లాంటి పండ్ల తోటలకు రసం పీల్చే పురుగుల నుండి రైతులు చాలా సమస్యలను ఎదుర్కొంటూ ఉంటారు. వీటికి సేంద్రియ రైతులు ఎన్నో రకాల కషాయాలు తయారు చేసి పిచికారి చేస్తూ ఉంటారు. రసాయన పురుగు మందులు ఉపయోగించి ఆహారాన్ని కలుషితం చేయకుండా ఈ కషాయాన్ని తయారు చేసుకుని పంటలపై పిచికారి చేస్తే రసం పీల్చే పురుగులను సమర్థవంతంగా నివారించ వచ్చు అని తెలియజేస్తున్నారు గుజరాత్‌కు చెందిన 'పరుషోత్తమ్ భాయ్' చక్కటి, తేలికైన ఉపాయం చెపుతున్నాడు.

ఈ రసం పీల్చే పురుగు ఏ పంటకైనా, మొక్కకైనా సోకి చెట్టు ఆకులలోని రసాన్ని పీల్చేసి మొక్కలను నిర్వీర్యం చేసి అవి నశించిపోయేలా చేస్తాయి. ఈయన చాలాకాలంగా తన పొలంలో ఇదే పద్ధతిని వాడుతున్నాడట. ఈయన వేపాకులు, మజ్జిగ తేటను ఉపయోగించి ఈ ద్రావకాన్ని తయారు చేసుకుంటాడు. వేపాకులను నీటిలో వేసి ఆ నీరు మూడవ వంతుకు వచ్చే వరకు మరగబెట్టి, 200



మి.లీ. ఆ కషాయాన్ని తీసుకుని, 1500 మి.లీ. మజ్జిగ తేటలో కలిపి పొలాలపై పిచికారి చేస్తే ఈ రసం పీల్చే పురుగు నుండి నివారణ పొందవచ్చు అని చెపుతున్నాడు.

**మిరప పంటను తెగుళ్ళనుండి కాపాడటానికి:**

గుజరాత్‌కు చెందిన 'పరశురామ్ భాయ్' మిరప పంటను తెగుళ్ళ బారినుండి కాపాడుకోవటానికి ఈ చిట్కా కూడా చెపుతున్నారు. మిరప పంటను తెగుళ్ళ బారినుండి రక్షించుకోవటానికి ఆయన నిమ్మ, కలబంద, పొగాకులను కలిపి వాడుతుంటాడు. ఆయన 2 కిలోల పొగాకు పొడి, 2 కిలోల కలబంద, 250 గ్రా. నిమ్మరసం లను 20 లీటర్ల నీటిలో కలిపి మరిగిస్తాడు. 250 మి.లీ. ఈ ద్రావకంలో 15 లీటర్ల నీటిని కలిపి 8 రోజులకొకసారి మిర్చి పంటపై పిచికారి చేస్తాడు. ఈ పద్ధతి వలన మిరప పంటలో 80 శాతం వరకు తెగుళ్ళను నివారించగలిగానని అంటున్నాడు.

## పశు సంపదను కాపాడుకుందాం

పాతకులకో మనవి. మారుతున్న కాలంలో సాంప్రదాయ పశువైద్యులు కనుమరుగై పోతున్నారు. కొన్ని గ్రామాల్లో పశువైద్యులతోనే చాలా వరకు పశువుల రోగాలు నయమైపోతున్న విషయం అందరికీ తెలిసిందే. అక్కడక్కడా వున్న వారి జ్ఞానం, వారితోనే అంతం కాకుండా భవిష్యత్ తరాలకు అందించాలంటే అటువంటి వైద్యాలు గ్రంథస్తం చేయటం ఎంతో అవసరం. మీకు తెలిసిన పశువైద్యులు ఎవరైనా వుంటే వారి జ్ఞానాన్ని మాతో పంచుకోండి. ప్రచురించి అందరికీ అందజేద్దాం, తరతరాల జ్ఞానాన్ని రాబోయే తరాలకు అందిద్దాం.

-ఎడిటర్

Honey Bee Network

gian

# Submit your Ideas, Innovations, Prototypes

## హనీబీ నెట్‌వర్క్
## క్రియేటివిటీ & ఇన్‌క్లూసివ్ ఇన్నోవేషన్ అవార్డులు
## HBN CRIIA

ఎవ్వరైనా దరఖాస్తు చేసుకోవచ్చు !

మీవద్ద మనుషులు, పశువులు, పర్యావరణం ఎదుర్కొనే దైనందిక సమస్యలను పరిష్కరించే సృజనాత్మక, సాంప్రదాయ పద్ధతులు లేదా ఆలోచనలు ఉన్నాయా?

**మీ ఆలోచనలను, ఇన్నోవేషన్‌లను, నమూనాలను పంపండి**

మీ దరఖాస్తులను ఈ చిరునామాకు పంపండి...
Email : gian@gian.org or post them to
GIAN, Bungalow No. 1,
Sattellite Complex, Nr. Mansi Crossroads,
Satellite, Ahmedabad – 380 015. Gujarat
Call us at : 079 26769686



మోటార్ సైకిల్‌తో పని చేసే పొలం దున్నే యంత్రం
మన్సుఖ్‌భాయ్ జగాని, గుజరాత్

ఎంపికైన ఆలోచనలు, నమూనాలను HBN CRIIA పురస్కారంతో సత్కరించటంతో పాటు, అవి కార్యరూపం దాల్చటానికి తగ్గ ఆర్థిక / ఇతర సహాయం కూడా చేయబడుతుంది.



ఎంత ఎత్తున్న విద్యార్థులైనా నీళ్ళు త్రాగటానికి వీలుగా వాలుగా ఏర్పాటు చేసిన కుళాయిలు.
ఛాయా ఠాకూర్, గుజరాత్.

**చివరి తేది**
**31 ఆగస్టు, 2023**

last date

'హనీబీ నెట్‌వర్క్', 'పల్లెసృజన' ల ద్వారా వెలుగులోకి వచ్చిన

## 'పద్మశ్రీ' పురస్కారం అందుకున్న సామాన్యులు

## Padma Shri Awards

స్వేచ్ఛానువాదం : జమ్మలమడక శశిమోహన్

# 'విత్తనాల తల్లి' "రాహిబాయ్ సోమా పోపెరె"కి 'పద్మశ్రీ'





సృష్టి సమ్మాన్ - 2018

పద్మశ్రీ పురస్కారం - 2020

ఒక సామాన్య గృహిణికి 'పద్మశ్రీ' రావటం ఏంటని అబ్బుర పడుతున్నారా? మీలాగే దేశం మొత్తం ఆశ్చర్యపోయింది. కానీ ఆవిడ చేసిన ఘనకార్యాలు చూస్తే నిజమే ఆవిడ ఈ పురస్కారానికి అర్హురాలే అనిపిస్తుంది.

మహారాష్ట్ర లోని అహమ్మద్ నగర్ ప్రాంతంలో గల 'అకోలే' అనే ఏజెన్సీ ప్రాంతంలో కోంబ్లెన్ గ్రామంలో 1964లో మహదేవ్ కోలి అనే గిరిజన తెగ రైతుకి జన్మించింది రాహిబాయి. కడు పేదరికంలో ఉన్న ఈ కుటుంబం కావటం వల్ల ఈమెని ఏవిధంగానూ చదివించలేక పోయారు. ఊహ తెలిసినప్పటి నుండి కూడా ఆమె తన తండ్రికి వ్యవసాయంలో సహాయం చెయ్యటం, వ్యవసాయ కూలీగా పని చెయ్యటం, లేదా గొడ్లు కాయటం లాంటి పనులే చేస్తూ వచ్చింది. ఆ సమయం లోనే ఆమె తన తండ్రితో పాటు అప్పుడామె వయస్సు 10 సంవత్సరాలు పొలంలో పనిచేసేటపుడు దేశీ విత్తనాలు, వాటి ప్రాశస్త్యం గురించి చెపుతుంటే కుతూహలంగా వినేది.

ఆమెకి 17 సంవత్సరాల వయస్సు వచ్చేసరికి ఆమెను సోమా పోపెరేకి యిచ్చి వివాహం చేశారు. అతనూ ఏమీ చదువుకోలేదు. ఇద్దరూ కలిసి చేసే వ్యవసాయం ఆధారంగానే జీవించేవారు. ఆమె ఏమీ చదువుకోక పోయినా వ్యవసాయ జీవ వైవిద్యం, ప్రకృతి సహజంగా లభించే ఆహారం, సాంప్రదాయ వ్యవసాయ పద్ధతులపై అవగాహన పెంచుకొన్నది. ఇవన్నీ ఆమె సహజ కుతూహలంతో నేర్చుకొన్నదే కానీ ఎవరి దగ్గరా ప్రత్యేకించి నేర్చుకోలేదు.

"నా తండ్రి నా చిన్నప్పుడు తనతో పొలంలో తిప్పుతూ తనకు తెలిసిన సాంప్రదాయ విత్తనాలు, సాంప్రదాయ వ్యవసాయ పద్ధతులు మొదలైన విషయాల గురించి చెపుతుండేవాడు. అప్పుడే నాకు కొద్దిగా అవగాహన కలిగింది. కానీ స్వయంగా ప్రయోగించే అవకాశం రాలేదు" అని చెప్పిందామె.

తను తన భర్తతో కలిసి వ్యవసాయం చేసేటపుడు కూడా అందరి తోటి రైతుల మాదిరే హైబ్రిడ్ విత్తనాలు, రసాయన ఎరువులే వాడేవారు. కొంతకాలం సంసారం బాగానే సాగింది కానీ, కాలం గడిచేకొద్దీ తన పిల్లలు అనారోగ్యం పాలు కావటం, అదీ తరచూ కావటం, బలహీన పడిపోవటం జరిగింది. తల్లిగా ఆమె వ్యాకుల పడింది. ఇంతకాలం తండ్రిచాటు బిడ్డగా, భర్తకి తోడుగా ఉండటమే తప్ప ఆమెకు స్వతంత్రంగా ఆలోచించాల్సిన అవసరం రాలేదు.

కానీ ఇప్పుడు కన్న బిడ్డలు అనారోగ్యం పాలైతే ఆ తల్లి మనస్సు తట్టుకోలేక పోయింది. దీనికి కారణం ఏంటని తీవ్రంగా ఆలోచించింది. వారు తినే ఆహారంలో ఏదో లోపం ఉందని గ్రహిం



చింది. తాము వాడే కల్తీ హైబ్రీడు విత్తనాలు, వాటిపై వాడే రసాయనాలే తమ బిడ్డల అనారోగ్యానికి కారణం అని నిర్ణయించుకుంది. అప్పుడే ఆమెకు తన తండ్రి చిన్నతనంలో తమ పొలంలో నేర్పిన నాటు, సేంద్రియ విత్తనాలు, సాంప్రదాయ వ్యవసాయ పద్ధతులు గుర్తుకు వచ్చాయి. ఇక ఒక్క క్షణం ఆలస్యం చెయ్యకుండా తాము చేస్తున్న వ్యవసాయ పద్ధతుల విధానాలు అన్నీ మార్చివేసింది.

కేవలం తను తయారు చేసుకున్న విత్తనాలనే వాడటం మొదలు పెట్టింది. ఏ సుమూహూర్తంలో ఆమె సాంప్రదాయ విత్తనాలు, పద్ధతులు వాడటం ప్రారంభించిందో కానీ ఇంట్లో అందరి ఆరోగ్యం బాగు పడటమే కాక, వ్యవసాయం కూడా ఊపందుకొంది. దానితో ఉత్సాహం పెంచుకొన్న రాహిబాయ్ స్వంతంగా విత్తనాలు వృద్ధి చెయ్యటం, అందునా కేవలం సాంప్రదాయ పంటలు విత్తనాలనే పండించటం ప్రారంభించింది. అవి బాగున్నాయో లేదో నాటి చెప్పమని ఇరుగు పొరుగు రైతులకు ఇవ్వటం ప్రారంభించింది. వారంతా చాలా బాగున్నాయని తెలపటంతో ఇంకా పెద్ద సంఖ్యలో విత్తనాలు తయారు చేసి చుట్టు ప్రక్కల గ్రామాలకు పంపటం ప్రారంభించింది. ఈవిధంగా గత 20 సంవత్సరాలకి పైగా హైబ్రిడ్ విత్తనాలకి వ్యతిరేకంగా ఉద్యమం ప్రారంభించి దేశీ విత్తనాల ప్రాచుర్యానికి సర్వశక్తులు ఒడ్డి పోరాడు తున్నది.

ముందుగా నల్ల రేగుపండు (బ్లాక్ బెర్రీ) నర్సరీ ప్రారంభించి, చుట్టు పక్కల వారికీ, స్వయం సహాయక మహిళా బృందాలకి సరఫరా చేశారు. చుట్టాలకీ ఇచ్చారు, చివరికి పండుగలకీ, శుభ కార్యాలకి వచ్చే మహిళలకు తాంబూలం ఇచ్చేటప్పుడు కూడా అందులో పళ్ళ బదులు వివిధ రకాల విత్తనాలు ఇవ్వటం ప్రారంభించింది. క్రమంగా ఇతర రకాల విత్తనాలు కూడా సేకరించి, సేంద్రియ పద్ధతిలో పండించి, వితరణ చెయ్యటం ప్రారంభించింది.

ఆమె ఏమీ చదువుకోక పోయినా పంటలు, విత్తనాలు, సేంద్రియ పద్ధతులు, హైబ్రిడ్ విత్తనాలకి వ్యతిరేకంగా పని చెయ్యాలన్న పట్టుదలతో 4000 నల్ల రేగు పళ్ళ మొక్కలతో ప్రారంభించి, 9 రకాల చిక్కుళ్ళు, వరి, కాయగూరలు ఈ విధంగా విస్తరించి అకోలే గ్రామంలోను, చుట్టు ప్రక్కల గ్రామాల్లోను 210 మంది రైతులకి అందజేసింది. ఇప్పుడు ఆమెతో పాటు చాలామంది ఈ విత్తన సంరక్షణ ఉద్యమంలో సభ్యులుగా ఉన్నారు. ఆమె తన ఇంట్లోనే 200 రకాల విత్తనాలతో ఒక సీడ్ బ్యాంక్ ఏర్పాటు చేసి, అంతరించి పోతున్న మన సాంప్రదాయ పంటలను పరిరక్షించుట కోసం పాటు పడుతోంది. ఆ ప్రాంతంలోని ఎన్నో పంట పొలాల్లో 32 రకాల వరి, చిరు ధాన్యాలు, చిక్కుళ్ళు, కాయగూరలు, నూనె గింజలు మొదలైన పంటలు పండిస్తోంది. ఇవన్నీ అంతరించి పోతున్న రకాలు. ఆమె పెరటి





తోటలకని రకరకాల విత్తనాలు 4 వేల పాకెట్లను తయారు చేసి విక్రయించింది. ఆమె 'శ్రీ' పద్ధతిలో వరి పండించింది. ఆమె ప్రత్యేకించి చిక్కుళ్ళు, టమోట, దుంపలలో విరివిగా పరిశోధనలు చేసి, వాటి పరిరక్షణకి, అధిక దిగుబడికి, సేంద్రియ పద్ధతిలో వ్యవసాయానికి ప్రాముఖ్యత నిచ్చింది. స్వయం సహాయక మహిళా బృందాలతో కలిసి పని చేస్తూ, వారికి ఈ విత్తనాల పరిరక్షణ, సేంద్రియ వ్యవసాయంపై అవగాహన కల్పిస్తోంది. అంతే కాక ఆమె శుభ్రమైన వంటగది, గ్రామ శుభ్రత, తల్లి బిడ్డల ఆరోగ్యం గురించి మహిళల లో అవగాహన పెంపొందించింది.

ఆమె స్వయంగాను, ఇతర సంస్థలతో కలిసి అనేక విత్తన ప్రదర్శనల్లో పాల్గొంది. ఆ ప్రాంతం వారంతా ఆమెని విత్తనాల విషయం లో చేస్తున్న సేవలకు "విత్తనాల తల్లి" అని ప్రేమగా గౌరవంగా పిలుచు కొంటారు.

ఒక సమాచారం ప్రకారం ఆమె తన స్వంత ఇంట్లో బిఏఐఎఫ్, (భారతీయ, అగ్రి ఇండస్ట్రీస్ ఫౌండేషన్) ప్రస్తుతం బిఎఐఎఫ్ డెవలప్‌మెంట్ రీసర్చ్ ఫౌండేషన్ వారి సహాయంతో ప్రారంభించిన సీడ్ బ్యాంక్ విత్తన భాండారంలో సాంప్రదాయ విత్తనాలు, పప్పుదినుసులు, 200 రకాలున్నాయి. అదేవిధంగా 30 రకాల అంతరించి పోతున్న కాయగూరలు, 11 రకాల వరి, వనమూలికలు ఉన్నాయి.

ఆమె రాష్ట్రం అంతటా పర్యటించి, తనకి ఇష్టమైన అంతరించి పోతున్న విత్తనాల సంరక్షణ, సేంద్రియ వ్యవసాయం, వ్యవసాయంలో జీవ వైవిధ్యం, సహజంగా లభించే ఆహార పదార్థాల గురించి ప్రజలలో అవగాహన కల్పిస్తుంటుంది.

- రాహిబాయి తాను స్వంతంగా తనకు అవసరమైన విధంగా 'జల్ కుండ్' నీటి గుంటని డిజైన్ చేసి, నిర్మించుకుంది. తద్వారా పనికి రాకుండా బీడుగా ఉన్న 2 ఎకరాల భూమి సాగులోకి వచ్చి తన పరిశోధనాత్మక వ్యవసాయంలో సహాయ పడుతోంది.
- ఆమె మహారాష్ట్ర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ట్రాన్స్‌ఫర్ ఇన్ రూరల్ ఏరియాస్ లో సేంద్రియ వ్యవసాయంలో శిక్షణ పొందింది.
- ఇప్పుడామె అనేక మంది రైతులకి వారికి కావలసిన పద్ధతులలో పంటల ఎంపిక, భూసార పరీక్షలు, చీడపీడల నుంచి రక్షణ, మొదలైన అనేక విషయాలపై శిక్షణ ఇచ్చి, వంట భూమి తయారైన తర్వాత తనవద్దనున్న సాంప్రదాయ విత్తనాలు యిచ్చి, ఆ పంటను ప్రోత్సహిస్తుంది. ఇప్పటి వరకు ఆమె సుమారు 3,500 మంది రైతులకి శిక్షణ ఇచ్చింది.
- ఆమె కొంభాలేన్ గ్రామ ప్రాంతంలో మరియు, చెంబియో బాబా

మహిళా బచత్ ఘటన్ అనే స్వయం సహాయక బృందాలతో కలిసి ఆ జిల్లాలో మహిళా ఆరోగ్యం, సోలార్ దీపాల వితరణ మొదలైన కార్యక్రమాలు నిర్వహిస్తుంది.

- ఆమె నిర్వహిస్తున్న అనేక వ్యవసాయ, వ్యవసాయేతర కార్యక్రమాల కారణంగా ఆ జిల్లాలో చెప్పుకోతగ్గ మార్పు కనిపించిందని భారతీయ వ్యవసాయ శాఖ వారి పిపివి & ఎఫ్ఆర్ఎ ఛైర్మన్ డా. ఆర్.ఆర్. హంచిమల్, జ్ఞానవైవిద్యం ఇంటర్‌నేషనల్ సంస్థ శాస్త్రవేత్త, డా. ప్రేమ్ కుమార్ మొదలైన వారు 2015లో కితాబు నిచ్చారు.
- రాహిబాయి పొపేర నిర్వహిస్తున్న విత్తన ఉద్యమంపై నిర్మించిన ఒక లఘు చిత్రం 72వ కన్నిస్ ఫిలిమ్ ఫెస్టివల్ 2019లో నెస్ప్రెస్సో టాలెంట్ విభాగంలో అంతర్జాతీయ స్థాయిలో 3వ బహుమతి గెలుచుకొంది.
- కృషి విజ్ఞాన కేంద్రం వారు ఉత్తమ విత్తన సంరక్షకురాలిగా గుర్తించి సన్మానించారు.
- బిబిసి వారు 100 మంది ప్రపంచ ఉత్తమ మహిళల జాబితాలో ఈమె పేరు చేర్చి 2018లో సత్కరించారు.
- బిఎఐఎఫ్ వారు ఉత్తమ రైతు బహుమతితో సత్కరించారు.
- భారత ప్రభుత్వ మహిళా, శిశు విభాగం వారు 2018లో నారీశక్తి పురస్కారంతో సత్కరించారు.
- 2020లో భారత రాష్ట్రపతి శ్రీ రామ్‌నాథ్ కోవింద్ గారు 'పద్మశ్రీ' పురస్కారంతో సత్కరించారు.





- ఆడవాళ్ళు అబలలు, వంటింటి కుందేళ్లు ఇలా ఎన్ని అపప్రదులున్నా ఏమీ చదువుకోక పోయినా, పేదరికంలో ఉన్నా అన్నింటినీ తోసిరాజని కేవలం గృహిణిగా ఉండి కూడా కుటుంబానికి, సమాజానికి, రాష్ట్రానికి, దేశానికి కూడా పేరు తీసుకు వచ్చే పని చెయ్యవచ్చని నిరూపించిన శ్రీమతి రాహిబాయి సోమా పోపెరే దేశంలో ఎంతోమంది మహిళలకి స్ఫూర్తిగా నిలిచిందని 'పల్లెసృజన' నమ్ముతూ ఆమెకి అభినందనలు తెలుపుతోంది.

## 'పల్లెసృజన' ఇన్నోవేటర్లకు విజ్ఞప్తి

'పల్లెసృజన' పత్రిక అప్రతిహతంగా 17 సం.గా మీ ముందుకు వస్తున్న విషయం మీకందరికీ విదితమే. స్వచ్ఛం దంగా వాలంటరీ వ్యవస్థ మీద ఆధారపడి, వ్యాపార ప్రకటన లు, డొనేషన్‌లు లేకుండా ఇప్పటి వరకు ఈ పత్రికను తద్వా రా నూతన ఇన్నోవేషన్లను, ఇన్నోవేటర్లను సమాజానికి పరిచయం చేస్తూ వారికి జాతీయ, అంతర్జాతీయ స్థాయి లో గుర్తింపు తీసుకు వస్తున్న విషయం కూడా మీకందరికీ తెలుసు. కోవిడ్ మహమ్మారి ప్రపంచ వ్యాప్తంగా సృష్టించిన అలజడి లో కూడా నిరాఘాటంగా పత్రిక నడిపే ప్రయత్నం లో సఫలీకృతులం అయ్యాము. కానీ, రోజు రోజుకూ పెరిగి పోతున్న పేపర్ ధరలు, ముద్రణా ఖర్చులను తట్టుకోవటం కొద్దిగా కష్టంగా మారుతోంది. కావున దయచేసి ఇన్నోవేటర్లు ఒక విషయం గమనించాలి. ఇప్పటి నుంచి మీకు చేరుతున్న పత్రిక ఉచితంగా పంపడం కొంత భారం గా అనిపిస్తోంది. కావున మీ పత్రికకు మీరు కూడా చందా దారులు కావల సిందిగా కోరుతున్నాము.

మీరు పత్రికకు అందిస్తున్న సహకారం మమ్మల్ని ఎప్పటికప్పుడు కార్యోన్ముఖులను చేస్తూ ముందుకు సాగేలా చేస్తోంది. కావున మీకు తెలిసిన వారికి, మీ మిత్రుల కు ఈ పత్రికను గురించి తెలియ జేసి, కొత్త చందాదారులను చేరేలా మీవంతు ప్రయత్నం చేయగలరు. వీలైనంత వరకు పత్రిక ధర పెంచకుండా, చందా దారులను అధికం చేసినట్లయితే ముద్రణా ఖర్చు కొంత వరకు తగ్గుతుం దని భావిస్తున్నాము. 'పల్లె సృజన' ప్రతి పల్లెకు చేరాలన్నదే మనందరి ఆకాంక్ష. శుభ కార్యాల్లో ఈ పత్రిక చందానే మీరిచ్చే బహుమతిగా చేసుకుని పత్రిక ఎక్కువ మందికి చేరేలా చూస్తా రని ఆశిస్తున్నాము.

-ఎడిటర్



### సృజనాత్మకంగా వ్యవసాయ పరికరాలు చేసే 'బలగం కోటేశ్వర రావు' సృష్టి

# ట్రాక్టర్ అనుసంధాన 'హైడ్రాలిక్ స్ప్రేయర్'

- వీరరాఘవ రెడ్డి

బాపట్ల జిల్లా (సమైక్య ప్రకాశం జిల్లా), ఇంకొల్లు మండల కేంద్రానికి చెందిన 41 సంవత్సరాల యువ రైతు మెకానిక్ వ్యవసాయ పరికరాలను తయారు చేసే ఒక ఇంజనీరింగ్ దుకాణం నడుపుకుంటూ జీవనం సాగిస్తుంటాడు. స్వతహాగా రైతు కాబట్టి రైతుకు అవసరమైన వ్యవసాయ పరికరాలను తనదైన శైలిలో తక్కువ ఖర్చుతో వీలైనంత శ్రమ తగ్గేలా సృజనాత్మకంగా తయారు చేయటం ఇతని ప్రత్యేకత.

ఇప్పటి వరకు మార్కెట్లో లభించే ట్రాక్టరు అనుసంధాన స్ప్రేయర్లు ఎన్నో రకాలుగా లభిస్తున్నాయి. ఎవరికి నచ్చిన స్ప్రేయర్లను వారు కొనుగోలు చేసుకుని పంట పొలాలపై పురుగు మందులు పిచికారి చేసుకుంటూ తమ పంటలను కాపాడుకుంటున్నారు రైతులు. మరి కొందరు ఈ స్ప్రేయర్లను కొనుగోలు చేసుకుని వాటిని రైతులకు కిరాయికి ఇవ్వటం ద్వారా కూడా చాలా మంది ఉపాధి పొందుతున్నారు. కానీ, ఇప్పటి వరకు లభిస్తున్న స్ప్రేయర్లు అన్నీ మెకానికల్‌గా పని చేసేవే లభిస్తున్నాయి. పొలానికి పురుగు మందు పిచికారి చేయాలి అనుకున్నపుడు స్ప్రేయర్‌ను ట్రాక్టర్‌కు బిగించుకుని, పొలానికి వెళ్ళిన తర్వాత స్పానర్ల సహాయంతో స్ప్రేయర్ రెక్కలను వెడల్పుగా చేసి, పంటపై పురుగు మందు పిచికారి చేస్తూ ఉంటారు. ఈ స్ప్రేయర్‌ను ఇంటివద్దనే వెడల్పుగా ఏర్పాటు చేసుకుని పొలానికి వెళ్ళటం కుదరదు. ఎందుకంటే ఇది దాదాపు 35 అడుగుల వరకు వెడల్పు ఉంటుంది కాబట్టి దారిలో వాహనాలు ఎదురైనా, రోడ్డు ప్రక్కల చెట్లు లాంటివి వున్నపుడు ట్రాక్టరు వెళ్ళటం కుదరదు కాబట్టి మూడు భాగాలుగా స్ప్రేయర్‌ను మడిచి ఇంటివద్ద బిగించుకుంటారు. పొలానికి వెళ్ళిన తర్వాత వాటి రెక్కలను వెడల్పుగా చేసి బిగించి పురుగు మందు పిచికారి చేస్తారు. ఇదంతా ఎంతో శ్రమతో కూడుకున్నది మరియు చాలా సమయం వృధా అవుతుంది. పురుగు మందు పిచికారి చేయటం ఒక పొలంలో అయిపోయిన తర్వాత మరో పొలానికి వెళ్ళాలి అనుకుంటే మళ్ళీ వాటి రెక్కలను విడదీసి ట్రాక్టరుకు దగ్గరగా అమర్చుకుని వెళ్ళాలి. మళ్ళీ వేరే పొలం చేరుకున్న తరువాత వాటిని విడదీసి ఆ పొలంలో పురుగు మందు పిచికారి చేయాల్సి ఉంటుంది.

ఇక్కడ మరో విషయం గమనించాలి. పురుగు మందు పిచికారి చేయాల్సిన పొలాల్లో మిశ్రమ పంటలు ఉంటే అవి కొన్ని ఎత్తుగా, ప్రధాన పంట తక్కువ ఎత్తులో ఉంటుంది. ఉదాహరణకు మిరప పంట ఉందనుకోండి దాని ఎత్తు భూమినుండి ఒకటిన్నర రెండు అడుగులు ఉంటే, అందులో మిశ్రమ పంటగా వేసిన బంతిపూల మొక్కలు మూడు నుంచి నాలుగు అడుగుల ఎత్తు ఉంటాయి. అలా వున్న పంటలపై ట్రాక్టర్ స్ప్రేయర్‌తో మందు పిచికారి చేయటం కుదరదు. ఎందుకంటే ఎత్తుగా వున్న మొక్కలు స్ప్రేయర్ రెక్కలకు తగిలి అది విరిగిపోయే ప్రమాదం ఉంది. అలాగని ప్రతి మొక్క దగ్గర స్ప్రేయర్ ఎత్తును మార్చుకుంటూ వెళ్ళటం కుదరదు. అలాగని ఎత్తుగా వున్న మొక్కల కొలతకు సరిపోయేంతగా స్ప్రేయర్‌ను ఏర్పాటు చేసుకుని పిచికారి చేస్తే పురుగు మందు ప్రధాన పంటకు తక్కువగా అందుతుంది, ఎక్కువ భాగం గాలిలో కలిసి పోవటం వల్ల రైతుకు నష్టం వాటిల్లే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ఈ కారణం వల్లనే ప్రస్తుతం చాలా మంది ట్రాక్టరుతో పురుగు మందు పింకారి చేసే రైతులు అంతర పంటలను వేయటం మానేశారు. అందువల్ల కూడా రైతుకు కొంత వరకు నష్టం వాటిల్లుతోంది. ఎందుకంటే మిరప పంటలో బంతిపూల మొక్కలు నాటడం వల్ల పంటను ఆశించే పురుగులు ముందుగా బంతిపూల మొక్కలను ఆశిస్తాయి, అందువల్ల ప్రధాన పంటకు కొంత వరకు పురుగు తాకిడి తగ్గుతుంది.

ఇదంతా ఎంతో శ్రమతో కూడుకున్న పని కావటం, చాలా సమయం వృధా కావటం నచ్చని కొందరు రైతులు సృజనాత్మకంగా వ్యవసాయ పరికరాలు తయారు చేసే 'బలగం కోటేశ్వర రావు'కి తమ సమస్యను వివరించారు. దీనికి ఏదైనా పరిష్కారం కనుగొని స్ప్రేయర్‌ను బాగా తయారు చెయ్యమని అభ్యర్థించారు. వారి బాధను అర్థం

చేసుకున్న ఇన్నోవేటర్ కోటేశ్వర రావు ఈ స్ప్రేయర్‌ను మ్యాన్యువల్‌గా కాకుండా 'హైడ్రాలిక్' అనుసంధానంగా చేస్తే బావుంటుందని ఆలోచించి తయారు చేసిందే ఈ 'హైడ్రాలిక్ స్ప్రేయర్'.

ఈ స్ప్రేయర్ ను ఒక్కసారి ఇంటివద్ద ట్రాక్టరుకు బిగించుకుని పొలానికి వెళ్తే చాలు ఇక మనిషి దాన్ని అవసరాన్ని బట్టి స్ప్రేయర్ రెక్కలను విడదీయటం, పంటను బట్టి ఎత్తును ఏర్పాటు చేసుకునేందుకు పదే పదే స్పానర్లను వినియోగించాల్సిన అవసరం లేదు. పొలంలో పంటపై పురుగు మందు పిచికారి చేసేటపుడు పొలం మొత్తం అయిపోయిన తర్వాత ఆఖరున కొద్దిగా మిగిలింది అనుకోండి. అప్పుడు ఆ కొంత భాగం పంటపై మందు పిచికారి చేయాలనుకున్నా ఇదివరకే పిచికారి చేసిన పంటపై మళ్ళీ రెండవసారి పిచికారి చేయకుండా అవసరమైన మేర మాత్రమే చేసే ఏర్పాటు చేయబడిందీ పరికరానికి.

ఈ స్ప్రేయర్ ట్రాక్టరుకు వున్న హైడ్రాలిక్‌కు అనుసం ధానం చేసి తయారు చేయబడింది. మూడు భాగాలుగా వున్న స్ప్రేయర్ రెక్కలలో అవసరం లేని కుడి లేదా ఎడమ వైపు వున్న రెక్కలను ట్రాక్టరు డ్రైవర్ తన చేతివద్ద వున్న ఒక లివర్‌ను నొక్కడం ద్వారా ఒకటి లేదా రెండు రెక్కలు వాటంతట అవే మూసుకు పోతాయి. అలాగే పురుగు మందు కూడా అవసరమైన రెక్కలకు మాత్రమే వెళ్ళేలా, అవసరం లేని రెక్కకు లేదా మధ్య భాగానికి పురుగు మందు పిచికారి కాకుండా ఉండేలా ఏర్పాటు చేశాడు. అలాగే పంట ఎత్తును బట్టి స్ప్రేయర్ ఎత్తును మార్చటం ఇప్పుడు కేవలం డ్రైవర్ వద్దనున్న లివర్ ద్వారా ఏర్పాటు చేసుకోవచ్చు. స్ప్రేయర్ తో పిచికారి చేయాలనుకున్న పంట ఎత్తు ఒకటిన్నర అడుగుల నుండి ఏడు అడుగుల ఎత్తు వరకు పంట అవసరాన్ని బట్టి ఎత్తును మార్చుకోవటం కూడా చాలా సులభం. గతంలో పంట ఎత్తును బట్టి పరికరం బిగించుకోవాల్సి వచ్చేది. ఇప్పుడు ఆ అవసరం లేకుండా చేశాడు. అలాగే వేరుశనగ లాంటి పంటలలో కంది పంట మిశ్రమ పంటగా అక్కళ్ళలో వేస్తూ వుంటారు కొందరు రైతులు అటువంటి పంటపై స్ప్రేయర్ యొక్క రెండు రెక్కలను మూసి వేసి కేవలం మధ్యలో వున్న భాగం ద్వారా మాత్రమే పురుగు మందు పిచికారి చేసుకోవచ్చు. అలాగే వేరుశనగ పంటకు పురుగు మందు అవసరం లేదు, కేవలం కంది పంట సాళ్ళకు మాత్రమే మందు పిచికారి చేయాలి అనుకుంటే స్ప్రేయర్ ఎత్తును అవసరమైనంత మేర పైకి లేపి, కేవలం కంది పంట పైన మాత్రమే పిచికారి జరిగేలా చేసుకోవచ్చు.

ఈ పనంతా చేయటానికి గతంలో వున్న స్ప్రేయర్‌కు ఇద్దరు వ్యక్తులు తప్పనిసరిగా ఉండాల్సి వచ్చేది. ఇప్పుడు ఆ అవసరం లేకుండా కేవలం ఒకే ఒక్క వ్యక్తి (డ్రైవర్ మాత్రమే) పంటలపై పురుగు మందు





చాలా తక్కువ సమయంలో, తక్కువ శ్రమతో, ఎటువంటి స్పానర్ పట్టుకుని అవసరమైన మార్పు చేర్పులు చేయాల్సిన అవసరం లేకుండా అన్ని పనులను చేసేలా ట్రాక్టరులోనే లివర్‌లను ఏర్పాటు చేయటం వల్ల పిచికారి పని త్వరగా ముగుస్తుంది. గతంలో 10 ఎకరాలకు మందు పిచికారి చేసే సమయంలో ఈ స్ప్రేయర్ ద్వారా 15 నుండి 20 ఎకరాల వరకు పిచికారి చేయవచ్చు.

'బలగం కోటేశ్వర రావు' తయారు చేసిన ఈ స్ప్రేయర్‌ను చూసిన రైతులు ఎంతోమంది ఈ స్ప్రేయర్ ఆలోచన చాలా బాగా వుందని, ప్రమాద రహితంగాను, అనవసరంగా సమయం వృధా కాకుండా, పురుగు మందు వృధా కాకుండా, అంతర పంటలకు అనుగుణంగా పిచికారి పని జరిగేలా ఉంది. అదేపనిగా స్పానర్లను పట్టుకుని ఎత్తు, వెడల్పులను మార్చుకోవాల్సిన అవసరం లేకుండా తయారు చేసిన ఈ స్ప్రేయర్ వల్ల రైతుకు, ట్రాక్టరు డ్రైవర్‌కు ఎంతో మేలు జరిగేలా ఉందని కితాబునిస్తున్నారు. జనవరి 2023లో తయారు చేసిన ఈ స్ప్రేయర్ ఇంకొల్లు ప్రాంతంలో ఎంతో ప్రాచుర్యం పొందింది. ఇప్పటికే 10కి పైగా స్ప్రేయర్లను తయారు చేసి ఇవ్వటం జరిగింది. ప్రస్తుతం తనకు 15 స్ప్రేయర్ల ఆర్డరు ఉందని, వాటిని తయారు చేసే పనిలో నిమగ్నమై వున్నానని అంటున్నాడు కోటేశ్వర రావు.

ఈ స్ప్రేయర్‌ను ఏర్పాటు చేసుకోవటం వల్ల ట్రాక్టరు యజమానులు పురుగు మందు పిచికారి చేసేందుకు ఇద్దరు వ్యక్తుల అవసరం లేకుండా కేవలం డ్రైవర్ ఒక్కడే తక్కువ సమయంలో ఎక్కువ పని చేసుకోవచ్చు. యావత్ రైతాంగం ఈ స్ప్రేయర్‌ను ఏర్పాటు చేసుకుని సమయం, పురుగు మందు, కూలీల ఖర్చును ఆదా చేసుకోవా లని కోరుతోంది 'పల్లెసృజన'. ఈ స్ప్రేయర్‌కు విస్తృత ప్రచారం కల్పించి, అందరు రైతులకు అందుబాటులోకి వచ్చేందుకు, జాతీయ గుర్తింపు కొరకు కృషి చేస్తోంది 'పల్లెసృజన'.

**ఇన్నోవేటర్ 'బలగం కోటేశ్వర రావు', ఫోన్ : 91775 54448**

## సమస్యలకు ఆహ్వానం

'పల్లెసృజన' ఇంతవరకు సమాజంలోని సమస్యలకు పరిష్కారాలు (ఇన్నోవేషన్‌లను) వెతికి, వెలుగులోకి తీసుకు రావదానికి స్వచ్ఛందంగా గత పదిహేడు సంవత్సరాలుగా ప్రయత్నాలు చేస్తున్నది. వాటివల్ల పునాది స్థాయి ఇన్నోవేటర్ల సృజనాత్మక శక్తి వెలుగులోకి రావటంతో పాటు, ఎంతోమందికి శారీరకంగా, ఆర్థికంగా, సమయ పరంగా ఎంతో లాభం చేకూరింది. ఈ ప్రయాణం లో పరిష్కారాలు వెతికిన అనుభవంతో సమాజంలో వున్న సమస్యలను కూడా వెతికి పల్లెసృజన కుటుంబంలో వున్న ఇన్నోవేటర్ల ద్వారా పరిష్కారాలు చేయిస్తే సమాజానికి ఇంకా లాభం చేకూరుతుందని భావించాం.

గ్రామాల్లో మీరెవరైనా వ్యక్తిగతంగా లేదా నలుగురికీ సంబంధించిన ఏదైనా సమస్యకు పరిష్కారం వుంటే బావుంటుంది అనుకుంటున్నారా? ఐతే అటువంటి సమస్యలను క్రింద ఇచ్చిన వాట్స్ యాప్ నంబర్లకి పంపగలరు. ఎన్ని సమస్యలైనా పంపవచ్చు. పరిష్కారాలను మా ఇన్నోవేటర్ల సహాయ సహకారాలతో వెతికే ప్రయత్నాలను, వాటి ప్రగతిని మీకు 'పల్లెసృజన' పత్రిక ద్వారా తెలియజేస్తూ వుంటాము.

వాట్స్ యాప్ నంబర్లు : బ్రిగేడియర్ గణేశం, 9866001678, వీరరాఘవ రెడ్డి, 8125799904

# ఆయుర్వేద జ్ఞాన మథనం

## చిన్న, పెద్ద రోగాలకు ఆయుర్వేద చిట్కాలు


ఉమా మహేశ్వర రావు

చాలా మంది నిత్య జీవితంలో ఏదో ఒక ఆరోగ్య సమస్యతో బాధ పడుతునే ఉంటారు. ప్రతి అనారోగ్యానికి డాక్టరు వద్దకు పరుగెత్తకుండా చాలా వరకు రోగాలకు చికిత్స మన వంటింట్లో, పెరట్లో, పొలాల గట్టునే ఉందన్న విషయం తెలుసుకుంటే సులువుగా పరిష్కరించుకోవచ్చు. అటువంటి వాటిని కొన్నింటిని ఇక్కడ అందిస్తున్నాం.

**మహిళలకు ఫేస్ ప్యాక్:** మహిళలు, ముఖ్యంగా అమ్మాయిలు బైటకు వెళ్ళాలన్నా, ఏదైనా శుభ కార్యాలకు వెళ్ళాలన్నా 'ఫేస్ ప్యాక్' అని ముఖాన్ని అందంగా అలంకరించు కోవటం కొంతమందికి పరిపాటే. కొందరి ముఖం జిడ్డు కారుతూ ఉంటుందని ముఖానికి పౌడరు, ఇతర సౌందర్య లేపనాలతో ముఖాన్ని అందంగా చేసుకుంటూ ఉంటారు. అటువంటి వారు పెసలు ఒక అర కిలో తీసుకుని, పెనంపైన వేడి చేసి, పొడి చేసుకుని, అందులో కొద్దిగా 'కస్తూరి పసుపు' కలిపి మొత్తం ఒక సీసాలో భద్రపరచుకోవాలి. ఏదైనా శుభ కార్యానికి లేదా ఎక్కడికైనా బయటకు వెళ్ళాలి అనుకున్న ఒక అరగంట ముందు ఈ పొడి రెండు మూడ చెంచాలు తీసుకుని, అందులో కొద్దిగా నీటిని కలిపి ముఖానికి పూసుకోవాలి. అరగంట తర్వాత వేడి నీటితో ముఖం కడుక్కుంటే చాలు. మీరు ఎంతసేపు బయట వున్నా సరే ముఖం జిడ్డుగా మారటం లాంటిది జరగదు.

**మొటిమలకు ఔషధం:** కొందరు యువతీ యువకులకు ముఖంపైన మొటిమలు ఏర్పడటం వయసు ప్రభావం. అటువంటి వారు మర్రిచెట్టు చిగురు ఆకులు కొన్ని తీసుకుని అందులో కొద్దిగా శనగ గింజలు వేసి రెండింటినీ కలిపి మెత్తగా నూరుకుంటే పేస్టులాగా తయారవుతుంది. ఆ పేస్టును ముఖానికి పూసుకున్నట్లయితే ముఖంపైన మొటిమలు, నల్ల మచ్చలు లాంటివి మానిపోతాయి. ముఖానికి టమోట పండు సగానికి కోసుకుని ముఖంపైన రసం పూసుకున్నా కూడా నల్ల మచ్చలు మాసిపోతాయి. ఈ టమాట రసం రాత్రి పూట రాసుకుని, ఒక గంట లేదా గంటన్నర పాటు ఉంచుకుని ముఖం కడుక్కుని పడుకుంటే మంచిది.

**స్త్రీల ఋతుక్రమ సమస్యకు పరిష్కారం:** కొందరు మహిళలు 'తెల్లబట్ట', 'ఎర్రబట్ట' అని ఋతుక్రమ బాధతో చాలా ఇబ్బందికి గురవుతుంటారు. అటువంటి వారు 'నల్ల తుమ్మచెట్టు బెరడు' తీసుకుని మెత్తటి పౌడరుగా చేసుకోవాలి (ఇది ఆయుర్వేద మందులు అమ్మే షాపుల్లో కూడా లభిస్తుంది). ఆ పొడిని రెండు మూడు చెంచాలు ఒక గిన్నెలో లేదా చిన్న పాత్రలో వేసుకుని, కొద్దిగా నీటిని కలిపి, పొయ్యిమీద కొద్దిసేపు వేడి చెయ్యాలి. చల్లారిన తర్వాత మూత్ర విసర్జన చేసినపుడు ఈ నీటితో శుభ్రం చేసుకుంటూ ఉంటే చాలు కొద్ది రోజులకు తెల్లబట్ట, ఎర్రబట్ట సమస్యల నుంచి విముక్తి పొందవచ్చు. ఇటువంటి వారు ఆహారంలో జీలకర్ర ఎక్కువ ఉపయోగిస్తూ ఉంటే మంచిది. నల్లతుమ్మ చెక్క పొడి కొద్దిగా నీటిలో వేసుకుని త్రాగినా ఎటువంటి ప్రమాదం ఉండదు.

**కిడ్నీలో రాళ్ళ సమస్యకు మందు:** కిడ్నీలలో రాళ్ళతో బాధ పడేవారి బాధలు కొందరివి వర్ణణా తీతంగా ఉంటాయి. అటువంటి బాధతో ఉన్నవారు దోసకాయ తీసుకుని, మొత్తం తోటు, గింజలు, గుజ్జుతో సహా కోసి, నీటిలో వేసి కొద్దిసేపు మరిగించి చల్లారిన తర్వాత ఉదయం ఒక గ్లాసు సాయంత్రం ఒక గ్లాసు త్రాగితే 10 మి.మీ. పరిమాణంలో ఉన్న రాయి అయినా సరే ముక్కలు ముక్కలుగా మారి మూత్రం ద్వారా క్రిందకు పడిపోతుంది.

**పేనుకొరుకుడు సమస్య నివారణకు:** కొంత మందికి పేను కొరుకుడు సమస్య ఉంటుంది. అలా పేను కొరికినచోట వెంట్రుకలు త్వరగా రావు. వాళ్ళు బయటకు వెళ్ళాలంటే చాలా ఇబ్బందికి గురవుతుంటారు. అటువంటి వారు ఒకటి రెండు కుంకుడు కాయలను ఉప్పు నీటిలో నానబెట్టాలి. కొద్దిసేపు నానిన తర్వాత ఆ కుంకుడు కాయలు తీసి వాటి గుజ్జును పేను కొరికిన చోట రోజుకు రెండు మూడు సార్లు పూసుకోవాలి. ఇలా ఒక వారం పది రోజుల పాటు చేసినట్లయితే పేను కొరికిన చోట కూడా వెంట్రుకలు మొలుస్తాయి.

**తేలుకాటు నుండి ఉపశమనం కొరకు:** గ్రామాల్లో వ్యక్తులు 'తేలు కాటు'కు గురి కావటం సర్వ సాధారణంగా జరుగుతూ ఉంటుంది. కొన్ని రకాల తేళ్లు కుడితే నొప్పి విపరీతంగా ఉంటుంది. మరికొన్ని ప్రాణాపాయం కూడా అవుతాయి. గ్రామాల్లో 'ఉత్తరేణి' చెట్టు తెలియని వ్యక్తి సాధారణంగా ఉండడు. మనిషి తేలు కాటుకు గురైనప్పుడు ఉత్తరేణి ఆకులు కొన్ని తీసుకుని అరచేతుల్లో బాగా నలిపి తేలు కుట్టినచోట రసం పూసి, అక్కడే అదే నలిపిన ఆకును పెట్టి దానిపైన ఒక తమలపాకు పెట్టి కట్టు కట్టినట్లయితే కొద్ది నిమిషాల్లో తేలుకుట్టిన నొప్పి తగ్గిపోతుంది. ఉత్తరేణి ఆకు లభించని వారు తేలు కుట్టిన చోట 'ఇంగువ' పెట్టి కొద్దిగా వేడి చేసిన బట్టతో కాపడం పెట్టినా కూడా తేలు కుట్టిన నొప్పి త్వరగా తగ్గిపోతుంది.

**మోకాళ్ళ నొప్పుల నివారణ:** తర్వాత ఇప్పుడు చాలా మందిని బాధిస్తున్న అతి పెద్ద సమస్య 'మోకాలి నొప్పులు'. ప్రస్తుతం 40 సంవత్సరాలు దాటిన వ్యక్తులు కూడా మోకాలి నొప్పులతో భరించలేని బాధను అనుభవిస్తున్న వారు కూడా ఉన్నారు. దీనికి వైద్యంగా ఉదయం నుండి సాయంత్రం వరకు బియ్యం నానబెట్టాలి. సాయంత్రం 'నల్ల ఉమ్మెత్త' ఆకులు కొన్ని తీసుకుని, నానబెట్టిన బియ్యంతో కలిపి రోట్లో వేసి బాగా మెత్తగా దంచి పేస్టులాగా తయారు చేసుకోవాలి. తర్వాత ఆ పేస్టును రాత్రిపూట మోకాలిపైన పట్టీలాగా వేసి, దానిపైన ఒక తమలపాకు పెట్టి కట్టు కట్టుకోవాలి. ఉదయమే ఆ కట్టును విప్పదీసి వేడి నీటితో స్నానం చేసేటపుడు మోకాలిపైన వేడి నీటిని కొద్దిసేపు ధారగా పొయ్యాలి. ఇలా మండలం పాటు (40 రోజులు) చెయ్యగలిగితే మోకాళ్ళ నొప్పి నుండి చాలా వరకు ఉపశమనం పొందవచ్చు.

**గమనిక:** ఈశీర్షికలో ప్రచురించిన వైద్యాలన్నీ ఆయా వ్యక్తుల అభిప్రాయాలు మాత్రమే. వీటిని వాడేముందు విజ్ఞులైన వైద్యులతో సంప్రదించి వాడితే శ్రేయస్కరం.

'వైద్య' ఉమా మహేశ్వర రావు ఫోన్ నెం.: 9440286854

## గాడిద గాడపాకు మొక్కతో వైద్య చిట్కాలు

'గాడిదగడపాకు' అనే మొక్క దాదాపు అన్ని ప్రాంతాలలో విరివిగా పెరిగే మొక్క. ఈ మొక్క స్త్రీలకు సంబంధించిన మరియు మలబద్ధక వ్యాధి గ్రస్తులకు, చర్మ రోగాలు ఇంకా అనేక రకాలుగా వైద్యంగా పని చేస్తుంది.

**గర్భిణీ స్త్రీలకు:** పూర్వం గర్భిణీలకు ప్రసవం చేసేటపుడు 'మంత్రసానులు' ఈ గాడిదగడపాకు ఆకులను సేకరించి, వాటిని నీటిలో శుభ్రంగా కడిగి, రోట్లో వేసి నూరి, రసం తీసి, 10 గ్రాముల రసాన్ని, 10 గ్రా. వంట ఆముదాన్ని కలిపి గర్భిణీ స్త్రీలకు త్రాగించేవారు. ఈ మిశ్రమాన్ని ప్రసవం సమయంలో తాగించినా స్త్రీకి ఎటువంటి అపాయం ఉండదు. ఇలా తాగడం వల్ల గర్భిణీలు కొద్దిపాటి కష్టంతో సుఖ ప్రసవం పొందే వారు. ఆనాడు ఎటువంటి శస్త్ర చికిత్సలు లేకుండా ప్రసవాలు జరిగేవి కాబట్టి, సుఖ ప్రసవం కోసం మంత్రసానులు ఈ చిట్కా ఉపయోగించే వారు.

**వడదెబ్బ:** వేసవి కాలం కొందరికి వడదెబ్బ తగిలి జ్వరం వస్తుంది. అది చలి జ్వంలాగా కూడా అనిపిస్తుంటుంది. ఈ జ్వరం నుంచి ఉపశమనం పొందటానికి గాడిదగడపాకును రోట్లో వేసి దంచి 20 గ్రా. రసం తీసుకుని, ఆయుర్వేద మందులు అమ్మే దుకాణంలో 'వర్ణ ఆవాలు' అని లభిస్తాయి, వాటిని 10 గ్రా., రాతి సున్నం (సున్నపు రాయి అంటారు) 3 గ్రా. తీసుకుని ఆవాలు, సున్నం కూడా మెత్తగా దంచి, 20 గ్రా. ఆకు రసంలో కలిపి జ్వరంతో బాధ పడుతున్న వ్యక్తి వెన్నుపూసపై లేపనంగా పూయాలి. ఇలా చేస్తే చలి జ్వరం త్వరగా తగ్గుముఖం పడుతుంది.

**మూర్ఛ రోగం:** కొందరు వ్యక్తులు మూర్ఛ రోగంతో బాధ పడుతుంటారు. ఆ మూర్ఛ రోగం సమీపంలో ఎవ్వరూ లేని సమయంలో వస్తే చాలా అపాయం, ఒక్కోసారి అపస్మారక స్థితిలోకి వెళ్ళిపోతుంటారు కూడా. అటువంటి వ్యక్తులకు గాడిద గడపాకును అప్పటికప్పుడు తీసుకుని నీటితో శుభ్రంగా కడిగి అరచేతుల్లో వేసి బాగా నలపాలి. తర్వాత మూర్ఛ వచ్చిన వ్యక్తి ముక్కుల్లోని ఒక్కో రంధ్రంలో రెండు లేదా మూడు చుక్కల రసం పిండినట్లయితే, మూర్ఛ రోగి కొద్దిసేపట్లోనే మేలుకుంటాడు.

రక్తస్రావం : కత్తులు, కొడవల్లు ఇతర ఏవైనా వస్తువులు తగిలి గాయాలు అయినపుడు విపరీతంగా రక్తస్రావం జరుగుతూ ఉంటుంది. అటువంటి వ్యక్తులకు గాడిదగడపాకు ఆకులను రోట్లో వేసి లేదా చేతిలో వేసుకుని లేదా రాయిపైన వేసి, మరో రాయితో కచ్చకచ్చగా దంచి ఆ రసాన్ని గాయంపైన వేసి, నలిపిన ఆకును కూడా ఆ గాయంపైనే వుంచి కట్టు కట్టినట్లయితే రక్తస్రావం వెంటనే ఆగి పోయి, గాయం కూడా సెప్టిక్ కాకుండా ఉంటుంది.





'వైద్య' కొమెర జాజి

**వరీ బీజం :** కొంతమంది వృద్ధులకి 'వరిబీజం' ఏర్పడుతూ ఉంటుంది. అంటే వృషణాలు పెద్దవిగా మారి, చాలా క్రిందకు వేలాడటం, వాపు వచ్చినట్లు ఉంటాయి. అటువంటి వ్యక్తులకు గాడిదగడపాకు కొద్దిగా తీసుకుని రోట్లో వేసి మెత్తగా దంచి, అందులో కొద్దిగా ఆముదం కూడా వేసి పేస్టులా తయారు చేయాలి. ఆ తర్వాత ఒక మెత్తటి గుడ్డపైన తమల పాకు పెట్టి, అందులో మెత్తగా దంచిన గాడిదగడపాకు, ఆముదం మిశ్రమాన్ని అందులో పెట్టి, వృషణాలు జారిన వ్యక్తి వృషణాలకు తగిలేలా ఉంచి 'గోచి' లేదా 'లంగోటా' లాగా బిగించి కట్టాలి. ఇలా చేసినట్లయితే ఆ వ్యక్తి వృషణాలు నొప్పి, వాపు తగ్గి మళ్ళీ సాధారణ స్థాయికి చేరుకుంటాయి.

**బహిష్టు నొప్పి:** కొందరు స్త్రీలకు బహిష్టు సమయంలో 'ముట్టు కుట్టు నొప్పి' అని వస్తూ వుంటుంది. దీన్నే ఋతుసోల, నెలసరి నొప్పి అని కూడా అంటూ ఉంటారు. అటువంటి వారికి వైద్యంగా ఒక మట్టి పాత్ర తీసుకుని అందులో కొన్ని గాడిదగడపాకులు వేసి, అందులో కొంత రాళ్ళ ఉప్పు వేసి, కుండపైన మూత పెట్టాలి. ఆ తర్వాత ఆ కుండ క్రింద మంట పెట్టినట్లయితే కొద్ది సేపటికి కుండలో వేసిన ఉప్పు చిటపటమని అంటుంది. ఆ తర్వాత ఆకును ఉప్పుతో సహా తీసుకుని రోట్లో వేసి మెత్తగా దంచి పేస్టులాగా తయారు చెయ్యాలి. ఆ తర్వాత ఒక గ్లాసు నీటిలో 5 గ్రా.ల ఈ దంచిన మిశ్రమాన్ని వేసి, ఆ స్త్రీ చేత తాగించినట్లయితే ఋతుక్రమంలో వచ్చే నొప్పి తగ్గిపోతుంది.

**ప్రేవుల్లో నులి పురుగులు:** కొందరు చిన్న, పెద్ద వ్యక్తులకు ప్రేవుల్లో నులి పురుగులు, క్రిములు ఏర్పడతూ ఉంటాయి. వీటినే ఉదర దోషాలు, ఏలిక పాములు అని కూడా అంటారు. ఏవైనా కడుపులో వచ్చే సర్వ రకాల అంతర క్రిముల నివారణకు 5 గాడిదగడపాకులు, 11 మిరియాలు తీసుకుని, వాటిని రోట్లో వేసి మెత్తగా నూరాలి. ఆ తర్వాత శనగ గింజ లేదా వేరుశనగ గింజంత మాత్రలుగా చేసుకుని వాటిని నీడలో ఆరబెట్టాలి. ఆ తర్వాత పైన చెప్పిన వ్యాధులతో బాధ పడుతున్న వారికి ఉదయం ఒకటి, సాయంత్రం ఒకటి చొప్పున మాత్రలను వేడి నీటితో తీసుకున్నట్లయితే కడుపులో వున్న ఎటువంటి పురుగులైనా సరే విరోచనం ద్వారా బయట పడిపోతాయి. పెద్దవారికి ఒక మాత్ర, చిన్న పిల్లలకైతే అర మాత్ర చాలు.

ఈ వైద్యం పశువుల రోగాలకు కూడా పని చేస్తుంది. కొన్ని పశువులు కడుపులో నులి పురుగులు లాంటివి ఏర్పడటం వల్ల చాలా బాధ పడుతూ ఉంటాయి. అటువంటి వాటికి ఈ మాత్రలు పశువు వయసును బట్టి రెండు లేదా మూడు మాత్రలను నీటిలో వేసి పశువు చేత తాగించినట్లయితే, మల విసర్జన ద్వారా కడుపులోని అన్ని రకాల పురుగులు బయటకు వచ్చి పశువు కూడా త్వరగా కోలుకుంటుంది. ఈ ఆకును మనుషులైనా, పశువులైనా కడుపులో తీసుకోవటం వల్ల ఎటువంటి హాని కలగదు.

**గమనిక:** ఈశీర్షికలో ప్రచురించిన వైద్యాలన్నీ ఆయా వ్యక్తుల అభిప్రాయాలు మాత్రమే. వీటిని వాడేముందు విజ్ఞులైన వైద్యులతో సంప్రదించి వాడితే శ్రేయస్కరం.

'వైద్య' కొమెర జాజి, ఫోన్ నెం.: 9908411700

### బొల్లిపూస ఆలం

'బొల్లిపూస ఆలం' అనే మొక్క పొలాల్లో గట్లవెంట ఉంటుంది. ఇది పైకి ఎగబాకే తీగ జాతి మొక్క. దీని ఆకులు చిన్నవిగా చిలకల వలె ఉంటాయి. అందుకే ఎక్కుడు తీగ అని, చిలక పర్ని అని కూడా పిలుస్తారు. చిన్న చిన్న కాయల్ని కాస్తుంది. ఆ కాయలు తమ పొట్టనిండా గాలిని కలిగి ఉంటాయి. వాటిని చిన్నపిల్లలు తెంపి ఆడుకుంటూ ఉంటారు. అవి నొసలుకేసి కొట్టుకుంటే టప్ మని పగులుతుంటాయి. భలేగా ఉంటుందని గ్రామాల్లో చిన్న పిల్లలు ఆడుకుంటూ ఉంటారు. అయితే ఈ చెట్టు గడ్డలు కరిగించుటలో మంచి ఔషధంగా పని చేస్తుంది. మామిడి పండ్లు ఎక్కువగా తినటం వల్ల వేడి చేసి, శరీర భాగంలో ఎక్కడయినా వేడి గడ్డలు అవుతాయి. వాటిని కాగడ్డలు అని కూడా అంటారు. వీటిని పగిలేలా చేసి, గడ్డను కరిగించి మానేలా చేస్తుంది ఈ బొల్లిపూస ఆలం.

కాగడ్డలు అయినవారు ఈ బొల్లిపూస ఆలం తగినంత సేకరించి, మెత్తగా దంచి, దానిలో కాస్తంత పసుపు, చిటికెడు ఉప్పు వేసి, మెత్తగా దంచాలి. అలా దంచిన తరువాత అది జిగురుగా అవుతుంది. అలా తయారైన జిగురును ఒక ముద్దగా తయారు చేసుకుని, తగినంత తీసుకుని కాగడ్డలపైన వేసి ఒక మెత్తని గుడ్డతో కట్టు కట్టాలి. అలా కట్టిన 2 రోజుల్లో కాగడ్డలు పగిలిపోయి, చీము కారిపోతుంది. అలాగే ఈ ముద్దను రెండు మూడు రోజులు కట్టినట్లయితే వారం రోజుల్లో కాగడ్డ ఆనవాలు కూడా లేకుండా కరిగి గాయం మానుతుంది.

అరకిలో బొల్లిపూస ఆలం ఆకులు సేకరించి, ఒక స్టీలు పాత్రలో వేసి, మునిగే వరకు కొబ్బరి నూనె పోసి, దానిని పొయ్యిమీద పెట్టి మరిగించి, ఆకు కరకరలాడే వరకు ఉంచి, పొయ్యినుండి దించి చల్లారిన తర్వాత వడబోసి, ఆ నూనెను భద్రపరచు కున్నట్లయితే, ఈ నూనె వివిధ రకాలయిన గడ్డలను కరిగించటానికి ఉపయోగించుకోవచ్చు.

ఈ నూనెను బోదెకాలుపై మర్దనా చేయడం వలన మందగించిన నరాలు కరిగి ఆ వ్యాధి తగ్గుముఖం పడుతుంది. కొవ్వు గడ్డలు కూడా కరిగిపోతాయి. మహిళలకు రొమ్ములలో వచ్చే గడ్డలను కరిగించటంలో చాలా బాగా పని చేస్తుంది.



ఎక్కుడుతీగ అనిగాని బొల్లిపూసఅలం అనిగాని పిలుస్తారు



బొల్లిపూసఅలం కాయలు ఈ విధంగా కాస్తుంది.




బాల నర్సయ్య, నల్గొండ జిల్లా

### జుట్టుపాల ఆకు

జుట్టుపాలాకు పొలాల గట్లవెంట వుంటుంది. ఇది కూడా తీగజాతి మొక్క, పైకి ఎగబాకుతుంది. ఈ తీగ కొద్దిగా తెలుపు రంగు కలిగి తిప్పతీగ ఆకులను పోలి (గుండె (ప్రేమ గుర్తు) ఆకారం) వుంటుంది. దీని కాయలు తేలు కాళ్ళవలె, ఎద్దు కొమ్ముల వలె జత కలిగి ఉంటాయి. దీనియొక్క ఆకు తెంపిన వెంటనే పాలు వస్తాయి. ఇది మంచి ఔషధ మొక్క.

ముఖ్యంగా ఇది ఎముకలు (బొక్కలు) విరిగిన వారి కట్లకు ఉపయోగిస్తారు. తగినంత ఆకు, తీగ సేకరించి, దానిని దంచి రసం తీసి (స్వరసం) దానిలో కొంచెం గోధుమ పిండి కలిపి అందులో గుడ్డ తడిపి ఎముక విరిగిన ప్రాంతంలో కట్టు కట్టినయెడల ఎముకలు అతుక్కుంటాయి. ఎముక పగులుడు వచ్చినా సరే ఈ విధంగానే చేయవచ్చు.

ఈ మొక్క పసరును మెడ భాగంలో మర్దనా చేసినట్లయితే తల తిరుగుడు తగ్గుతుంది. మెడనొప్పి కూడా తగ్గి మెడ ఎముకలలో బలం చేకూరుతుంది.




**గమనిక:** ఈశీర్షికలో ప్రచురించిన వైద్యాలన్నీ ఆయా వ్యక్తుల అభిప్రాయాలు మాత్రమే. వీటిని వాడేముందు విజ్ఞులైన వైద్యులతో సంప్రదించి వాడితే శ్రేయస్కరం.
'వైద్య' బాల నర్సయ్య, ఫోన్ నెం.: 6303903400

# స్పందన

**ఎడిటర్ గారికి,**

మాది అనంతపురం జిల్లా ముదిగుబ్బ అనే గ్రామం. 'పల్లెసృజన' ద్వారా వెలుగులోకి వచ్చిన 'తులసి, పర్‌ఫెక్ట్' మందులు మామిడి తోటలకు ఎంతో బాగా పని చేస్తాయని తెలుసుకుని నేను తెప్పించుకుని నా మామిడి తోటకు ఉపయోగించడం జరిగింది. గత 10 సంవత్సరాలుగా ఎన్నో రకాల మందులు ఉపయోగిస్తున్నా తృప్తి కలుగని నాకు ఈ మందుల వినియోగం వల్ల చాలా ఆనందంగా ఉంది. మొదట తులసి మందు పిచికారి చేసిన ఒక వారం రోజుల్లోనే పూత వచ్చేలా మొగ్గలు వచ్చాయి వెంటనే మళ్ళీ ఫోన్ చేసి 'పర్‌ఫెక్ట్' మూలికా పురుగు మందు తెప్పించుకుని పిచికారి చేశాను. పూత బాగా వచ్చి, పిందెలుగా మారింది. మరలా ఫోన్ చేసి అడిగితే మళ్ళీ పర్‌ఫెక్ట్ మందే కొట్టమన్నారు. వెంటనే మళ్ళీ తెప్పించుకుని మామిడి చెట్లపై పిచికారి చేశాను. అంతే కేవలం మూడు స్ప్రేలకే నా మామిడి తోట ఎన్నడూ కాయనంత కాపు కాసింది. కాయలు ఎంతో నాణ్యంగా వచ్చాయి. ఫోన్ చేసి ఈ విషయం చెప్పగా పండ్లు కూడా ఆకర్షణీయంగా ఉంటాయి, రుచి, నాణ్యత కూడా పెరుగుతుంది. నిలువ శాతం కూడా పెరుగుతుంది అని ధైర్యం ఇచ్చారు వీరరాఘవరెడ్డి గారు. వారు చెప్పినట్లే నా తోట మామిడి పండ్లు ఎంతో ఆకర్షణీయంగా, రుచిగా ఉన్నాయి. దిగుబడి కూడా చాలా బాగా వచ్చింది. మా ఊర్లో పదివేలకు పైగా మామిడి చెట్లు ఉన్నాయి. ఇప్పుడు మా ఊరి మామిడి రైతులంతా వచ్చే సంవత్సరం కేవలం 'పల్లెసృజన' వారి మందులనే ఉపయోగిస్తాం అంటున్నారు. ఇంత మంచి రసాయన రహిత పురుగు మందును రైతు లోకానికి అందించినందుకు ధన్యవాదములు.

**– శ్రీనివాస్, ముదిగుబ్బ,** అనంతపురం జిల్లా.

శ్రీనివాస్ గారు,

'తులసి, పర్‌ఫెక్ట్' అనే మూలికా పురుగు మందులు చాలా మంది రైతుల కళ్ళల్లో, మనసులో ఆనందాన్ని నింపాయి. 'పల్లెసృజన' మాటను నమ్మి మీ మామిడి తోటపై పిచికారి చేసి, మీ గ్రామంలోని రైతులందరికీ మార్గదర్శిగా నిలిచినందుకు ధన్యవాదములు. **– ఎడిటర్.**

**ఎడిటర్ గారికి,**

ఈ సంవత్సరం మామిడి పంటపై 'పల్లెసృజన' ద్వారా వెలుగులోకి వచ్చిన 'తులసి, పర్‌ఫెక్ట్' అనే మూలికా పురుగు మందులను గురించి, కేవలం వాటిని మాత్రమే ఉపయోగించిన వారి పంట అధిక దిగుబడి, పండు నాణ్యత, నిలువ శాతం గురించి తెలుసుకుని చాలా సంతోషించాను. చాలా తక్కువ ఖర్చుతో, అధిక దిగుబడులను సాధించిన రైతులతో మాట్లాడటం జరిగింది. మేము కూడా వచ్చే సంవత్సరం నుండి 'పల్లెసృజన' పద్ధతులనే పాటించాలని అనుకుంటున్నాము. కావున దయచేసి వచ్చే సంవత్సరం ఏ మందు ఏయే సమయాల్లో పిచికారి చేయాలి, అలా చేయటం వల్ల పంటపై జరిగే పరిణామాలేమిటి అన్న విషయాలను పూర్తిగా తెలియజేయ వలసిందిగా కోరుతున్నాను. **– జనార్ధన్ రెడ్డి, నల్గొండ.**

**జనార్ధన రెడ్డి గారు,**

ఒక మంచి పనికి పెద్దగా ప్రచారాలు అవసరం లేదు, దానివల్ల లాభపడిన వారి ద్వారా ఒకరి నుండి మరొకరికి 'పల్లెసృజన' ఇన్నోవేషన్లు చేరుకుంటూ ఉండటం మాకెంతో ఆనంద దాయకం. మీకు అవసరమైన వివరాలను తప్పక తెలియజేస్తాము. **– ఎడిటర్**


## FORM IV

***Statement about ownership and other particulars about newspaper (PALLE SRUJANA)***

| | | | |
|---|---|---|---|
| 1. | Place of publication | : | **102, Vayupuri, Sainikpuri Post,** Malkajgiri Mandal, Medchal-Malkajgiri Dist. –500094. Teelangana |
| 2. | Periodicity of its publication | : | **Bi-Monthly** |
| 3. | Printer's Name | : | **P. Ganesham** |
| | Nationality | : | Indian |
| | Address | : | 102, Vayupuri, Sainikpuri Post, Malkajgiri Mandal, Medchal-Malkajgiri Dist. –500094. Telangana |
| 4. | Publisher's Name | : | **P. Ganesham** |
| | Nationality | : | **Indian** |
| | Address | : | 102, Vayupuri, Sainikpuri Post, Malkajgiri Mandal, Medchal-Malkajgiri Dist. –500094. Telangana |
| 5. | Editor's Name | : | **J. Seshi Mohan** |
| | Nationality | : | **Indian** |
| | Address | : | 2-1-513/2, Nallakunta, Hyderabad - 500 044. |
| 6. | Names and addresses of individuals who own the newspaper and partners or shareholders holding More than one per cent of the total capital. | | |

I, **P. GANESHAM**, hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

Date28-02-2017

**Signature of Publisher**

# ఇసుక మిల్లు

## మూడు రకాల సైజుల్లోకి ఇసుక వేర్పడుతుంది



ఇన్నోవేటర్
**శ్రీనివాస రావు**
తూర్పు గోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్

కొన్ని ప్రాంతాలలో ఇసుకలో పెద్ద రాళ్ళతో పాటు గవ్వలు, ఇతర చెత్త పదార్థాలు ఉంటాయి. అలాంటి ఇసుకను గృహ నిర్మాణాలకు అనువుగా మార్చుకోవాలంటే చాలా మంది కూలీలు అవసరం. ఇసుక కొన్నంత ఖరీదు వేరు చేసే కూలీలకు పెట్టాల్సి వుంటుంది. ఈ సమస్య పరిష్కారం కోసం తయారైందే ఈ 'ఇసుక మిల్లు'. ఇందులో నది నుంచి తెచ్చిన ఇసుకను వేస్తే, గవ్వలు, చెత్త చెదారం ఒక వైపు, లావు ఇసుక మరో వైపు, ప్లాస్టరింగ్ చేసే ఇసుక మరోవైపు వస్తాయి. నిర్మాణ కార్మికులు దేనికి అవసరమైన ఇసుక దానికి ఉపయోగించుకుంటారు. కూలీల ఖర్చు చాలా తక్కువ.



వివరాలకు సంప్రదించండి
పల్లెసృజన
77, వాయుపురి, సైనిక్‌పురి పోస్ట్,
సికింద్రాబాద్ - 500 094. ఫోన్ : 040-40253096
E-mail : anchor@pallesrujana.org Visit us : www.pallesrujana.org
హనీబీ
NATIONAL INNOVATION FOUNDATION
E-mail : info@nifindia.org www.nifindia.org
Toll Free : 1800 233 5555



# మోధా లూమ్ లిఫ్టింగ్ యంత్రం

## మగ్గం నేయటంలో శ్రమకు సెలవు



ఇన్నోవేటర్
**మోధా శివకుమార్**
హైదరాబాద్, తెలంగాణ
అంతర్జాతీయ పురస్కార గ్రహీత

1. ఈ యంత్రం అన్ని రకాల చేనేత మగ్గాలకు ఎంతో అవసరం. ముఖ్యంగా గుంత మగ్గాలకు ఎలాంటి మార్పులు, చేర్పులు లేకుండా ఈ యంత్రాన్ని అమర్చి వాడుకోవచ్చు.
2. ఈ యంత్రాన్ని వాడటం వలన చేనేత కార్మికులకు ఎటువంటి శారీరక శ్రమ, అలసట ఉండదు.
3. ముఖ్యంగా వృద్ధులైన చేనేత కార్మికులకు, ఆడ చేనేత కార్మికులకు ఈ యంత్రం ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. వీరు రోజంతా ఎలాంటి అలసట, శ్రమ లేకుండా, ఎలాంటి చేనేత మగ్గాన్ని అయినా అలవోకగా నేయవచ్చు.
4. ఈ యంత్రం అచ్చు మగ్గాలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. సింగిల్ నేత, వరుస నేతలలో కూడా అచ్చులను, జాకార్డ్‌లను రెండింటినీ ఒకేసారి లాగగలదు/ లేపగలదు.
5. రెండు జాకార్డ్‌లను వేరువేరుగా కానీ, ఒకేసారి కానీ లేపగలదు.
6. ఈ యంత్రం ఉపయోగించడం చాలా సులువు. సాధారణ సాంప్ర దాయ చేనేత మగ్గం పనితనాన్ని పోలి ఉంటుంది.




వివరాలకు సంప్రదించండి
పల్లెసృజన
77, వాయుపురి, సైనిక్‌పురి పోస్ట్,
సికింద్రాబాద్ - 500 094. ఫోన్ : 040-40253096
E-mail : anchor@pallesrujana.org Visit us : www.pallesrujana.org
హనీబీ
NATIONAL INNOVATION FOUNDATION
E-mail : info@nifindia.org www.nifindia.org
Toll Free : 1800 233 5555

PALLE SRUJANA Telugu Bi-monthly May - June 2023 RNI No. TELTEL 2012/74620


# పల్లెసృజన

## పాత సంచికలు కావాలా?

ఒక్కో సంచిక రూ. 30/-లు మాత్రమే


























పల్లెసృజన సభ్యులు కండి, పల్లె జ్ఞానాన్ని వ్యాపింపజేయండి. సభ్యులుగా చేరాలనుకున్నవారు చందా కట్టి, మీ చిరునామాను స్పష్టంగా 9866001678 కి పంపడం మరవకండి.

పల్లెసృజన, 102, వాయుపురి, సైనిక్‌పురి పోస్ట్, సికింద్రాబాద్ - 500 094. ఫోన్ : 040-40253096

లేదా నేరుగా ఈ బ్యాంక్ లో జమ చేయండి.

**M/s Pallesrujana, Canara Bank, Sainikpuri, Secunderabad.**
**SB A/c No. 30232200019150, IFS Code : CNRB0013023**

లేదా

"Phone Pe" no 9866 00 1678

QR code for Phone Pe

**సభ్యత్వ వివరాలు (2 సంవత్సరాలకు)**

| వివరములు | వ్యక్తిగతం | లైబ్రరి |
|---|---|---|
| సాధారణ పోస్టు ద్వారా | 400/- | 1,000/- |
| రిజిష్టరు పోస్టు ద్వారా | 640/- | 1,240/- |

'గూగుల్ పే/ ఫోన్ పే' చెయ్యాలనుకున్న వారు 9652801700 నెంబరుకు లేదా ఈ క్యుఆర్ కోడ్ ద్వారా పంపి మీ చిరునామా ఎస్ఎంఎస్ లేదా వాట్స్‌యాప్‌లో పంపండి.